ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 205 పేజీలు: 10+4 వెల: 6.50

అంతరిక్షరంగంలో జెన్ జీ ముందంజ: ప్రధాని మోడీ
బంగ్లాలో హిందూ టీచర్ కుటుంబం దారుణహత్య 5

# అది రాజకీయ 'అడ్డుచక్ర'మే

### బోస్టన్‌కు వెళ్లకుండా వెనక్కి వచ్చేస్తున్నా..
### మద్దతునిచ్చిన పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు ధన్యవాదాలు
### హైదరాబాద్‌లో అన్నీ చెబుతా: సిఎం రేవంత్
### గుజరాత్ సిఎంకు ఇచ్చిన అనుమతి తెలంగాణ సిఎంకు ఎదుకివ్వరన్న ఐఏసి



లండన్‌లో తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని చెప్పారు. లండన్‌లో తాము చేపట్టిన పర్యటన అత్యంత విజయవంతమైందన్నారు. అక్కడ నిర్వహించిన అన్ని అధికారిక సమావేశాలు, షెడ్యూల్ చేసిన కార్యక్రమాలు పూర్తయ్యాయని రేవంత్‌రెడ్డి సోషల్ మీడియాలో ట్విట్టర్ వేదికగా ఆదివారం పోస్ట్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అంశంలో ఊహించని పరిణామం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం లండన్ పర్యటన ముగించుకొని, ముఖ్యమంత్రి అక్కడి నుంచి నేరుగా అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే, విదేశాంగ శాఖ ఆయన పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించింది. విదేశాంగ శాఖ నిర్ణయంతో పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకున్న ముఖ్యమంత్రి,

>>2

### ప్రధాన ప్రాజెక్టుల్లో ఇంకా 293.43 టిఎంసిల లోటు
### గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులకు వరద అంతంతమాత్రమే
### సెప్టెంబర్ నుంచి నైరుతి పవనాలు వెనక్కి
### 43 శాతం మించని నీటి నిల్వలు
### సాగు, తాగునీటి ఎద్దడి అధికమయ్యే అవకాశం

# ఏది కృష్ణా! నైరుతి నీరు?



**హైదరాబాద్,ఆగస్టు 23,ప్రభాతవార్త:** తెలంగాణ నైరుతి రుతుపవనకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో గోదావరి కృష్ణానదులపై నిర్మించిన ప్రధాన ప్రాజెక్టులలోకి నీరు చేరుకోకపోవడంతో సాగు,తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన ప్రాజెక్టుల్లో ఫ్లడ్ కుషన్ నీటి లోటు 293.43 టిఎంసిలు ఉంది. గత ఏడాది ప్రాజెక్టుల్లో ఆగస్టు 23న 87టిఎంసిల ఫ్లడ్ కుషన్ మాత్రమే ప్రధాన ప్రాజెక్టుల్లో ఉంది. నైరుతి రుతుపవనకాలం తెలంగాణలో ఆగస్టు 23నాటికి 517ఎం.ఎం సగటు వర్షాపాతం కురువాల్సి ఉండగా ఇప్పటి వరకు 441.23 ఎంఎం వర్షం మాత్రమే కురిసింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలో కూడా వర్షాపాతం అంతంత మాత్రేమే ఉండటంతో గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులకు అరుదుగా వరదనీరు వచ్చి చేరుతోంది. రాష్ట్రంలో 45 సగటు వర్షపు రోజులు నమోదైనా గోదావరి కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని చెరువులు, చిన్న,మధ్యతరహా ప్రాజెక్టుల్లో కూడా 43శాతం మించి నీటినిల్వలు లేవు. ఇక గోదావరి నదిపై ఉన్న సింగూరు, నిజామ్‌సాగర్,

>>2

# మంత్రి సురేఖపై నేడు చర్యలు?



### బెంగళూరులో ఖర్గేను కలిసిన మంత్రి
### రాష్ట్ర కాంగ్రెస్‌కు చెప్పుకోవాలని ఖర్గే హితవు
### పార్టీనేతలతో నేడు భేటీ కానున్న సిఎం రేవంత్
### క్రమశిక్షణ విషయంలో కఠినమే: మీనాక్షి నటరాజన్ నివేదిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** కర్ణాటకలోని బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ మంత్రి కొండా సురేఖ కలిశారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు, సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యల వివాదంపై ఖర్గేకు సురేఖ వివరణ ఇచ్చినట్లు సమాచారం. కాంగ్రెస్,గాంధీ కుటుంబాన్ని తాను విమర్శించలేదని,కావాలనే తనపై,తన కుటుంబంపై రాజకీయ కుట్ర చేస్తున్నారని వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే తాను రెండుసార్లు వివరణ ఇచ్చానని వెల్లడించారు. అయితే కొండా సురేఖ తీరుపై ఖర్గే అసహనం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఏం చెప్పినా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకే చెప్పుకోవాలని, పార్టీకి నష్టం కలిగేలా మాట్లాడొద్దని సూచించినట్లు సమాచారం. సిఎం రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో కేసి వేణుగోపాల్ సలహా మేరకు వివరణ కోరుతారని తెలుస్తోంది. కాగా, కొండా సురేఖ రెండు, మూడురోజులుగా రాష్ట్ర సీనియర్ మంత్రులు కలిసి వివరణ ఇచ్చుకునేందుకు యత్నించగా ఎవ్వరూ సమయం ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతో బెంగుళూరులో ఆదివారం ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలిసి వివరణ ఇచ్చుకున్నట్లు తెలుస్తోంది. కొండా సురేఖ వ్యవహారంలో సోమవారం ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు సోమవారం ఉదయం సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి రానున్నారు. మధ్యాహ్నం పార్టీ నేతలతో సమావేశమై చిన్నారెడ్డి,మేఘారెడ్డి, కొండా సురేఖల వ్యవహారంపై చర్చించనున్నారు. మంత్రిపై చర్యలకు పార్టీ నేతలంతా పట్టుబడుతుండటంతో సిఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది. కొండా సురేఖను ఏకంగా మంత్రివర్గం నుంచి తొలగించే దిశగానే అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో మంత్రివర్గ ప్రక్షాళన చేసేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పెండింగ్‌లో మంత్రి వర్గ స్థానాల ఖాళీలను భర్తీ చేసేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కొందరు మంత్రుల శాఖలను మార్చడంతో పాటు, కొత్తవారిని మంత్రులుగా చేర్చుకునే అంశంపై ప్రాధాన్యత ఉందని తెలుస్తోంది. మంత్రి కొండా సురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారాలను కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ అంశాలపై ఏఐసీసీకి నివేదిక అందించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పీసీసీ క్రమశిక్షణ కమిటీ కూడా ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. శనివారం గాంధీభవన్‌లో సుదీర్ఘంగా సమావేశమైన కమిటీ ఇవాళ మరోసారి చర్చించే అవకాశం ఉంది. కాగా, రాష్ట్ర కాంగ్రెస్‌లో క్రమశిక్షణ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారాలపై పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు తెలుస్తోంది. క్రమశిక్షణ విషయంలో కఠినంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర

>>2

# ఆటో సమ్మె విరమణ

### మంత్రి పొన్నంతో చర్చలు సఫలం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు సఫలం అయ్యాయి. ఆటో కార్మిక సంఘాల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ప్రకటించారు. ఆటో కార్మిక సంఘాల నిరవధిక బంద్ విరమించుకోవాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి స్పందించి సమ్మె విరమించినట్లు ఆటో కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఈ మేరకు

>>2

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నేటినుంచి బిజెపి దీక్ష 3






### సెప్టెంబరు 2 నుంచి
# బిఆర్ఎస్ సమరభేరి
### కాంగ్రెస్ పాలనపై రాష్ట్రవ్యాప్త నిరసనలు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు23:** అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకివచ్చి.. వందరోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి..తర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు

>>2

# ఎపి మాజీ మంత్రి కారుమూరి అరెస్టు

### లిక్కర్ స్కాంలో రూ. 28 కోట్ల ముడుపుల ఆరోపణ
### ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన ఇడి



**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఏపీలో వైకాపా హయాంలో వెలుగుచూసిన మద్యం రవాణా కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర మాజీ మం త్రి, వైకాపా నేత కారుమూరి నాగేశ్వరరావును కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో అరెస్టు చేశారు. ఈ గోల్‌మాల్‌కు సంబంధించి ఇప్పటికే ముగ్గురిని ఈడీ అరెస్టు చేయగా కారుమూరి నాలుగవ వ్యక్తి కావడం గమనార్హం. వైకాపా హయాంలో మద్యం రవాణా కుంభకోణంపై ఏపీ సర్కారు ఓవైపు విచారణ చేస్తుండగా ఈడీ కూడా దీనిపై విచారిస్తుండడం తెలిసిందే. మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ సాగుతుండడం విదితమే. ఈ నేపథ్యంలోనే ఈ స్కాంకు సంబంధించి ఏపీ బెవరేజెస్ నాటి ఎండి వాసుదేవ రెడ్డితో పాటు కీలక సూత్రధారిగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డిని, కారుమూరి సునీల్ రెడ్డిని ఇదివరకే ఈడీ అ రెస్టు చేసింది. మద్యం రవాణా కుంభకోణంలో కారుమూరి నాగేశ్వరరావుతో పాటు మరికొం దరు కలిసి ఒక ముఠాగా ఏర్పడి సర్కారు ఖజానా కు 195.33 కోట్ల రూపాయల మేరకు నష్టం కలిగించార నేది ఈడీ అభియోగం. ఇందులో కారుమూరి నాగేశ్వరరావు 28 కోట్ల రూపాయలను ముడుపులుగా తీసుకున్నారని ఈడీ కోర్టుకు తెలిపింది. మద్యం రవాణాకు సంబంధించి సిగ్మా సప్లయ్ చైన్ సొల్యూషన్స్‌ను ఫ్రంట్ కంపెనీగా వుంచి గోల్‌మాల్‌కు తెరలేపినట్లు ఈడీ ఆరోపించింది. ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలిగించడంతో పాటు సర్కారీ ఆదాయాన్ని వీరంతా తమ సొంత జేబుల్లో నింపుకున్నారని ఈడీ పేర్కొంది. ఈ కేసులో కారుమూరి నాగేశ్వరరావు కోసం కొంత కాలంగా గాలిస్తున్న ఈడీ అధికారు లు ఆదివారం నాడు కొండాపూర్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. కాగా ఈ స్కాంలో వచ్చిన లాభంలో 96 శాతం సిండికేట్ల ఖాతాల కు వెళ్లగా నాలుగు శాతం సిగ్మా కంపెనీకి వెళ్లినట్లు ఈడీ తేల్చింది. అరెస్టు తరువాత కారుమూరిని ఈడీ అధికారులు నేరుగా బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలించారు.

సిపిఎస్ రద్దు చేసేదాకా పోరాటం 2 వర్షంలోనే ఎల్బీస్టేడియంలో బహిరంగ సభ



కోల్‌కతాలో ఆదివారం వర్చువల్‌గా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్, బెంగాల్ సిఎం అధికారి

## ఏది కృష్ణా! నైరుతి నీరు?

>> శ్రీరామ్‌సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు, కృష్ణానదిపై శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులతో పాటు ప్రధాన ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండటానికి ఇంకా 293.43 టిఎంసిల నీటి వరద రావాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి తగ్గడం ప్రారంభం అవుతోంది.85రోజుల క్రితం నైరుతి రుతుపవనకాలం మొదలు కాగా ఇప్పటి వరకు కేవలం రాష్ట్రంలో సగటు వర్షపు రోజులు 45రోజులు మాత్రమే నమోదైనాయి. ఇక రానున్న36 రోజుల్లో వర్షాలు కురిస్తేనే ఎస్సారెస్పీ,శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీశైలం,నాగార్జున సాగర్‌కు నీరు వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టంకు చేరుకోవాలంటే ఇంకా 136.39 టిఎంసిల వరదనీరు వచ్చి చేరుకోవాలి. శ్రీశైలంకు 47.93టిఎంసిల నీరు వస్తే అది పూర్తిగా నిండుతోంది. శ్రీశైలంలో 215.81టిఎంసిల నీరు నిలువుకొనే సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ పోయిన ఏడాది అందులో ఆగస్టు 23న 197 టిఎంసిల నీరు ఉండేది, ప్రస్తుతం అందులో 167 టిఎంసి నీరు మాత్రమే వచ్చి చేరింది. నాగర్జున సాగర్ 312 టిఎంసిల నీరు నిలువుకొనే సామర్థ్యం కలిగిఉన్నా వర్షాలు పడకపోవడంతో ఎగువనుంచి వరద రాకపోవడంతో అందులో ప్రస్తుతం175టిఎంసిలనీరు మాత్రమే ఉంది. పోయిన ఏడాది ఇదే రోజు 294టిఎంసిలనీరు రిజర్వాయర్‌లో ఉంది. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీలో ఇంకా 36.23టిఎంసిల వరద నీరు వస్తే పూర్తి స్థాయి నీటి మట్టంకు చేరుకొంటుంది. గత సంవత్సరం ఆదివారం రోజున 79.26టిఎంసిలు నీరు ఎస్సారెస్పీలోనీరు ఉంటే ఈయేడు 44.27 టిఎంసిలనీరు వచ్చి చేరింది. ఆలమట్టి 3.88 టిఎంసిల వరద నీరు వస్తే చాలు పూర్తి స్థాయినీటి మట్టంకు రిజర్వాయర్ చేరకొంటుంది. నారాయణపూర్ 0.07 టిఎంసిలు, జూరాల0.34 టిఎంసిలు, తుంగభద్ర 10.97టిఎంసిలు, కృష్ణాడెల్టా 0.0టిఎంసిలు మిడ్‌మానేరు 7.44 టిఎంసిలు, లోయర్‌మానేరు 13.08 టిఎంసిల వరద నీరు వస్తే జలాశయాలు పూర్తి మట్టం చేరుకోవడానికి వీలవుతోంది. కడెం ఇప్పటికే పూర్తిస్థాయిలో 3.50 టిఎంసిల నీరు వచ్చి చేరింది. శ్రీపాద ఎల్లంపల్లిలో 16టిఎంసిల నీరు ఉన్నా అందులో ఫ్లడ్ కుషన్ ఇంకా 3.69 ఉంది అంటే ఇంకా అంత మట్టంనీరు వస్తే పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకొంటుంది. జూరాల నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన నెట్టంపాడు, భీమ కోయిల్‌సాగర్ వంటి వివిధ ప్రాజెక్టులలోకూడా నీరు ఆశించిన స్థాయిలో రాలేదు. అదే విధంగా శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల నుంచి ఎత్తి పోయాల్సిన వివిధ ప్రాజెక్టులు కూడా నీటి జాడలు లేక కళావిహీనంగా ఉన్నాయి. ఏదీ ఏమైనా అక్టోబర్‌నుంచి డిసెంబర్ వరకు కురిసే ఈశాన్య (తిరోగమన) రుతుపవనాలు కరుణిస్తే కనీసం తాగునీటికి ఢోకాలేకుండా పోతుంది.

## 2 నుంచి బిఆర్ఎస్ సమరభేరి

>> వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా ఈ వారం రోజుల కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు డిక్లరేషన్ల పేరుతో ప్రతి ఒక్క మాటను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ అన్నారు. అయితే 1000 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఆ పార్టీ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల తెలంగాణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు.

రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా విధానాలు, వైఫల్యాలు, అవినీతి, అరాచకాలను ప్రజల ముందుంచాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు.

ఆయా వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల తాలూకు బకాయిలను మరోసారి బాకీ కార్డుల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకుపోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతి ఒక్కరినీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి వర్గానికి ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలు, ఆయా వర్గాలకు రావాల్సిన ప్రయోజనాలు, బకాయిల వివరాలను ప్రజల ముందుంచాలని సూచించారు. విద్యార్థులకు రూ.12 వేల కోట్లకు పైగా ఫీజులు చెల్లించకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును అన్ని కాలేజీల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రజల్లో విస్తృతంగా చర్చకు తీసుకురావాలని సూచించారు.

యువతకు ఏ విధంగా ఉద్యోగాలు ఇవ్వకుండా, హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందో ఇప్పటికే సరూర్‌నగర్‌లో నిర్వహించిన సభ, యువ సంగ్రామ సదస్సు ద్వారా ఎండగట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి సంబంధించిన కార్యాచరణలో భాగంగా మరోసారి యువతకు కాంగ్రెస్ చేసిన మోసాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చిన ఆటో డ్రైవర్లు, ఆడబిడ్డలు, అన్నదాతలు, గిరిజనులు, దళితులు, బీసీలు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్క వర్గాన్ని ప్రత్యేకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలని కేటీఆర్ సూచించారు. ఒకే తరహా కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఆయా వర్గాల సమస్యలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించాలని అన్నారు.

## ఆటో సమ్మె విరమణ

>> సంఘాల నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ పక్షాన ఈవి ఆటోలు కొనే ప్రసక్తే లేదు,ఆది దుష్ప్రచారం మాత్రమే, ఆటో కార్మికుల సంక్షేమ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని మంత్రి తెలిపారు.విధివిధానాలకు సెప్టెంబర్ 1వ తేదీన కార్మిక శాఖ, రవాణా శాఖ ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం జరుగనుంది. 2012 తర్వాత ఆటో చార్జీలు పెంచలేదు కాబట్టి ఆటో చార్జీలు పెంచడానికి అంగీకరిస్తూ ఎంత పెంచాలి అనే దానిపై తగిన నివేదిక తీసుకొని సంబంధిత జీవో విడుదల చేయడానికి అంగీకారం కుదిరింది. ఓలా, ఉబెర్ లా మాదిరి ప్రభుత్వం తరుపున యాప్ చేయాలని నిర్ణయం, ప్రభుత్వం ఐటీ శాఖ నుండి యాప్ ప్రారంభించేందుకు తగిన ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు.

ద్విచక్ర వాహనాల్లో రాపిడో,ఓలా ఉబెర్ నడిపే వాటికి ఎల్లో ప్లేట్ ఉన్న వాటికి మాత్రమే ప్రయాణికులను తరలింపు పై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు 12 వేల రూపాయల అంశంపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తగిన అంశాలు పరిగణన లోకి తీసుకొని ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి,సహచ మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో పాత డీజిల్, పెట్రోల్ ఆటోలకు రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటో లుగా మార్చడానికి 1.50 లక్షలు ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు.

కొత్త ఆటోలు కొనుగోలు చేయడానికి సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని, హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి పర్యావరణాన్ని కాపాడడానికి నగరంలో ఈవి ఆటోలుగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్ , జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్ ,శివ లింగయ్య, వెంకట రమణ చర్చలు జరిపారు.

## వారం - వర్జ్యం

24-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.ద్వాదశి పూర్తి
న.పూర్వాషాఢ రా.8.26
వ.తె.5.14-ఉ.6.59
దు1. మ.12.34-మ.1.24
దు2. మ.3.05-మ.3.55
రాహు ఉ.7.30-ఉ.9.00 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** భాగస్వాములు, నమ్మిన సన్నిహితులు, తమ వంతు సహాయసహకారాలను అందిస్తారు. ఋణబాధలు తప్పవు.

**వృషభం :** విద్యా, సాహిత్య కళారంగాలలోని వారికి అనుకూలంగా ఉంటుంది. కీర్తి ప్రతిష్టలు పెంపొందుతాయి. శుభవార్తలు.

**మిథునం :** తక్కువ కాలంలో సాగే తాత్కాలిక వ్యాపారాలు లాభాల బాటలో ఉంటాయి. పోటీ తత్వాన్ని మరింతగా కలిగి ఉంటారు.

**కర్కాటకం :** నిర్మాణాత్మక కార్యక్రమాలలో పురోభివృద్ధి గోచరిస్తోంది. వెన్ను నొప్పి బాధిస్తుంది. క్రయ విక్రయాలు సాగిస్తారు.

**సింహం :** వివాదాస్పద అంశాలను అనుకూలంగా మలచుకోవడానికి యత్నాలను ముమ్మరం చేస్తారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**కన్య :** బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. అనుకూల బదిలీ అవకాశాలు గోచరిస్తున్నాయి. స్త్రీల నుండి సహాయం పొందుతారు.

**తుల :** ఆరోగ్యపరమైన జాగ్రత్తలు అవసరం. పట్టువిడుపు ధోరణిని కలిగి ఉంటారు. శుభ కార్యాలలో పాల్గొంటారు.

**వృశ్చికం :** కార్యాలయంలో చోటు చేసుకునే అంతర్గత రాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. వస్త్రా లాభం కలుగుతుంది.

**ధనుస్సు :** ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం రెండూ కలిసిరావు. సకుటుంబంగా శుభకార్యాలలో పాల్గొంటారు.

**మకరం :** మీ మనోభావాలను అర్థం చేసుకునే వారి వలన ఊరట పొందుతారు. కొత్త ఋణం తీసుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం :** అనుకూల బదిలీ అవకాశాలు గోచరిస్తున్నాయి. ప్రతి విషయంలోనూ ధీమాగా వ్యవహరిస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**మీనం :** వ్యవహారాలలో స్పష్టత లోపిస్తుంది. అదనపు బరువు బాధ్యతలు విసుగుపుట్టిస్తాయి. ఆరోగ్యం, వాహనాల విషయంలో జాగ్రత్త.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అది రాజకీయ 'అడ్డుచక్ర'మే

>> అమెరికా వెళ్లకుండానే లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. సోమవారం ఉదయం వరకు హైరాబాద్‌కు చేరుకుంటారు. గత మూడు రోజులుగా లండన్‌లో తమకు లభించిన అపూర్వ మద్దతుకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని సీఎం తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తీవ్రంగా ఖండించిందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ప్రవర్తిస్తోందని, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను ఇలా అడ్డుకోవడం దారుణమంటూ తనకు మద్దతుగా నిలిచారన్నారు. తనకు కొండంత అండగా నిలిచిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంలో జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తనకు, తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీల నేతలకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బోస్టన్ పర్యటన రద్దు కావడంతో కొన్ని గంటల్లోనే లండన్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. భాగ్యనగరానికి చేరుకున్న వెంటనే విదేశాంగ శాఖ నిర్ణయం, దానికి వెనుక ఉన్న రాజకీయం, పర్యటన వివరాలకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి సమాచారం వెల్లడిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి గత బుధవారం అర్ధరాత్రి ఢిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. లండన్ పర్యటన ముగించుకుని.. అనంతరం యూఎస్‌లో ఆయన పర్యటించాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ యూఎస్ పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించింది. ఆయన పర్యటనను ఎందుకు నిరాకరించామో కూడా వివరించింది. అయితే సీఎం రేవంత్ యూఎస్ పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తూ తీసుకున్న నిర్ణయంపై ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) అమెరికా విభాగం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఇది కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించింది. సిఎం రేవంత్ రెడ్డి తన పర్యటనలో భాగంగా హార్వర్డ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశం కావాల్సి ఉంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు విద్యాపరమైన అవకాశాలను పెంపొందించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. అయితే, ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన లక్ష్యానికి తగిన స్థాయిలో ఈ కార్యక్రమాలు లేవని పేర్కొంటూ కేంద్ర విదేశాంగ శాఖ (ఎంఈఏ) అనుమతి నిరాకరించింది.కేంద్రం నిర్ణయంపై ఐఓసీ అమెరికా విభాగం తీవ్రంగా స్పందించింది. గతంలో గుజరాత్ ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు అనుమతినిచ్చిన కేంద్రం, తెలంగాణ సీఎం పట్ల వివక్ష చూపడం రాజకీయ కక్ష సాధింపేనని విమర్శించింది. అభివృద్ధి, విద్య, ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలను రాజకీయ కోణంలో చూడటం తగదని హితవు పలికింది. ఈ నిర్ణయం వల్ల తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు, విద్యాపరమైన భాగస్వామ్యాలకు ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, ముఖ్యమంత్రి పర్యటన రద్దయినప్పటికీ, రాష్ట్ర అధికారుల బృందం మాత్రం ముందుగా ఖరారైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమెరికా పయనం కానుంది.



ఆదివారం డెహ్రాడూన్‌లో భారీ వర్షాల కారణంగా 'టోన్స్' నది వరదల్లో చిక్కుకుపోయిన ఒక ట్రక్కు

## ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫీల్డ్‌కు మరో అడుగు

### 160 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్

### త్వరలోనే పనులు ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతిపాదిత ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 2,069 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. తొలివిడతగా 160.32 ఎకరాలకు రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అర్లిబి పరిధిలో 58 మంది రైతుల భూములు ఇందులో ఉన్నాయి. కచ్‌కంటి, టాక్లి ప్రాంతాల్లో మరికొంత భూమికి నోటిఫికేషన్ సిద్ధమవుతోంది. 60 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని అధికారులు సూచించారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం అర్లి బి గ్రామ పరిధిలోని 58 మంది రైతుల నుంచి సేకరించనున్న భూమి వివరాలను తాజా నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. అదే మండలంలోని కచ్‌కంటి గ్రామ పరిధిలో 29.19 ఎకరాలతో పాటు టాక్లి గ్రామ శివారులోని మరో 5.20 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ రెడీ చేస్తున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రావు వెల్లడించారు. నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి మరో 60 రోజుల్లో ఎవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలపాల్సి ఉంటుందని అన్నదాతలకు సూచించారు. త్వరలోనే గ్రామసభలు నిర్వహించి పరిహారం విషయంలో అభిప్రాయ సేకరణ చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ అనుమతి లేకుండా నోటిఫికేషన్‌లో పొందుపర్చిన భూములకు సంబంధించిన ఎలాంటి లావాదేవీలు, అభివృద్ధి, తాకట్టు వంటి పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు.

కీలకమైన అనుకుంట, ఖానాపూర్ గ్రామ శివారులో సర్వే పూర్తి చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు ముందుగా మూతపడ్డ సీసీఐ భూములను సేకరిస్తారని ప్రచారం జరిగినా.. వాటి జోలికి వెళ్లడం లేదని అధికారులు చెప్పారు. దీంతో ఆ పరిశ్రమ తిరిగి తెరుచుకునే ఆశలు సజీవంగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ఆదిలాబాద్ పట్టణం నుంచి అనుకుంట మీదుగా వెళ్లే ప్రధాన దారిని కచ్‌కంటి గుండా మళ్లిస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయా గ్రామస్థుల్లో కలవరం మెదలైంది. తాజాగా బెంగళూరు నుంచి వచ్చిన ఇండియన్ కోస్ట్ గార్డ్ సర్వేను విభాగ బృందం ఏరియల్ సర్వే చేయడం.. దాంతో పాటుగా భూసేకరణ ప్రక్రియ ఊపందుకోవడం ప్రతిపాదిత ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధిపై ఆదిలాబాద్ జిల్లా వాసుల్లో ఆసక్తి నెలకొంది.

## రీజినల్ రింగ్ రైలు ఉత్తర భాగం డిపిఆర్ సిద్ధం

### రూ.11,517 కోట్లతో పనులు..

### త్వరలోనే పట్టాలెక్కనున్న ప్రాజెక్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** తెలంగాణలో రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకీలక దశకు చేరుకుంది. ఈ ప్రాజెక్టు ఉత్తర భాగం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) రెడీ అయింది. రీజినల్ రింగు రైల్ నిర్మాణానికి రూ.11,517.51 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను గత జులై 30న కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. తాజాగా సమర్పించిన ప్రాజెక్టు ఎలైన్‌మెంట్, డీపీఆర్‌లోని ఇతర సాంకేతిక అంశాల్ని రైల్వే బోర్డు క్షుణ్ణంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది. కాగా, హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు చుట్టూ.. నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ ఏడాది క్రితమే ఖరారైంది.రింగు రోడ్డు మాదిరిగానే.. ఉత్తర, దక్షిణ భాగాలు మొత్తం కలిపి 392 కిలోమీటర్ల దూరంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. రింగు రైల్ డీపీఆర్ తుది దశకు చేరిన సమయంలో ఈ ప్రాజెక్టుకు భూసేకరణ అంశం కీలక మలుపు తీసుకుంది. ముందుగా ఖరారు చేసిన రింగ్ రైల్ ఎలైన్‌మెంట్ రీజినల్ రింగ్ రోడ్డుకు 25 కి.మీ. దూరంలో ఉంది. అయితే, అటు ఆర్ఆర్ఆర్‌కు, ఇటు రీజినల్ రింగ్ రైల్‌కు మధ్యన దూరం ఎక్కువగా ఉండటంతో పాటు. విడివిడిగా రెండుసార్లు భూసేకరణ చేయడం కష్టం అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చెప్పినట్లు తెలిసింది. ఆర్ఆర్ఆర్‌కు పక్క నుంచే రింగ్ రైలు వస్తే భూసేకరణ సులభం అవుతుందని వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రీజినల్ రింగ్ రైల్ ఎలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు చేశారు. రీజినల్ రింగు రోడ్డుకు అనుగుణంగా రింగ్ రైల్ ఎలైన్‌మెంట్‌ను రూపొందించినట్లు సమాచారం. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్ సర్వేకు కేంద్రం 2023 జూన్ మాసంలోనే అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌లో ఉత్తర భాగం డీపీఆర్ ఇప్పటికే పూర్తయి కీలక దశకు చేరుకుంది. దక్షిణ భాగం ఎలైన్‌మెంట్‌పై మాత్రం తుది నిర్ణయం రావాల్సి ఉంది. ప్రభుత్వం, ఎన్‌హెచ్ఏఐ సమన్వయంతో రింగ్ రైల్ ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే తెలంగాణ స్వరూపమే మారిపోనుంది.

## మంత్రి సురేఖపై నేడు చర్యలు?

>> ఇన్‌ఛార్జ్ మీనాక్షినటరాజన్ ఈ వ్యవహారంపై పూర్తి ఆధారాలతో ఏఐసీసీకి నివేదిక ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నిన్న గాంధీభవన్‌లో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి జారీ చేసిన షోకాజ్ నోటీసులకు ఇప్పటికే ఇద్దరూ తమ వివరణలు ఇచ్చారు. ఆ వివరణలను క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయిలో పరిశీలించినట్లు సమాచారం. అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు కూడా కీలకంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్రంగా చేసుకుని సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఈసారి క్రమశిక్షణ విషయంలో స్పష్టమైన సందేశం ఇవ్వాలన్న ఆలోచనలో ఏఐసీసీ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# సిపిఎస్ రద్దు చేసేదాకా పోరాటం

### నవంబరు 17న సామూహిక సెలవు

### జిల్లాల్లో సత్యాగ్రహ దీక్షలు

### వర్షంలోనే ఎల్బీస్టేడియంలో భారీ బహిరంగ సభ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు23:** తెలంగాణ రాష్ట్రంలో గత 22 ఏళ్లుగా కొనసాగుతున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని సీపీఎస్ ఉద్యోగులు స్పష్టం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్(ఓపీఎస్)ను అమలు చేసే వరకు పోరాటం ఆగదని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టిఎస్ సీపీఎస్ ఈయూ) స్పష్టం చేశారు. సీపీఎస్ రద్దు కోసం నవంబర్ 17న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టాలని, అదే రోజు జిల్లా కేంద్రాల్లో సత్యగ్రహ దీక్షలను చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దు కోసం యూనియన్ ఆదివారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చారు. సభ ప్రారంభానికి ముందు నుంచి హైదరాబాద్‌లో వర్షం కురుస్తున్నప్పటికీ ఉద్యోగులు తమ సమస్య పరిష్కారం కోసం వచ్చామని, వానను సైతం లెక్కచేయకుండా ఉద్యోగులు బహిరంగ సభ పూర్తయ్యే వరకు స్టేడియంలోనే ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ ప్రారంభంకాగా. గత 22 ఏళ్లుగా సీపీఎస్ విధానంతో సతమతమవుతున్న రాష్ట్రంలోని 2.6 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల పక్షాన జనజాగరణ సభను నిర్వహించారు.సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ అధ్యక్షతన జరిగిన ఈ సభకు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ నేతృత్వం వహించారు.స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. జూలై 11న ప్రారంభమైన జనజాగరణ యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాల్లో రెండు దశలుగా కొనసాగిందని మొత్తం 119 నియోజకవర్గాల్లో స్థానిక సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులను కలుపుకుని స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల వద్దకు వెళ్ళి కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీని గుర్తుచేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ గాంధేయ మార్గంలో సవినయంగా వినతిపత్రాలు సమర్పించారు. ఆ 41 రోజుల సుదీర్ఘ యాత్రకు ముగింపు సభగానే ఆదివారం చలో హైదరాబాద్ జనజాగరణ సభను నిర్వహించినట్టు తెలిపారు.22 సంవత్సరాలుగా సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కరువై ఎన్నో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 5000కు పైగా రిటైర్మెంట్లు జరిగినా కానీ ఏ ఒక్కరికీ కూడా కనీసం 5000 రూపాయల పెన్షన్ కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఎక్కడో యుద్ధం జరిగితే తెలంగాణలో ఉన్న సీపీఎస్ ఉద్యోగి ప్రాన్ అకౌంట్ లో సొమ్ము ఆవిరి అయిందని మండిపడ్డారు. ఉద్యోగుల సొమ్మే కాకుండా ప్రభుత్వం సొమ్ము కూడా మార్చి ఒక్క నెలలోనే రూ.1800 కోట్లు అవిరైయ్యాన్నారు. పాత పెన్షన్ విధానంలో ఉన్న మాదిరిగా కనీస పెన్షన్ హామీ కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేశారు. గత 12 ఏళ్లుగా సీపీఎస్ సంఘం చేసిన పోరాటాల వల్లే సిపిఎస్ ఉద్యోగులకు డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాడ్యుటీ (డిసిఆర్జీ) సాధించుకున్నామన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ లలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిన విధంగానే మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోడే అయిన నవంబర్ 17 నాటికి ప్రభుత్వం స్పందించి సిపిఎస్ రద్దుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, ఒకవేళ స్పందించని పక్షంలో అదే నవంబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులందరూ సామూహిక సెలవులు పెట్టి, జిల్లా కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలతో తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేద్దామన్నారు.



హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎస్ ఉద్యోగులు

# ఆక్రమణల చెరలో ఆగ్రోస్ భూములు

**బెల్లంపల్లిలో 543 ఎకరాలు కబ్జా**

**వివిధ ప్రాంతాల్లో మరికొన్ని ఆక్రమణలు**

**సర్కార్‌కు అధికారుల నివేదిక**

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) సంస్థకు చెందిన వందలాది ఎకరాల విలువైన భూములు అక్రమార్కుల కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. మౌలాలితో పాటు, ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో ఆగ్రోస్ భూములు ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించినట్లు తెలియవచ్చింది. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఆక్రమణలకు సంబంధించి ముఖ్యంగా రాష్ట్రంలోని ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లి పరిధిలో ఏకంగా 543 ఎకరాల ఆగ్రోస్ భూమి కబ్జా అయినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లా పరిధిలోని మౌలాలిలో 24 ఎకరాలు కబ్జా అయ్యాయి. ఈ మేరకు ఆగ్రోస్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆగ్రోస్‌కు చెందిన 29/1, 31 సర్వే నంబర్లు కలిగిన 23 ఎకరాల 28 గుంటల భూములు హైదరాబాద్ జిల్లాలోని మారేడ్‌పల్లి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ మండలాల తహశీల్దార్ల పరిధిలో ఉంది. ఆగ్రోస్ అధికారులు ఈ భూములకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో రియల్టర్లు, స్థానికులు, భూఆక్రమణదారుల కన్ను ఈ భూములపై పడి ఆక్రమణలకు గురైంది. అలాగే మేడ్చల్ జిల్లా బాలానగర్ మండల పరిధిలోని చింతల్‌లోని సర్వే నంబర్లు 221, 222లోనూ ఆగ్రోస్‌కు 10 ఎకరాల భూమి ఉండగా, అందులో కొంత భాగం కబ్జాకు గురైంది. ఇక హైదరాబాద్ జిల్లా షేక్‌పేట్‌లోని సర్వే నంబర్ 403లో 687 గజాలను కూడా కబ్జాదారులు కబళించేందుకు యత్నించగా ఆగ్రోస్ ఇటీవల కంచె నిర్మించి, బోర్డును ఏర్పాటు చేసింది. ఇక ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లిలోని సర్వే నెంబర్లు 18/19, 18/26, 18/27లో ఆగ్రోస్‌కు 543 ఎకరాల 15 గుంటల భూమి ఉంది. ఇది ఆక్రమణకు గురైందని ఆగ్రోస్ అధికారులు ఇటీవలే గుర్తించి, ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించారు. హైదరాబాద్ శివారులోని మౌలాలిలో ఆగ్రోస్‌కు చెందిన సుమారు 24 ఎకరాల భూమి కబ్జాలపై స్పందించిన ఆగ్రోస్ అధికారులు ప్రభుత్వానికి, అలాగే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరినట్లు తెలుస్తోంది. కాగా మౌలాలిలోని వివాదాస్పద మరియు మిగిలిన ఆగ్రోస్ భూమిని రక్షించి వినియోగించుకునేలా రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్‌కు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# బిజెపిని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఆగస్టు 23, ప్రభాతవార్త:** బిజెపిని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం నగర కార్యాలయంలో జిల్లా పదాధికారులు, మోర్చా అధ్యక్షుల సమావేశం జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, భవిష్యత్తులో పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 'సర్' విషయంలో బూత్ స్థాయిలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, రాష్ట్ర నాయకులు ఒ. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రభారి వీరెల్లి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, గడ్డం వెంకటస్వామి, కన్నె రమేష్‌యాదవ్, జె.ఎల్.రాహుల్‌చంద్ర, మోతుకుల శ్యాంరాజ్, కుంబాల గంగరాజు, పందిర్ల ప్రసాద్, పవన్, సుప్రియగౌడ్, ఏకల కన్నా, ఆఫీస్ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, మీడియా కన్వీనర్ భుజేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గణేష్, ఒబిసి మోర్చా అధ్యక్షులు బంగారు ప్రకాష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు అంబేద్కర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, యువమోర్చా అధ్యక్షులు భరత్ గౌడ్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం

**సమ్మె నిర్ణయాన్ని వారు ఉపసంహరించాలి: మంత్రి పొన్నం**

# ఆటో కార్మికుల సమస్యల పరిష్కరిస్తాం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** డీజిల్, పెట్రోల్ ఆటోలను రేటిరోఫిట్మెంట్ చేయడానికి ప్రతి ఆటోకు రూ.150లక్షలు ఆర్థిక సహాయం చేసిఎలక్ట్రిక్ ఆటో లకు మారేందుకు చర్యలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటోకార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సమ్మె నిర్ణయం వెనక్కితీసుకోవాలని మంత్రి పొన్నం కోరారు. 2015 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదనీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ఆటో చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామనీ హామి ఇచ్చారు. కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేసి, అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామనీ తెలిపారు. దీనికి అవసరమైన విధివిధానాలను రూపొందించి బోర్డు ఏర్పాటు చేస్తామనీ తెలిపారు.

హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆటో కార్మికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చే రెట్రోఫిట్మెంట్‌కు ప్రభుత్వం ప్రోత్సాహం అంది స్తుందనీ చెప్పారు. ఎలక్ట్రిక్ ఆటోలకు మారేందుకు ప్రతి ఆటోకు రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వ సహాయం చేసేందుకు కేబినెట్ లో నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ గుర్తుచేశారు. పాత ఆటోను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేసుకునే వారికి కూడా ప్రభుత్వం సహకరిస్తుంది. హైదరాబాద్‌లో దశలవారీగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. .గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందనీ చెప్పారు. వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి విధానంతో వారికి మరింత ప్రయోజనం కల్పించవచ్చో ప్రభుత్వం పరిశీలిస్తోందని వివరించారు. ఆటో కార్మికులు కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం తదితర సంక్షేమ కార్యక్రమాల్లో అర్హులైన ఆటో కార్మికుల కుటుంబాలకు కూడా ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందనీ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన విధంగానే ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. సమ్మె ద్వారా సమస్యలు పరిష్కారం కావు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. హైదరాబాద్ లో లేకపోవడం వల్ల ఆటో కార్మిక సోదరులకు హుస్నాబాద్ నుండి విజ్ఞప్తి చేస్తున్నాటో కార్మికులు సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి సహకరించాలనీ కోరారు.

# నేడు 'సర్' ఫేజ్-2 పై కాంగ్రెస్ జూమ్ సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** 'సర్' ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఐదున్నరకు అత్యవసర జూమ్ సమావేశం ఏర్పాటు చేశామని పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, పోటిచేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు పార్లమెంట్ సర్ కోఆర్డినేటర్లు, అసెంబ్లీ సర్ కోఆర్డినేటర్లు విధిగా ఈ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సావంత్ ఈ సమావేశంలో పాల్గొని 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో గ్రామసభ / వార్డు సభలను నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను ఈ సమావేశంలో సమీక్షించి, తుది కార్యాచరణను ఖరారు చేయడం జరుగుతుందని వివరించారు. అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో 100 బూత్‌ల వారీగా కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవడానికి వ్యూహరచన చేసి వివరిస్తారని తెలిపారు.

# వైద్యుల నిర్లక్ష్యం

**పుట్టిన బిడ్డకు తొడలో ఇరుక్కున్న ఇంజక్షన్**

**నెలపాటు చిన్నారి నరకయాతన**

**మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులు సిబ్బంది నిరక్ష్యం ఒక చిన్నారికి శాపంగా మారింది. అప్పుడే పుట్టిన బిడ్డకు టీకాలు వేయడంతో అదే సమయంలో ఒక ఇంజక్షన్ తొడలో ఇరుక్కొనిపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. దాదాపు నెలరోజుల పాటు చిన్నారి నరకయాతన అనుభవించింది. నారాయణపేట జిల్లాకు చెందిన వెంకటరమణ, అక్షి త దంపతులు డెలివరీ కోసం జూలై 19న మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానలో అడ్మిట్ అయ్యారు. 20న అక్షి త చిన్నారికి జన్మిచ్చింది. శిశువును వారం రోజులపాటు దవాఖానాలోనే ఎన్‌ఐసీయూలో ఉంచారు. పుట్టిన బిడ్డలకు టీకా వేసే సమయంలో సూది కాలు తొడలోనే ఇరుక్కొనిపోయింది. దాదాపు పది రోజులు దవఖానలోనే ఉన్న కూడా వైద్యులు కానీ సిబ్బంది కానీ గుర్తించలేదు. దవాఖానలో ఉన్నప్పుడు కూడా ఇంకా వాపు పోలేదని తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించగా కొన్ని రోజుల తర్వాత తగ్గు తుందని చెప్పడంతో వాళ్ల డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లారు. ఇంటిదగ్గర వారం రోజులు అయినా కూడా వాపు తగ్గకపోవడమే కాకుండా శిశువు తరచూ ఏడుస్తూ ఉండడంతో వెంటనే కోస్గిలోని ఓ ప్రైవేటు దవాఖానకు వెళ్లగా అక్కడ ఎక్స్‌రే తో పాటు స్కానింగ్ చేయడంతో తొడలో సూది ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. చిన్నారి ఎక్కడ జన్మించిందని అడగడంతో వాళ్లు మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలోనే శిశువు జన్మించిందని చెప్పక అక్కడికే వెళ్లి సంప్రదించాలని సదరు ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు చెప్పడంతో తిరిగి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి వచ్చారు. దవాఖాన సూపరింటెండెంట్ మాట్లాడుతూ నిరక్ష్యం ఎక్కడ జరిగిందో గుర్తించి వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చిన్నారికి సూదిని తొలగించి మెరుగైన వైద్యం అందించి డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు.

# తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో జనసేన

**పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీనివాసరావు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు23:** తెలంగాణలో రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన పార్టీ ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి డాక్టర్ గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఎన్నికలకు ఇతర పార్టీల కంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా జనసేన రాజకీయంగా ముందడుగు వేసింది. గతంలో వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించిన గడల శ్రీనివాసరావును పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయాలని పార్టీ నేతలు నేమూరి శంకర్ గౌడ్, రామ్ తాళ్లూరి జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు.
అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం పలు అంశాలను పరిశీలించిన అనంతరం గడల శ్రీనివాసరావు పేరును ఖరారు చేసినట్లు జనసేన ప్రకటించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో జనసేన ఇప్పటి నుంచే కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రుల ఓటర్లను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థి ఎంపికపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. వైద్య, ఆరోగ్య రంగంలో పనిచేసిన అనుభవం ఉన్న గడల శ్రీనివాసరావును బరిలోకి దింపడం ద్వారా పట్టభద్రులు, ఉద్యోగులు, యువతతోపాటు వివిధ వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.
ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిని ప్రకటించడం ద్వారా ప్రచారం, ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై ముందుగానే దృష్టి పెట్టే అవకాశం జనసేనకు లభించింది. పవన్ కల్యాణ్ ఆమోదంతో అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# చిన్నారెడ్డి సంజాయిషీ సంతృప్తిగా లేదు

**క్రమశిక్షణ చర్యలు చేపట్టాల్సిందే : వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యాఖ్యానించడమే కాకుండా క్రమశిక్షణ కమిటీ నోటీసులకు చిన్నారెడ్డి ఇచ్చిన సంజాయిషీ కూడా సరిగాలేదని క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందేనని ఎమ్మెల్యే మేఘారెడ్డి పార్టీ నాయకత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి క్రమశిక్షణా కమిటీ సంఘం ముందు హాజరై, తాను పార్టీ కార్యకర్తల మనోభావాలు మాత్రమే చెప్పాను తప్ప ఏ ఒక్కరినీ అవమా నించేలా వ్యాఖ్యానించలేదని సంజాయిషీ ఇచ్చుకున్నారు. అయితే దీనిపై వనపర్తి ఎమ్మెల్యే టి. మేఘారెడ్డి ఆదివారం స్పందిస్తూ చిన్నారెడ్డిపై క్రమ శిక్షణా చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. చిన్నారెడ్డి పార్టీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యల ఆడియో, వీడియో పక్కా ఆధారాలతో క్రమశిక్షణా కమిటీకి ఇదివరకే అందజేశానని చెప్పారు.

# ఖలిస్థానీ నిజ్జర్‌ను చంపింది మేమే


**గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ సంచలన ప్రకటన**

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** భారత్, కెనడాల మధ్య దౌత్య యుద్ధానికి దారితీసిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్‌ను హత్య ఉదంతంలో తాజాగా సరికొత్త విషయాలు వెలుగు చూశాయి. నిజ్జర్‌ను చంపింది తామేనని అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ సంచలన ప్రకటన చేశాడు. డ్రగ్స్ స్మగ్లింగ్, ఆయుధాల అక్రమ రవాణా కారణాలతోనే నిజ్జర్‌ను చంపినట్లు బ్రార్ వెల్లడించాడు. 2023 జూన్ 18వ తేదీన నిజ్జర్‌ను కెనడాలోని గురుద్వార వద్ద పార్కింగ్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అతి సమీపం నుంచి తుపాకులతో కాల్చి చంపడం తెలిసి ందే. ఆ సమయంలో కెనడా ప్రధానిగా వున్న జస్టిన్ ట్రూడో నిజ్జర్ హత్యలో భారత నిఘా వర్గాల హస్తం వుందని తమ ఇంటెలిజెన్స్ అధికా రులు గుర్తించినట్లు ఆ దేశ పార్లమెంట్‌లో వెల్లడించడం సంచలనం రేపింది. దీనిని భారత్ తీవ్రంగా ఖండించింది. అయితే భారత్ వాదనలను కెనడా పట్టించుకోక పోవడంతో దౌత్య యుద్ధం ముదిరి



కెనడాలో 2023 జూన్‌లో హత్యకు గురైన నిజ్జర్

ఇరుదేశాలు పరస్పరం రాయబారులను బహిష్కరించుకున్నాయి. ఈ ఘటన తరువాత భారత్, కెనడాల మధ్య రెండేళ్లకు పైగా దౌత్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చివరకు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం కూలిపోవడం, కొత్త సర్కారు రావడం, అనంతరం జరిగిన పరిణామాల వల్ల తిరిగి రెండు దేశాల మధ్య సంబంధాలు బాగుపడ్డాయి. ఇదే సమయంలో అమెరికా, బ్రిటన్ ప్రభుతాలు నిజ్జర్ హ త్యలో భారత్ హస్తం లేదని ప్రకటించడం, ఇది నిజమని కెనడా సర్కారు అంగీకరించిన తరువాత దౌత్య సంబంధాలను పూర్వస్థాయికి వచ్చాయి. ఇక తాజా విషయానికి వస్తే నిజ్జర్ హత్యలో తమ హస్తం వుందని అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ పేర్కొనడం సంచలనం రేపింది. బ్రిటన్‌కు చెందిన మరో ఖలిస్తాని ఉగ్రవాది పరంజిత్ సింగ్ పన్నూతో మాట్లాడిన సమయంలో బ్రార్ ఈ విషయ ం వెల్లడించినట్లు కెనడాతో పాటు బ్రిటన్ దేశాల నిఘా వర్గాలకు సమాచారం అందాయి. నిజ్జర్ ఒక దుర్మార్గుడని డ్రగ్స్ స్మగ్లింగ్ ద్వారా కోట్లాది డాలర్లు సంపాదించాడని, 16, 17 ఏళ్ల యువకులను ఇందుకోసం ఉపయోగించే వాడని, యువకులను డ్రగ్స్ స్మగ్లింగ్‌కు రావాలని బ్లాక్ మెయి ల్ చేసేవాడని బ్రార్ చెప్పాడని నిఘా వర్గాలు అందించిన నివేదికలో వుంది. దీంతో పాటు మైనర్లను టీనేజి యువకులను ఇన్‌ఫార్మర్లుగా వాడు కునేవాడని, తన మాటకు ఎదురుచెప్పితే వారిని నిర్దాక్షిణ్యంగా చంపేసేవాడని బ్రార్ తెలిపాడు. దీంతో పాటు నిజ్జర్ ఆయుధాల వ్యాపారంలో నూ ఆరితేరాడని, అందుకే అతన్ని చంపేసినట్లు బ్రార్ తెలిపాడు.



# ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌పై నేటి నుంచి బిజెపి దీక్ష

**పోలీసుల ఆంక్షలపై భయపడేది లేదు:**

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు23:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణలో ఛత్రోంకీ గూంజ్ పెట్టాలని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు సవాల్ విసిరారు. తెలంగాణకు రావాలని రాహుల్ గాంధీని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణకు రాహుల్ గాంధీని ఒక్క విద్యార్థి కూడా రానివ్వడని అన్నారు. తెలంగాణలో అడుగుపెడితే రాహుల్ గాంధీని విద్యార్థులే అడ్డుకుంటారని తెలిపారు. గతంలో హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీ.. విద్యార్థులకు ఇచ్చిన హామీలు మరిచిపోయారని ఆయన పేర్కొన్నారు. ఆదివారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యార్థుల సమస్యలపై బీజేపీ కార్యాలయం ముందు రెండు రోజులు నిరాహార దీక్ష చేస్తామని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ఈ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లు ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి విద్యాసంస్థలు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తమ నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదన్నారు. పోలీసుల అనుమతి లేకున్నా.. పార్టీ కార్యాలయంలోనే తమ దీక్ష చేపడతామని ప్రకటించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రూ.4 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని చెప్పారు. హైకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంలో ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని హైకోర్టు నడిపిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి మారుపేరని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబం.. రాష్ట్రాన్ని దోచుకుందనే అభియోగం ఉండేదని.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సోదరుల మీద అలాంటి ఆరోపణలు వస్తున్నాయన్నారు.
22ఏ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో అంతర్గత అసమ్మతి పెరిగిందని అభిప్రాయపడ్డారు. ఏ ప్రభుత్వం అయినా ఐదేళ్లు పూర్తి చేయాలని కోరుకుంటున్నామని చెప్పారు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లు అధికారంలో ఉండే అవకాశం లేదని జోస్యం చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు తమ పార్టీ చేయదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టీ బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు వెల్లడించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు మోదీ 25 సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర పథకాల లబ్ధిదారులను నేరుగా కలవాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించిందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట సోమ వారం నుంచి 2 రోజుల నిరాహార దీక్ష తలపెట్టగా, ప్రభుత్వం పోలీ సుల ద్వారా అనుమతి నిరాకరించి రిజెక్షన్ లెటర్ పంపింది. పోలీసుల ఆంక్ష లకు భయపడేది లేదు. రోడ్డుపై కాకపోతే పార్టీ కార్యాలయ ప్రాంగణంలోనే ఈ రెండు రోజుల నిరాహార దీక్షను నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో పార్టీ పటిష్టతపై రాష్ట్ర నేతలకు ప్రధాని మోడీ, నితిన్‌నబీన్ దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఢిల్లీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ నాలుగు గంటల పాటు రాష్ట్ర నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేశారని, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సంస్థాగత పటిష్టతపై సూచనలు ఇచ్చారని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదన్నారు. ఎన్నికల వేళ తెలంగాణ విద్యార్థులకు యూత్ డిక్లరేషన్ పేరుతో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించారు. పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జీలు జరుగుతుంటే, ఆయుష్ విద్యార్థులు స్టైపెండ్ల కోసం పోరాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై మాట్లాడకుండా విదేశాలకు పారిపోతూ రోడ్లపై డ్రామాలు చేసే రాహుల్ గాంధీకి దమ్ముంటే హైదరాబాద్‌కు వచ్చి విద్యార్థుల సమస్యలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణలో విద్యార్థులు రాహుల్‌గాంధీని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. జెన్ జెడ్ వంటి పదజాలాలు అర్బన్ నక్సల్స్, అల్ట్రాలెఫ్ట్ భావజాలం సృష్టించినవని, దేశంలో ఉన్నది కేవలం యువ భారత్ మాత్రమేనని స్పష్టం చేశారు.

# మంత్రి కొండా సురేఖ మాజీ ఒఎస్డీ కోసం పోలీసుల వేట

**డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు**

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిపై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మంత్రి కొండా సురేఖ మాజీ ఒఎస్డీ నార్ల సుమంత్, అతని అనుచరుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఒకవైపు టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందంతో పాటు మరోవైపు జూబ్లీహిల్స్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి గాలింపును ముమ్మరం చేశారు. ఇందుకోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ జోన్ అదనపు డిసిపి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. బోడుప్పల్ ఆర్టీసీ కాలనీకి చెందిన గోంగిడి హరికృష్ణ(36) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. జులై 30న సుమంత్‌తోపాటు అతని అనుచరులు జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో ఇనుపరాడ్డుతో హరికృష్ణపై దాడి చేశాడు. ఈ మేరకు ఈ నెల 22న హరికృష్ణ తొలుత మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ కింద కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ ఠాణాకు బదలీ చేశారు. ఈ వ్యవహారంలో సుమంత్‌తోపాటు ప్రశాంత్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కార్తీక్, మహేందర్‌రెడ్డి, రాము తదితరులపై పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. కాగా నిందితులంతా ఇప్పటికే తమ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేశారు. కొత్త ఫోన్లను ఖరీదు చేసి నగరం నుంచి బయటకు పారి పోయినట్లు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గుర్తించారు. వారిని ఇప్పటికే కొన్ని బృందాలు వెంటాడుతున్నట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. మరోవైపు సుమంత్ డ్రైవర్ నవీన్‌ను తెల్లాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.
మరోవైపు సుమంత్ నగరంలోనే సురక్షితమైన ప్రాంతంలో తలదాచుకొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు నిందితుల కుటుంబ సభ్యుల కదలికలపై పోలీసులు దృష్టి పెట్టారు. దాదాపు నాలుగైదు ప్రత్యేక బృందాలను ఇప్పటికే ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రిలోగా నిందితులు చిక్కే అవకాశం ఉందని, లేదంటే సోమవారం ఖచ్చితంగా వారిని పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# కన్నతల్లిని కడతేర్చిన కిరాతకుడు

**మద్యం మత్తులో తల్లిపై దాడి**

**వనపర్తి క్రైమ్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మద్యం మత్తులో ఉన్న కుమారుడు బలమైన ఆయుధంతో తల్లి తలపై దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వనపర్తిలోని గాంధీనగర్ 20వ వార్డులో ఆదివారం చోటుచేసుకుంది. 20వ వార్డుకు చెందిన రజియా బేగం(60) తన కుమారుడు ఆసిఫ్‌తో కలిసి నివాసముంటున్నది. మద్యానికి బానిసైన కుమారుడు అసిఫ్ తరచూ డబ్బుల కోసం తల్లితో గొడవపడేవాడు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో ఉన్న కుమారుడు బలమైన ఆయుధంతో తల్లి రజియా బేగం తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని హత్యకు గల కారణాలు, వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితుడు ఆసిఫ్

# రాష్ట్రంలో ఫీజు బకాయిపై బిజెపి లడాయి

**40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం**

**పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్‌రావు**

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు, నిరక్ష్య వైఖరి వల్ల విద్యా వ్యవస్థ పూర్తిగా కుదేలైందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్‌రావు వెల్లడించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువులకు సంజీవని లాంటి సుమారు రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకుండా తొక్కిపెట్టిందన్నారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు, వారి భవిష్యత్తు అగమ్య గోచరంగా మారాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష్యానికి వ్యతిరేకంగా, 40 లక్షల మంది విద్యార్థులకు అండగా నిలిచేందుకు భారతీయ జనతా పార్టీ ప్రత్యక్ష పోరాటానికి దిగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా తొక్కిపెట్టి, ఏకంగా 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలను ఆగం చేస్తున్న ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ తీరును తీవ్రంగా ఖండిస్తూ... బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు సోమవారం ఉదయం 10:00 గంటల నుండి నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో 2 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నారు. కాలేజీల్లో సర్టిఫికెట్లు నిలిచిపోయి, పైచదువులు ఆగిపోయి, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న యువత ఆవేదనను చూసి మన పార్టీ అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి, ఆ రూ. 15,000 కోట్ల బకాయిలను పైసా పైసా విడుదల చేయించే వరకు ఈ పోరు ఆగదు. ఇది కేవలం పార్టీ కార్యక్రమం కాదు, రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ఆత్మగౌరవ పోరాటం. ముఖ్యంగా నేటి నవతరం, యువత, విద్యార్థి లోకం తమ హక్కుల సాధన కోసం మేల్కో వాల్సిన సమయమిదన్నారు. ఉదయం 10 గంటలకు రాష్ట్ర కార్యాలయంలో ప్రారంభమయ్యే ఎన్. రాంచందర్‌రావు నిరాహార దీక్షా శిబిరానికి రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు వేలాదిగా తరలివచ్చి సంపూర్ణ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.


వార్త

మన వ్యవహారాల విషయంలో మనం మనస్సుతోనూ, ఇతరుల విషయంలో హృదయంతోను ఆలోచించాలి.

- చార్లెస్ జి. రెయినర్


# అధిక ధరల చేవ్రాలు!

ఏదో బంగారం ధర పెరుగుతోంటే ఏమో అనుకున్నాం గానీ ముందు ముందు సామాన్యుడి జీవనవ్యయంపై కూడా దెబ్బతగులుతుందని తెలుసుకునేందుకు చాన్నాళ్లు పట్టింది. నిత్యావసర వస్తువుల ధరలు కూడా అనూహ్యంగా పెరిగిపోయాయి. సాగు బాధలకైతే 'ఎల్‌నినో'బూచిని, చమురు ధరల పెరుగుదలకు పశ్చిమాసియా యుద్ధ బూచిని చూపెట్టడం పరిపాటి అయిపోయింది. తాజాగా బియ్యం ధరలు పెరిగిపోయాయి. ఏ చమురు ధరో పెరిగితే ఎక్కడ్నించో రావాలిగా ఆంక్షలు, అదుపాజులు కారణంగా రవాణా చార్జీలు పెరిగాయని అనుకుంటూ సరిపెట్టేసుకోవచ్చు. కానీ నిత్యావసర వస్తువుల పరిస్థితే అర్థం కావడం లేదు. ఒకేసారి సామాన్యుడి వంటింటిపై నిత్యావసరాల ధరల పెంపు పిడుగు పడింది. రిటైల్ చక్కెర ధర 16 ఏళ్ల నాటి గరిష్టానికి చేరిన వారంలోనే బియ్యం ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సీజన్‌ల ప్రభావం అనుకుంటే పొరపాటే. చక్కెర ఎగుమతిలో రికార్డు సృష్టించుకున్న భారత్ చక్కెర దిగుమతులు చేసుకునే స్థాయికి దిగిపోయింది. ఇదేదో ఇప్పటికిప్పుడు 'ఇథనాల్' దెబ్బకు పెరిగిన వ్యవహారంగా చెప్పలేం. గత యేడాది ఆగస్టు 18న కిలో చక్కెర ధర రూ. 46.43 ఉంటే ప్రస్తుతం ఒక నెల రోజుల్లోనే 13 శాతం పెరిగి రిటైల్ ధర రూ. 52.30కు చేరుకుంది. అలా అని మార్కెట్ దుకాణాల్లో అదే రేటుకు అమ్ముతున్నారని అనుకోరాదు. అసలే యుద్ధ సమయం, ఆపై ఎల్‌నినో ఎఫెక్ట్, ఆపై పండుగల తరుణం కనుకనే ఇలా ధరల పెంపులో వ్యత్యాసాలు, తమకు అందుబాటులో లేని ధరలతో ప్రతి వినియోగదారుడు గుండెలు బాదుకుంటున్నాడు. ఒకేసారి వీటన్నిటి ధరలూ మూకుమ్మడిగా దాడి చేయడమంటే సామాన్యుడి జీవనం మీద అధిక బరువు పెట్టడమే. ఈ సందర్భంగా జనానికి ఊరట కలిగించే ఏ చర్యకూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు తీసుకోలేకపోవడం మూలిగే నక్క మీద కొబ్బరికాయ పడిన చందాన ఉంది. పశ్చిమాసియా యుద్ధ సమయంలో విదేశీ దిగుమతులపై రవాణా భారం తడిసిమోపెడైంది. ఉద్యోగుల చేతిలో ఆహారపదార్థాలు చిక్కిశల్యమైపోయాయి. ధరల భారం పెరిగిపోయింది. పెరిగిన ధరలతో వారికి దొరికింది ఇడ్లీకి బదులు బటన్ ఇడ్లీ. బొండా స్థానే పునుగులు చేతికందాయి. అటు ధర పెరిగితే ఇటు తినుబండారం బరువు తగ్గింది. మధ్యలో యుద్ధంఆగినా సామాన్యునికి ఊరట లేదు. ఇక రాదని తేలిపోయింది. ఇక మధ్యాదాయ వర్గాల నెలవారీ బడ్జెట్ బాగా పెరిగిపోయింది. ఈ ధరల పెరుగుదల సీజనల్‌గా వచ్చే భారం కాదు. విధానపరమైన లోపాలు, ముందస్తు ప్రణాళిక లేక డిమాండ్, సప్లై జాగ్రత్తలు తీసుకున్నామనే విషయంపై పూర్తి అవగాహన పాలకులకు లేకపోవడమే. ఈ యేడాది రుతుపవనాల లోటు, వాతావరణ అంతరాయాలతో కూరగాయల ధరలు అత్యధికంగా పెరిగాయి. ఉల్లి ధర అత్యంత వేగంగా పెరిగిపోయింది. బియ్యం, చక్కెర కూరగాయలు ఒకేసారి పెరిగితే ప్రత్యామ్నాయం దొరకదు. గంజి మెతుకులతో సరిపెట్టుకుందామనుకున్నా బియ్యం కిలో 65 రూపాయలకు చేరుకుంది. ప్రభుత్వాలు రేషన్ బియ్యం సరఫరాచేస్తున్నా అవి తెల్లరేషన్ కార్డుల వారికే. తెలంగాణలో సన్నబియ్యం ఇస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో ముతకబియ్యమే. ముతక బియ్యం తినేందుకు వీలుగా ఉండవని ప్రతీతి. కేవలం దోసెలకుమాత్రమే వినియోగి స్తుంటారు. రేపోమాపో రేషన్ బియ్యం రేటు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రతి కుటుంబానికి బియ్యం, పంచదార, నిత్యావసర వస్తువులు సమకూర్చడానికి చేస్తున్న ప్రయత్నాలు సామాన్యుడికి పెద్దగాఅందుబాటులోలేవు. ఇలా నిత్యావసర వస్తువుల ధరలుఒకేసారి పెరిగితే, వాటి ధరలు అదుపు తప్పితే దాని ప్రభావం వంటింటి ఖర్చునుండి ఆర్థికవ్యవస్థ వరకు ఉంటుంది ధరల నియం త్రణలో ప్రభుత్వం వ్యాపార వర్గాలు, వినియోగదారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. సరఫరా వ్యవ స్థల బలోపేతం, అక్రమ నిల్వల్ని వెలికి తీయడం, కృత్రిమ కొరతను అరికట్టడమూ అవసరమే. చక్కెర దేశీయ ఉత్పత్తి తగ్గడాన్ని ప్రభుత్వం నిర్ద్వంద్వంగా ప్రకటించినా, వాతావరణ ప్రభావం పెరుగుతున్నడిమాండ్‌లకనుగుణంగా సరకు సేకరణ, నిల్వలు తగ్గకుండా అజమాయిషీ చేయగల వ్యవస్థను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. చక్కెర ధర పెరగడానికి, కొరత ఏర్పడడానికి ప్రత్యేక కారణం ఒకటి వినిపిస్తోంది. చాలా విచిత్రంగా ఉంది. అక్టోబరు 1 నుంచి ప్రారంభమయ్యే కొత్త సీజన్‌కు ఓపెనింగ్ స్టాక్ దాదాపు 35 లక్షల టన్నులకు పడిపోయింది. ఇది గత మూడు దశాబ్దాల్లో అత్యల్పం. ఈ విషయంపై ముందే అవగాహన ఉన్నా ప్రభుత్వం మేల్కోలేదు. దాదాపు 10 ఏళ్ల తర్వాత మొదటిసారిగా 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఇదేకాకుండా నెలకు 10టన్నుల కన్నా ఎక్కువ చక్కెర వాడే బల్క్ వినియోగదారులకు, మిఠాయి దుకాణాలు, సాఫ్ట్‌డ్రింక్ కంపె నీలు, 15 రోజుల అవసరానికి మించి నిల్వ ఉంచరాదని సరి కొత్తగా ఉత్తర్వులు ప్రభుత్వం సవరించింది. కొరత రాబో తోందని తెలిసి తప్పుడు ఉత్పత్తి అంచనాలతో ముందు ఎగుమతులకు అనుమతినిచ్చి తర్వాత సరుకు నిల్వలు అవసరానికి మించి లేనప్పుడు చేతులు కాలక ఆకులు పట్టుకున్న చందాన ఏంచేయాలో తోచక ప్రభుత్వం చేతులెత్తేసింది. రానున్న మూడు నెలలు పండుగల కోసం చక్కెర వినియోగం ఎక్కువే. నిల్వలు ఖాళీ చేసుకుని ఇప్పుడు అంత చక్కెరను మార్కెట్లో 14 నెలల గరిష్ట ధరకు కొంటున్నాం. ప్రజావసరాలను సంయమనంతో బేరీజు చేసుకోకుండా వినియోగదారుల నెత్తిన అధిక ధరలు రుద్దడం ఇదే మొదటిసారి కాదు. ఆఖరిసారీ కాదు.



వస్త్రధారణ మనసును తెలిపేదిగా ఉండాలి. అంటే వస్త్రాలను బట్టి మనసు శుభ్రతను అర్థం చేసుకోగలగాలి.

మహాత్మా గాంధీ



బహిరంగంగా కన్పించే మురికి గుంటలకన్నా, మనసులో మాలిన్యంగల వ్యక్తుల వల్లే జాతికి ప్రమాదం.

డా॥ రాధాకృష్ణన్

# గ్రామీణ మహిళల శ్రమకు విలువ పెరగాలి

గ్రామీణ మహిళల కోసం ఇప్పటికే ఉన్న పథకాల మధ్య సమన్వయం చేయడం ముఖ్యం. వ్యవసాయానికి వనరులు కావాలి. వ్యాపారానికి రుణం కావాలి. ఉత్పత్తికి మార్కెట్ కావాలి. మార్కెట్‌కు నాణ్యత, నిల్వ, రవాణా కావాలి. ఇవన్నీ ఉపయోగించడానికి మహిళకు సమయం కావాలి. ఈ వ్యవస్థలో ఒక భాగం బలహీనంగా ఉన్నా మహిళల ఆదాయం పెరగడం కష్టం. గ్రామీణ మహిళలు పనిలోకి వస్తున్న సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు వారి పనికి వచ్చే ఆదాయం కూడా పెరగాలి. వారు చేసే పని స్థిరమైన ఆదాయాన్ని ఇవ్వాలి. తాము సంపాదించిన డబ్బుపై నిర్ణయం తీసుకునే హక్కు కూడా పెరగాలి. భారతదేశానికి ఇప్పుడు అవసరమైనది మహిళల శ్రమను మరింత పెంచడం కాదు, వారు ఇప్పటికే చేస్తున్న పనికి ఎక్కువ విలువ కల్పించడం. అదే గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచుతుంది. అదే గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలపరుస్తుంది.

డి జె మోహన రావు

'వ్యవసాయానికి వనరులు కావాలి. వ్యాపారానికి రుణం కావాలి. ఉత్పత్తికి మార్కెట్ కావాలి. మార్కెట్‌కు నాణ్యత, నిల్వ, రవాణా కావాలి. ఇవన్నీ ఉపయోగించడానికి మహిళకు సమయం కావాలి". భారతదేశంలో గ్రామీణ మహిళల శ్రామిక భాగస్వామ్యం పెరుగుతోంది. అయితే దీనిని ఆర్థిక పురోగతిగా చూడటానికి ముందు ఒక ప్రశ్నకు సమాధానం కావాలి. మహిళలు ఎక్కువగా పనిచేస్తున్నారా, లేక వారి ఆదాయం, ఆర్థిక భద్రత కూడా పెరుగుతున్నాయా? 2026 జూన్‌లో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల గ్రామీణ మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 36.6 శాతానికి చేరింది. 2025 జూన్‌లో ఇది35.2 శాతం. అంటే ఏడాదిలో 1.4 శాతం పాయింట్లు పెరిగింది. ఇది సానుకూల మార్పే. అయితే ఈ గణాంకం పని లేదా పని కోసం ప్రయత్నాన్ని మాత్రమే సూచిస్తుంది. ఆ పని ద్వారా వచ్చే ఆదాయాన్ని కాదు. అందువల్ల తదుపరివిధాన లక్ష్యం మహిళల పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ఎక్కువ ఉత్పాదకత, ఎక్కువ ఆదాయంగా మార్చడం కావాలి. ఒక మహిళ తక్కువ ఆదాయం వచ్చే పనిలో ఎక్కువ సమయం గడిపినా, ఆమె శ్రామిక శక్తిలో భాగంగా లెక్కించబడవచ్చు. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితిలో పెద్ద మార్పురాదు. వ్యవసాయం దీనికి స్పష్టమైన ఉదాహరణ. మహిళలు సాగు, పశుపోషణ, పంటల కోత తర్వాతి పనుల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. అయితే వారి ఆదాయం పెరగాలంటే భూమి, రుణం, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ సలహాలు, మార్కెట్లకు మెరుగైన ప్రాప్యత అవసరం. తాము పని చేసే వనరులపై, ఆ పని ద్వారా వచ్చే ఆదాయంపై మహిళలకు ఎక్కువ నియంత్రణ ఉన్నప్పుడే పెరిగిన శ్రామిక భాగస్వామ్యం కుటుంబ ఆదాయాన్ని పెంచుతుంది. ఇక్కడ అసలు లక్ష్యం మహిళలు ఇప్పటికే చేస్తున్న పనికి ఎక్కువ విలువ తీసుకురావడం. వ్యవసాయ ఉత్పత్తిని సాధారణ రూపంలో విక్రయించడానికి బదులు శుద్ధి చేయడం, నిల్వ చేయడం, ప్యాక్ చేయడం, విలువ పెంచిన ఉత్పత్తిగా మార్చడం ద్వారా ఆదాయాన్ని పెంచవచ్చు. ఇందుకు గ్రామ స్థాయిలో అవసరమైన పరికరాలు, నిల్వ కేంద్రాలు, నాణ్యత పరీక్షలు, మార్కెట్ సమాచారం అందాలి. ఇలా చేస్తే మహిళలు తక్కువ ఆదాయం వచ్చే పనుల నుంచి ఎక్కువ ఆదాయం వచ్చే దశల్లోకి వెళ్లగలరు. స్వయం సహాయక సంఘాలు ఈ మార్పుకు ఉపయోగపడగలవు. ఇప్పటివరకు అవి ప్రధానంగా పొదుపు, చిన్నరుణాలకు ఆధారంగా ఉన్నాయి. ఇక వాటిని వ్యాపారాలను పెంచే వేదికలుగా మార్చాలి. 2026 జూన్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 700 స్వయం సహాయక వ్యాపార కేంద్రాలు, 1,000 జిల్లా స్థాయి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రణాళికను ప్రకటించింది. ఉత్పత్తి రూపకల్పన, ప్యాకేజింగ్, నాణ్యత, మార్కెట్‌కు సిద్ధం చేయడంపైనా దృష్టిపెట్టింది. ఈ కేంద్రాలు మహిళలను రుణాలు తీసుకునే స్థాయి నుంచి ఉత్పత్తి చేసి, విక్రయించే స్థాయికి తీసుకెళ్లాలి. లఖ్‌పతి దీదీ కార్యక్రమం ఈ మార్పుకు స్పష్టమైన ఆదాయ లక్ష్యాన్ని ఇచ్చింది. ప్రభుత్వం మొదట మూడు కోట్ల లక్ష్యాన్ని పెట్టుకుని, దాన్ని ముందుగానే చేరుకున్న తర్వాత 2029మార్చి నాటికి ఆరు కోట్లకు పెంచింది. 2026 జూలై నాటికి3.46 కోట్లకుపైగా స్వయం సహాయక సంఘాల సభ్యులు లఖ్‌పతి దీదీలుగా గుర్తించబడ్డారు. ఈ పథకంలో సంవత్సరానికి



కనీసం లక్ష రూపాయల ఆదాయం రావడమే కాకుండా, అది కనీసం నాలుగు వ్యవసాయ కాలాలు లేదా వ్యాపార చక్రాలపాటు నిలకడగా ఉండాలనే ప్రమాణం ఉంది. కాబట్టి తదుపరి దశ లక్ష రూపాయల ఆదాయాన్ని చేరుకోవడంతో ముగియదు. ఆ ఆదాయం ప్రతి సంవత్సరం కొనసాగి, క్రమంగా పెరిగేలా చేయడం తదుపరి లక్ష్యం. అయితే ఉత్పత్తి చేసినంత మాత్రాన ఆదాయం పెరగదు. దానికి సరైన మార్కెట్ కూడా కావాలి. ఒక మహిళ తయారు చేసిన వస్తువుకు కొనుగోలుదారు లేకపోతే, మంచి ధర రాకపోతే లేదా నిల్వ, రవాణా ఖర్చులు ఎక్కువైతే ఆమె వ్యాపారం ఎదగదు. అందువల్ల మహిళా వ్యాపారాలకు ప్రభుత్వ కొనుగోళ్లు, పెద్ద మార్కెట్లతో అనుసంధానం, ఉమ్మడి ప్యాకేజింగ్-నిల్వ సదుపాయాలు, నాణ్యత ధ్రువీకరణ వంటి మద్దతు అవసరం. రుణంవ్యాపారాన్ని ప్రారంభిస్తుంది. మార్కెట్ దాన్ని ఆదాయంగా మారుస్తుంది. మార్కెట్, రుణం ఉన్నా మహిళలకు వాటిని ఉపయోగించడానికి సమయం లేకపోతే ప్రయోజనం పరిమితమవుతుంది. 2024 కాల వినియోగ సర్వే ప్రకారం 15-59 ఏళ్ల మహిళల్లో 24.9శాతం మంది వేతనంతో కూడిన కార్యకలాపాల్లో పాల్గొంటే, పురుషుల్లో ఈ వాటా 74.5 శాతం. ఇదే వయస్సులో వేతనం లేని సంరక్షణ పనుల్లో మహిళల భాగస్వామ్యం 93.9 శాతం కాగా, పురుషుల్లో 45 శాతం. పిల్లల సంరక్షణ, వృద్ధుల సంరక్షణ, మెరుగైన రవాణా, ఇంటి పనిని తగ్గించే సదుపాయాలు అందుబాటులో ఉంటే మహిళలకు ఆదాయం వచ్చే పనికి ఎక్కువ సమయం దొరుకుతుంది. అందువల్ల వీటిని సంక్షేమ కార్యక్రమాలతో పాటు మహిళల ఆర్థిక భాగస్వామ్యానికి అవసరమైన సదుపాయాలుగా చూడాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా మహిళలవ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పించగలదు. ఫోన్, అంతర్జాలం అందుబాటులో ఉండటంతో పాటు ధర నిర్ణయించడం, లెక్కలు నిర్వహించడం, డిజిటల్ చెల్లింపులు తీసుకోవడం, ఆన్‌లైన్‌లో వస్తువులు విక్రయించడం, వినియోగదారులతో వ్యవహరించడం వంటినైపుణ్యాలు కూడా అవసరం. అందువల్ల సాంకేతిక శిక్షణను సాధారణ అవగాహనకు పరిమితం చేయకుండా మహిళలు చేస్తున్న పనికి నేరుగా ఉపయోగపడేలా రూపొందించాలి. మహిళల ఆర్థిక పురోగతిని కొలిచే విధానంలో కూడా మార్పు అవసరం. మహిళల శ్రామిక భాగస్వామ్యం ఎంత పెరిగిందన్నది ఒక సంఖ్య మాత్రమే. వారు ఎంత సంపాదిస్తున్నారు, వారి వ్యాపారం ఎంతకాలం కొనసాగుతోంది, ఎంత రుణం అందుతోంది, ఉత్పత్తికిఎంత మంచి ధర వస్తోంది, తమ సంపాదనపై నిర్ణయంతీసుకునే అవకాశం ఎంత ఉందన్నదీ తెలుసుకోవాలి. అప్పుడు ఏ పథకం మహిళలను పనిలోకి తీసుకువస్తుందో, ఏ పథకం వారి ఆదాయాన్ని నిజంగా పెంచుతుందో స్పష్టంగా తెలుస్తుంది. అందువల్ల గ్రామీణ మహిళల కోసం ఇప్పటికే ఉన్న పథకాల మధ్య సమన్వయం చేయడం ముఖ్యం. వ్యవసాయానికి వనరులు కావాలి. వ్యాపారానికి రుణం కావాలి. ఉత్పత్తికి మార్కెట్ కావాలి. మార్కెట్‌కు నాణ్యత, నిల్వ, రవాణా కావాలి. ఇవన్నీ ఉపయోగించడానికి మహిళకు సమయం కావాలి. ఈ వ్యవస్థలో ఒక భాగం బలహీనంగా ఉన్నా మహిళల ఆదాయం పెరగడం కష్టం. గ్రామీణ మహిళలు పనిలోకి వస్తున్న సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు వారి పనికి వచ్చే ఆదాయం కూడా పెరగాలి. వారు చేసే పని స్థిరమైన ఆదాయాన్ని ఇవ్వాలి. తాము సంపాదించిన డబ్బుపై నిర్ణయం తీసుకునే హక్కు కూడా పెరగాలి. భారతదేశానికి ఇప్పుడు అవసరమైనది మహిళల శ్రమను మరింత పెంచడం కాదు, వారు ఇప్పటికే చేస్తున్న పనికి ఎక్కువ విలువ కల్పించడం. అదే గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచుతుంది. అదే గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలపరుస్తుంది. ●

# ఆయుధ లైసెన్స్‌లను సమీక్షించడం అవసరం

శ్రీశైలం దూడం

తుపాకీ చేతిలో ఉండటం రక్షణకు అవసరం కావచ్చు. కానీ అదే తుపాకీ ఎదుటివారి గుండెల్లో భయం పుట్టించే సాధనంగా మారితే? లైసెన్సు ఉన్న ఆయుధం చట్టబద్ధమైనదే కావచ్చు. దాన్ని ఉపయోగించే తీరు మాత్రం చట్టబద్ధంగా ఉండాలి. ఇక్కడే అసలు ప్రశ్నమొదలవుతుంది. నక్సలిజంముప్పు తగ్గడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు తన భద్రతను తగ్గిస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా ప్రకటించారు. భద్రతా ముప్పు తగ్గిందని భావించి ముఖ్యమంత్రి, డీజీపీ స్థాయి వ్యక్తులకే రక్షణను పునఃపరిశీలిస్తున్నప్పుడు సాధారణ వ్యక్తుల వద్ద కొనసాగుతున్న ఆయుధ లైసెన్సుల అవసరాన్ని కూడా ఒకసారి పరిశీలించాల్సిన సమయం రాలేదా? నిన్నటి ముప్పు ఈరోజు లేకపోతే..నిన్నటి అనుమతిని ఈరోజు కూడా ఎందుకు కొనసాగించాలి? లైసెన్సు మంజూరు చేసిన నాటి పరిస్థితులు మారితే ఆ అవసరం ఇంకా ఉందా లేదా అన్నది చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కాదా? 2025 మేలో అప్పటి డీజీపీ జితేందర్ వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణలో 7,125 చెల్లుబాటు అయ్యే ఆయుధ లైసెన్సులు, 9,294 నమోదిత ఆయుధాలు ఉన్నాయి. గత మూడేళ్లలో 510 కొత్త లైసెన్సులు మంజూరయ్యాయి. ఇవి కేవలం గణాంకాలు కావు. ప్రతి లైసెన్సు వెనుక ఒక వ్యక్తి, ఒక ఆయుధం, ఒక బాధ్యత ఉంది. అందుకే ప్రశ్న కొత్త లైసెన్సులు ఎన్ని ఇచ్చారన్నదే కాదు. ఎవరికి ఇచ్చారు? ఎందుకు ఇచ్చారు? ఆ అవసరం ఇప్పటికీ ఉందా? ఆయుధం ఎలా ఉపయోగిస్తున్నారు? అన్నదే. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, భూవివాదాలు, వ్యక్తిగత తగాదాలు, సెటిల్‌మెంట్లలో ఆయుధ ప్రదర్శన జరుగుతోందనే ఆరోపణలు అప్పుడప్పుడు వినిపిస్తుంటాయి. ప్రతి ఆరోపణ నిజమని చెప్పడం కాదు. కానీఫిర్యాదు వచ్చినప్పుడు లైసెన్సు ఉందన్న ఒక్క కారణంతో దాన్నితేలిగ్గా తీసుకోవడం కూడా సమంజసం కాదు. తుపాకీని చూపించడం ద్వారా ఎదుటివారిపై మానసిక ఒత్తిడి తెస్తే అది రక్షణ భావనను దాటి పెత్తనానికి దారితీసినట్టే. తుపాకీ చట్టంఇచ్చిన అనుమతి కావచ్చు. కానీ సమాజంపై ఆధిపత్యానికి అది పాస్‌పోర్టు కాదు. సైబర్ నేరగాడు తెరవెనుక నుంచి ప్రజల డబ్బును దోచుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆయుధాన్ని దుర్వినియోగం చేసే వ్యక్తి మాత్రం సమాజం కళ్లముందే భయాన్ని సృష్టించే అవకాశం ఉంది. మార్గాలు వేరు కానీ ప్రజల భద్రతకు ముప్పు కలిగితే రెండింటినీ చట్టం సమానంగా చూడాలి. అందుకే పోలీసు నిఘా కేవలం అక్రమ ఆయుధాలపైనే కాకుండా చట్టబద్ధంగా ఉన్న ఆయుధాల దుర్వినియోగంపైనా ఉండాలి. పోలీసు వ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తున్న డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆయుధ లైసెన్సుల సమీక్ష మరో ముఖ్యమైన పరీక్ష కావచ్చు. రాజకీయ పలుకుబడి, ఆర్థిక స్థాయి, సామాజిక ప్రభావం వంటి వాటికి అతీతంగా ప్రతి లైసెన్సును ఒకే ప్రమాణంతో పరిశీలించగలిగితే అది ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని మరింత పెంచుతుంది. నిజమైన ముప్పు ఉన్నవారికి ఆయుధం అవసరం కావచ్చు. కానీ అవసరం ముగిసినప్పుడు సమీక్ష కూడా అవసరమే. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం లైసెన్సుపై చర్య తీసుకోవడం కూడా అదే వ్యవస్థ బాధ్యత. సమాజంలో ఒక ప్రమాదకరమైన భావన పెరగకూడదు 'నా దగ్గర గన్ ఉంది నన్నెవరూ ఏమీ చేయలేరు' అనే ధోరణి. చట్టం ఇచ్చిన లైసెన్సు చట్టం నుంచి మినహాయింపు కాదు. ప్రజాస్వామ్యంలో అసలైన బలం తుపాకీ గొట్టంలో ఉండదు. చట్టంపై నమ్మకంలో ఉంటుంది. భయంతో వచ్చిన గౌరవం గౌరవం కాదు. అది మౌనంగా భరించిన భయం. అందుకే రాష్ట్రంలోఆయుధ లైసెన్సులపై ఒకసారి సమగ్ర సమీక్ష జరగాలి. ముప్పు ఉన్న వారిని రక్షించాలి. అవసరం లేనివారిని గుర్తించాలి. దుర్వినియోగం నిర్ధారణైన చోట చట్టం తనపని తానుచేయాలి. ఎవరి పలుకుబడి ఎంత ఉన్నా ప్రమాణం ఒక్కటే కావాలి. తుపాకీ రక్షణకు ఉండాలి, పెత్తనానికి కాదు. లైసెన్సు హక్కు కాదు బాధ్యత. భద్రత పేరుతో వచ్చిన ఆయుధం సమాజానికి భయంగా మారకూడదు. అప్పుడే ప్రజలు పోలీసు వ్యవస్థను కేవలం భద్రత కల్పించే సంస్థగా కాకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించే వ్యవస్థగా విశ్వసిస్తారు. ●

## ప్రజావాక్కు

### ఉద్యోగాల సృష్టి కీలకం

భారత ఆర్థికవ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఆ వృద్ధి ఫలాలువిస్తృతంగా ప్రజలకు చేరాలంటే ఉద్యోగాల సృష్టి కీలకం. 2026-27 తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి సుమారు 7.3శాతంగా ఉండవచ్చన్న అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే ఏప్రిల్-జూన్ 2026 పీఎల్‌ఎఫ్ఎస్‌ప్రకారం దేశవ్యాప్త నిరుద్యోగరేటు 5.4 శాతంగా ఉండగా, 15-29 ఏళ్ల యువతలో అది 15.9 శాతంగా ఉంది. పట్టణ యువత, యువమహిళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. అందువల్ల తదుపరి వృద్ధి దశను ఉద్యోగ కేంద్రితంగా మార్చాలి. మాన్యుఫ్యాక్చరింగ్, టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ భాగాలు, నిర్మాణం, పర్యాటకం, లాజిస్టిక్స్ వంటి శ్రమాధారిత రంగాలను విస్తరించాలి. టైర్-2, టైర్-3 నగరాల్లో ఉపాధికేంద్రాలు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లుఅభివృద్ధి చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పాశ్చాత్య ధోరణులు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణమండల దేశంగా పరిగణిస్తారు. మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటం కద్దు. వేసవిలో అయితే అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో పిల్లలు, యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలో చిన్నదుస్తులు ధరించి మండు వేసవిలోయథేచ్ఛగాసంచరిస్తున్నారు. సాధారణంగా సూర్య కిరణాల వేడిమి30నుంచి 35డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగాఉంటాయి. ఈకిరణాలుచర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది.

- పి. వెంకట్, సికింద్రాబాద్

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం ఠంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి, చిన్న, సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో, కూస్తో సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే వారికి ఆ రోజు నిద్రపట్టేలా లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపాలి.

-కె. రామారావు, నల్గొండజిల్లా

### ఆరోగ్యమే మహాభాగ్యం

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఇడ్లీ, రైస్‌సాంబర్ లేదా ఇతర బలమైన ఆహారంతో మెత్తగా కలిపి తినిపించడం చూస్తుంటాము. ఇకచాలు అన్నా కూడా వినకుండా చందమామ, కాకమ్మ కథలు చెబుతూ బలవంతంగా ముద్దనోట్లో కుక్కుతుంటారు. ఇలా చేయడం వల్ల ఒక్కోసారి అజీర్తి, వాంతులు చేసుకొని ఏడుస్తుంటారు. దాంతో కన్నవాళ్లకు ఆందోళన కలగడం సహజం. ఇది ఏమాత్రం బిడ్డ ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యనిపుణులు చెబుతుంటారు. చిరుతిళ్లు తినే పిల్లలకు ఆకలి మందగించడం వల్ల ఫుడ్ సరిగ్గా తినరు. కావున వీలైనంతవరకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఎదిగే పిల్లలకు వెరైటీగారాగిజావ, ఉడికించిన కూరగాయలు, అన్నంలో కలిపి పెట్టాలి. అలాగే ఫ్రూట్ సలాడ్స్ అందించాలి.

- ఆర్.వి.చరన్, బెంగళూరు

### కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంతజాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈ కోర్టు కేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడు నాలుగు సంవత్సరాలు గడిచిన కానీ కేసు పరిష్కారం జరగటం లేదు కానీ కేసు బాధితులు మాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపుకాకుండా వినియోగదారుఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును. కానీ నేటి వరకు కూడా పరిష్కార దిశలు కనుక్కోలేకపోతున్నారు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు. వినియోగదారుల ఫోరంలో జాబ్స్ వెంటేనే భర్తీచేసి కేసులు వేగవంతం చేయాలి.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### నగదు కొరత

ఒకప్పుడు బ్యాంకు ఖాతాదారులు తమ బ్యాంకు శాఖలకు నేరుగా వెళ్లి నగదు తీసుకునే పరిస్థితి వుండేది. ప్రస్తుతం దేశమంతటా ఏటిఎంలు రావడంతో ఖాతాదారుడు బ్యాంకు శాఖలకు వెళ్లి నగదు తీసుకునే శ్రమ చాలా వరకూ తప్పింది. దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల శాఖలు తమ ఖాతాదారులకు ఏటిఎం కార్డుల సదుపాయంఅందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే దేశవ్యాప్తంగా కొన్ని నగరాల్లోని ఏటిఎంలలో బ్యాంకులు సరిపడా నగదు నిల్వలు ఉంచడం లేదు. ఈ విషయం లో ఆర్‌బిఐ అన్ని బ్యాంకుల శాఖలకు దిశానిర్దేశం చేసి ఏటిఎంలలో నగదు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

-జి. అశోక్, హైదరాబాద్

# బలూచిస్థాన్ స్వాతంత్ర్యంపై తటస్థ వైఖరి మేలు



కృష్ణ బాలాజి పల్లపోతు

అరేబియా సముద్ర తీరంలోని బలూచిస్థాన్‌లో, మక్రాన్ పర్వత శ్రేణుల్లో హింగోల్ నది ఒడ్డున ఉన్న ఒక గుహలో హింగ్లాజ్ మాతకొలువై ఉంది. సతీదేవి పురాణగాథతో ముడిపడిన ఈ ప్రాచీన క్షేత్రం హిందువులకు అత్యంత పవిత్రమైన పుణ్య క్షేత్రాల్లో ఒకటి. ప్రతి ఏడాది వసంత కాలంలో జరిగే హింగ్లాజ్ యాత్రకు పాకిస్థాన్‌లోని హిందువులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల మధ్య కాలినడకన సాగే ఈ యాత్రను, స్థానిక ముస్లింలు కూడా 'నాన్నీ కా హజ్'గా గౌరవించడం, ఆ క్షేత్రానికి ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. బలూచిస్థాన్ చరిత్రలో 1947 ఆగస్టు ఒక కీలక అధ్యాయం. అప్పట్లో బలూచ్ ప్రాంతంలోని పలు రాజకీయ సంస్థానాల్లో 'కలాత్ ఖానేట్' ఒకటి. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఆ సంస్థానానికి చివరి పాలకుడు మీర్ అహ్మద్ యార్ ఖాన్ అహ్మద్‌జై. బ్రిటిష్ పాలన ముగింపు దశలో, అహ్మద్‌జై కలాత్ కు స్వతంత్ర హోదాను కొనసాగించాలని కోరారు. జిన్నా నాయకత్వంలోని ముస్లిం లీగ్‌తో కుదిరిన ఒక అవగాహనలో, కలాత్ సంస్థానాన్ని స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించే ఏర్పాటుకు అంగీకారం కుదిరింది. కానీ పాకిస్థాన్ ఏర్పడిన తర్వాత ఆ వైఖరిలోమార్పు రావడంతో, చివరకు 1948 మార్చి 27న కలాత్ పాకిస్థాన్‌లో విలీనమైంది. అయితే అంతటితో బలూచ్ స్వాతంత్ర్య ఆకాంక్ష సుఖాంతం కాలేదు. 1948లో అహ్మద్‌జైసోదరుడు ప్రిన్స్ అబ్దుల్ కరీమ్ నేతృత్వంలో సాయుధ ప్రతిఘటన మొదలైంది. ఆ తర్వాత పలు దశల్లో పెద్దఎత్తున తిరుగుబాట్లు జరిగాయి. 2003 నుంచి కొనసాగుతున్న ప్రస్తుత దశలో బలూచ్ వేర్పాటు వాదసంస్థల సాయుధ కార్యకలాపాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. 2026 ప్రారంభంలో బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఒకేసారి జరిగిన దాడుల్లో భద్రతా బలగాలు, పోలీస్ స్టేషన్లు, ఇతరప్రభుత్వ సంస్థలు లక్ష్యంగా మారాయి. ఈ దాడులకు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత ప్రకటించుకుంది. ఇప్పుడు, కలాత్‌ను స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించే అవగాహన కుదిరిన 8 దశాబ్దాల తరువాత, ఫ్రీ బలూచిస్థాన్ మూవ్‌మెంట్‌కు చెందిన 'మిర్ యార్ బలూచ్' ఈ సంవత్సరం జూలైలో బలూచిస్థాన్ భూభాగానికి, రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ పేరుతో పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం ప్రకటించారు. 1947లో కలాత్ సంస్థానానికి స్వతంత్ర సార్వభౌమ హోదాను గుర్తిస్తూ కుదిరిన అవగాహనను, నేటి విస్తృత బలూచిస్థాన్ స్వాతంత్ర్యానికి చారిత్రక ఆధారంగా ఈ ఉద్యమం చూపుతోంది. ఈ నేపథ్యంలో, ఈ ఉద్యమ నాయకులు తమ స్వాతంత్రాన్నిగుర్తించాలని ఐక్యరాజ్యసమితితోపాటు అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ప్రత్యేక జెండా, జాతీయ గీతం, కరెన్సీ, పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకొన్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ స్వయంప్రకటనకు ఇప్పటివరకు ఏ దేశం లేదాఅంతర్జాతీయ సంస్థ గుర్తింపు ఇవ్వలేదు. అనేక వేర్పాటువాద సంస్థలు, వర్గాలు వేర్వేరు స్థాయిల్లో పనిచేస్తున్నాయి. కలాత్ సార్వభౌమత్వాన్ని మొత్తం బలూచిస్థాన్ స్వాతంత్ర్యానికి చారిత్రక



ఆధారంగా చూపే ఈ వివరణను, అన్నివర్గాలు అంగీకరిస్తున్నాయా అన్నది కూడా స్పష్టం కాలేదు. మిర్ యార్‌బలూచ్ ప్రకటనకు మిగిలిన వర్గాలన్నింటి అంగీకారం, బలూచ్‌ప్రజల విస్తృత మద్దతు ఉందని చెప్పడానికీ ఆధారాలులేవు. పైగా, 1933 నాటి మోంటెవీడియో కన్వెన్షన్‌లో పేర్కొన్న ప్రమాణాల ప్రకారం ఒకస్వతంత్ర రాజ్యానికి నిర్దిష్ట భూభాగం, ప్రభుత్వం, ఇతర దేశాలతో సంబంధం నెరిపే సామర్థ్యం వంటి లక్షణాలు ఉండాలి. ఈ ప్రమాణాల దృష్టితోచూసినా, ఆ ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా గుర్తించడానికి తగిన పరిస్థితులు లేవు. అందువల్ల ప్రస్తుత పరిణామాన్ని, బలూచ్ జాతీయవాద ఉద్యమంలోని ఒక వర్గం, తన స్వాతంత్ర్య డిమాండ్‌కు అంతర్జాతీయ గుర్తింపు సాధించే దిశగా తెస్తున్న ఒత్తిడిగా మాత్రమే చూడాలి. విస్మరించలేని మరో కోణంచైనా. చైనా ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ప్రణాళికలో అంతర్భాగమైన చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌లో గ్వాదర్ కీలక భాగం. అయితే గ్వాదర్ ఉన్నప్రాంతంలోనే బలూచ్ వేర్పాటువాదం బలంగా ఉండటం, చైనా ప్రాజెక్టులు, సిబ్బందిపై తరచూ దాడులు జరగడం బీజింగ్‌కు భద్రతా పరమైన సవాలుగా మారింది. భారత్ ప్రయోజనాల దృష్ట్యా కూడా ఈ పరిణామాలకు ప్రాధాన్యం ఉంది. చైనా వ్యూహాత్మక విస్తరణకు భద్రతాపరమైన సవాళ్లు పెరగడం, ఆ విస్తరణ వేగాన్ని పరిమితం చేయడం భారతదేశానికి అయాచితంగా వ్యూహాత్మక ప్రయోజనాన్ని కలిగించే అంశాలే. అందువల్ల బలూచిస్థాన్ ఉద్యమాన్ని భారత్, పాకిస్థాన్ అంతర్గత సమస్యగా మాత్రమే కాకుండా, తనకు కీలకమైన హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా ఉనికికి సవాలు విసరగల అంశంగా కూడా పరిగణించాల్సి ఉంటుంది. అంతేగాక, బలూచిస్థాన్‌లో అస్థిరత మరింత తీవ్రమైతే, అది భారత్-పాకిస్థాన్ సరిహద్దు భద్రతపైనా పరోక్షప్రభావం చూపే అవకాశం కూడా భారత్ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం. బలూచిస్థాన్ చర్చకు వచ్చినప్పుడల్లా, బలూచ్ వేర్పాటువాద ఉద్యమానికి భారత్ మద్దతు ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తూ వస్తోంది. భారత్ మాత్రం ఇటువంటి ఆరోపణలను ఖండిస్తూ, బలూచిస్థాన్‌లో జరుగుతున్న పరిణామాలు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేస్తూవచ్చింది. ఈ నేపథ్యంలో తాజా స్వాతంత్ర్య ప్రకటనపై భారత్ వైఖరి ఎలా ఉండాలి, అవసరమైతే ఎలా ప్రతిస్పందించాలి, ఈ పరిణామం భారత ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది అన్నవి ముఖ్యమైన ప్రశ్నలు. ఈ సందర్భంలో మరో అంశం కూడా ప్రస్తావించుకోవాలి. పాకిస్థాన్ బలూచిస్థాన్‌లోని స్వాతంత్ర్య డిమాండ్‌ను మాత్రం తన అంతర్గత వ్యవహారంగా కొట్టిపారేస్తోంది. ఈ వైరుధ్యాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎత్తిచూపడం ద్వారా పాకిస్థాన్ వాదనలోనిడొల్లతనాన్ని, ద్వంద్వనీతిని భారత్ చాకచక్యంగా ఎండగట్టవచ్చు. అయితే, పాకిస్థాన్‌కు అసౌకర్యం కలిగించే ప్రతి అంశానికి బహిరంగంగా మద్దతు తెలపడం భారత్ అనుసరిస్తూ వస్తున్న, సంయమనంతో కూడిన దౌత్యనీతికి అనుగుణంగా ఉండదు. దానికి తోడు బలూచిస్థాన్ స్వాతంత్ర్యాన్ని గుర్తించడం, ఆ ఉద్యమానికి బహిరంగ మద్దతు ఇవ్వడం వంటి ప్రతికూల నిర్ణయాలు, పాకిస్థాన్ అంతర్గత ఘర్షణలో భారత్‌ను ప్రతినాయకుడి పాత్రలో నిలబెడతాయి. భారత్ ఇతర దేశాల్లోని వేర్పాటువాద ఉద్యమాలను ప్రోత్సహిస్తోందన్న పాకిస్థాన్ ప్రచారానికి బలం చేకూర్చినట్లవుతుంది కూడా. అదే అలుసుగా కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ మరింత దూకుడు ప్రదర్శించే అవకాశమూ ఉంటుంది. అందుచేత ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ సమాజంలోని ఇతర దేశాల మాదిరిగానే బలూచిస్థాన్ స్వాతంత్ర్య ప్రకటనను గుర్తించకుండా, ఉద్యమానికి అధికారిక మద్దతు ఇవ్వకుండా తటస్థంగా ఉండటం భారత్‌కు సముచితమైన మార్గం. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అంతరిక్ష రంగంలో 'జెన్‌జీ' ముందంజ



## సరికొత్త టెక్నాలజీల ఆవిష్కరణ

## జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచ వ్యాప్తంగా దూసుకుపోతోందని, పెట్టుబడిదారులకు ఒక ఆయస్కాంతంలా మారిందని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా జెన్‌జీ యువత సరికొత్త టెక్నాలజీలను నిర్మిస్తోందని ప్రశంసించారు. ఆదివారం ప్రధాని మోడీ తన ప్రసంగాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నారు. అయోధ్యలో నేను చెప్పినట్లుగా ఇది ఒక కొత్త మార్పునకు నాంది. ఈ కొత్త శకంలో, ప్రపంచ క్రమంలో భారత్ తన అంతరిక్ష ఉనికిని స్థిరంగా విస్తరిస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న మన సంకల్పంలో అంతరిక్ష రంగం కీలక పాత్ర పోషిస్తుందని మోడీ పేర్కొన్నారు. స్పేస్ సెక్టార్‌లోని స్టార్టప్‌ల సిఇఒలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జెన్‌జీ యువత సరికొత్త టెక్నాలజీని నిర్మిస్తోందని ప్రశంసించారు. అయోధ్యలో నేను చెప్పినట్లుగా ఇది ఒక కొత్త మార్పునకు నాంది. ఈ కొత్త శకంలో, ప్రపంచ క్రమంలో భారత్ తన అంతరిక్ష ఉనికిని స్థిరంగా విస్తరిస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న మన సంకల్పంలో అంతరిక్ష రంగం కీలక పాత్ర పోషిస్తుందని మోడీ పేర్కొన్నారు. దేశ యువతను కొనియాడుతూ ఈ రోజు మన జెన్‌జీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారన్నారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ నుంచి శాటిలైట్ ప్లాట్‌ఫారమ్‌ల వరకు మన యువత గతంలో ఊహించని రంగాలలో పనిచేస్తోందన్నారు.

ఇస్రో విజయాలు ఎంతోమంది పిల్లలకు శాస్త్రవేత్తలు కావాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని చెప్పారు. 2023లో ఇదేరోజున చంద్రయాన్3 విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నాం. దేశ యువతను కొనియాడుతూ ఈ రోజు మన జెన్‌జీ ఇంజనీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలను ఆవిష్కరిస్తున్నారు. ప్రొపల్షన్ సిస్టమ్స్ నుంచి శాటిలైట్ ప్లాట్‌ఫారమ్‌ల వరకు, మన యువత గతంలో ఊహించని రంగాలలో పనిచేస్తోందిఅని అన్నారు. ఇస్రో విజయాలు ఎంతోమంది పిల్లలకు శాస్త్రవేత్తలు కావాలనే స్ఫూర్తిని ఇస్తున్నాయని చెప్పారు. 2023లో ఇదే రోజున చంద్రయాన్3 విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ యేడాది ఆవిష్కరణ, సహకారం, ప్రపంచ అంతరిక్ష నాయకత్వం" అనే థీమ్‌తో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ, దేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు ఎంతో అవసరమని పిలుపునిచ్చారు.



# హాఫీజ్ సయీద్‌కు ఎన్ఐఎ కోర్టు సమన్లు

## పహల్గాం ఉగ్రదాడి కేసులో బిగుసుకొంటున్న ఉచ్చు

**న్యూఢిల్లీ,ఆగస్టు 23:** పహల్గాం ఉగ్రవాద దాడిలో ప్రధాన నిందితుడిగా లష్కర్ ఏ తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ చేర్చిన నేపథ్యంలో అతడికి సమన్లు పంపడానికి ఎన్ఐఎ కోర్టు సిద్ధం అవుతోంది. ఈ మేరకు జమ్మూ కాశ్మీర్ లోని ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు ఎదుట విచారణకు హాజరుకావాలని సమన్లలో ఎన్ఐఎ అధికారులు ఆదేశించే అవకాశం ఉంది. దాంతో పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ఆయనకు ఉచ్చు బిగుస్తున్నట్లుగా భావించవచ్చు. ఇక ఇప్పటికే ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు హాఫీజ్ సయీద్ కు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ సమన్లను లాహోర్‌లోని సయీద్‌కు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని భారత హై కమిషన్ ద్వారా పాకిస్థాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు ఈ సమన్లను జారీ చేసే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్రం సమాయత్తం అవుతోంది. ఇదిలా ఉండగా 26/11 ముంబై ఉగ్రదాడుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ దాడుల వెనుక మాస్టర్ మైండ్‌లుగా నిషేధిత లష్కరే తోయిబా హాఫీజ్ సయీద్, జకీవుర్ రెహమాన్ లఖ్వీలతో సహా మొత్తం ఆరుగురు ప్రధాన నిందితులు ప్రస్తుతం పరారీలో ఉండగా వారికి కోర్టు జారీ చేసిన ప్రకటన ఉత్తర్వుల్ని అందజేసేందుకు ముంబై పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. ఈ ఉగ్రవాదులకు ఇంటర్ పోల్ ద్వారా నోటీసుల్ని జారీ చేయాలని ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖను అభ్యర్థించారు. మరోవైపు కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టడంలో లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ హాఫీజ్ సయీద్ పాత్రపై పాకిస్థాన్‌కు చెందిన ఓ మతగురువే సంచలన వ్యాఖ్యలు చేశారు. కాశ్మీర్‌కు హాఫీజ్ సయీద్ ఏకంగా 10 వేల మంది ఉగ్రవాదులను పంపాడని పాకిస్థాన్ మతగురువు నజీర్ మదానీ బహిరంగంగా ప్రకటించారు. జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన పహల్గామ్ లోయలో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు జరిపిన మారణ హోమంలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ ఘటన వెనకున్నట్లు తేలిన నేపథ్యంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి వాటిని పూర్తిగా ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులను హతమార్చింది.

# తారిక్ భారత్ పర్యటనకు తొందరేమీ లేదు

## బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయమంత్రి హుమాయూన్



**ఢాకా, ఆగస్టు 23:** బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్ భారత పర్యటనపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ శాఖ సహాయమంత్రి హుమాయూన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. శనివారం హుమా యూన్ మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లా ప్రధాని తారిక్ భారత పర్యటనకు తొందరపడా ల్సిన అవసరంలేదన్నారు. మోడీ ప్రభుత్వంతో సానుకూల సంబం ధాలు కొనసాగించాలని తాము కోరుకుంటున్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక చర్చలలో తగినంత పురోగతి సాధించిన తర్వాత.. సరైన సమయం చూసుకొని తారిక్ రెహ్మాన్ భారత పర్యటనకు వెళ్తారని హుమయూన్ పేర్కొన్నారు. ప్రధాని అధికారిక పర్యటనకు తగిన సన్నాహాలు, ఇరుపక్షాల మధ్య అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లు అవసరమని తెలిపారు. మరోవైపు ఈ పర్యటపై బంగ్లా ప్రధాని కార్యాలయం స్పందిస్తూ.. తారిక్ పర్యటనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు ఇతర నిందితులను అప్పగించే విషయంలో భారత్ స్పందన కోసం బంగ్లా వేచిచూస్తున్నట్లు సమాచారం. మరో వైపు సెప్టెంబరు 12-13 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో బంగ్లా ప్రధాని పాల్గొనాల్సి ఉండగా.. అంతకుముందే ఆయన ఢిల్లీ పర్యటనకు వస్తారని వార్తలువచ్చాయి. బంగ్లా ప్రధానిని స్వాగతించే కార్యక్రమం కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయని రాష్ట్రపతి భవన్ నుంచి ఇటీవల ప్రకటన వెలువడినప్పటికీ.. గంటల వ్యవధిలోనే దానిని ఉపసంహరించుకోవడం గమనార్హం.

# నేడు చైనాలో అజిత్ దోవల్ పర్యటన




**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సోమవారం చైనాలో పర్యటించనున్నారు. భారత్‌చైనా సరిహద్దు నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ అవుతారు. ఇద్దరు నేతలు భారత్‌చైనా సరిహద్దు వివాదంపై 25వ విడత చర్చల్లో పాల్గొననున్నారు. దోవల్, వాంగ్ యీలు మంగళవారం చర్చలు జరపనున్నారు. దాదాపు 2,488 కిలోమీటర్ల పొడవైన భారత్ చైనా సరిహద్దు వివాదానికి పరిష్కారం కనుగొనే లక్ష్యంతో ఈప్రత్యేక ప్రతినిధుల చర్చల ప్రక్రియను 2003లో ప్రారంభించారు. ఇరు దేశాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధులు కూడా ఈ చర్చల్లో పాల్గొంటున్నారు. సరిహద్దు సమస్యతో పాటు భారత్‌చైనా ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించి అనేక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్ నెలలో బ్రిక్స్ సదస్సు న్యూఢిల్లీలో జరగబోతోంది. ఈ సమావేశానికి ముందు భారత్, చైనాల మధ్య ఈ హైలెవల్ మీటింగ్ జరుగుతోంది. బ్రిక్స్ సమ్మిట్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వచ్చే అవకాశం ఉంది. ఇంకా అధికారిక ప్రకటన వెలువడకున్నా, షీ జిన్‌పింగ్ భారత్‌కు వస్తే ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది.

# వందేమాతరం గీతం మధ్యలోనే వెళ్లిపోయిన యుపి స్పీకర్

**ఉన్నావ్ (యుపి), ఆగస్టు 23:** ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన ఓ పాఠశాల కార్యక్రమంలో ఊహించని ఘటన వెలుగుచూసింది. ప్రిన్సిపాళ్ల కౌన్సిల్, విద్యా సదస్సు ముగింపు సందర్భంలో ముఖ్య అతిథిగా హాజరైన యూపీ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలోనే వేదిక దిగి వెళ్లిపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రోటోకాల్ ప్రకారం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన వెంటనే జాతీయ గీతం ప్రారంభమైంది. అయితే గీతం సాగుతుండగానే ఆయన వేదిక వెనుక వైపునకు నడుచుకుంటూ వెళ్లారు. సతీష్ మహానా వేదిక దిగుతున్న సమయంలో అక్కడేఉన్న ఆయన అనుచరులు, మద్దతుదారులు ఆయనను చుట్టుముట్టి పాదాలకు నమస్కరించడం ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన నేరుగా తన వాహనంఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. పూరన్ నగర్‌లోని ఒక పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై నిర్వాహకులు వివరణ ఇస్తూ.. స్పీకర్ ఉన్న ప్రదేశానికి, జాతీయ గీతం మైక్ స్పీకర్లకు మధ్య కాస్త దూరం ఉండటం వల్ల ఈ పొరపాటు జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు.

# అణ్వస్త్ర తయారీకి ఇరాన్ కసరత్తులు




**టెహ్రాన్, ఆగస్టు 23:** ఇరాన్‌ను ఏదో విధంగా లొంగదీసుకునేందుకు ఆరు నెలలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమైనీతో పాటు టాప్ కమాండర్లు అందరినీ చంపేసినా ఆ దేశం మాత్రం ట్రంప్‌కు లొంగడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక విలవిల్లాడుతున్న ట్రంప్ ఆ అసహనంతో ఇరాన్ ఆయువు పట్టు అయిన హార్మూజ్ జలసంధిని దిగ్బంధించారు. అటువైపుగా వచ్చే ఇరాన్ నౌకలపై దాడులు చేస్తున్నారు. దీంతో ఇరాన్ కూడా ప్రతిదాడులు చేస్తోంది. తాజాగా హార్ముజ్ తమదేనని ట్రంప్ ఓ మ్యాప్ కూడా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఇరాన్ ఇక చివరి అస్త్రం వాడేందుకు సిద్ధమవుతోంది. ఇన్నాళ్లూ ఏ అణ్వస్త్రాలు తయారుచేస్తున్నదని ఇరాన్‌ను అమెరికా ఇజ్రాయెల్‌లు కట్టడిచేస్తు వస్తున్నాయో ఇపుడు అదే అణ్వస్త్రాన్ని తయారుచేసేందుకు ఇరాన్ సిద్ధం అవుతోంది. ట్రంప్ చేస్తున్న దాడులతో ప్రపంచ దేశాలకు అణ్వస్త్రాలు సమకూర్చుకోవాల్సిన అవసరం ఏర్పడుతోందని ఇరాన్ తాజాగా ప్రకటించింది. అణ్వస్త్ర నిరోధక ఒప్పందాలపై సంతకాలుచేసిన దేశాలకు కానీ, అణు ఇంధన సంస్థలో భాగస్వాములైన దేశాలకూ కానీ అమెరికానుంచి రక్షణ లేదని ఇరాన్ తేల్చిచెప్పేసింది. ప్రపంచ అణు భద్రతను ట్రంప్ దెబ్బతీస్తున్నారని ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఆరోపించారు. ఇరాన్‌పై దాడుల వల్ల అణ్వాయుధాలు సంపాదించాలనే దేశాల కోరిక పెరిగిందన్నారు.

# రాహుల్‌ను బ్యాట్‌మాన్‌గా పోలుస్తూ విడియోలు వైరల్

## ఎఐసిసి కార్యాలయం ముందు కూడా భారీ పోస్టర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** ఢిల్లీలోని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయం వెలుపల తాజాగా వెలిసిన పోస్టర్లు, బ్యానర్లు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌కు తెర తీశాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఓ నూతనరూపంలో చిత్రీకరిస్తూ వెలిశాయి. ఇప్పుడవి అందరి దృష్టిని ఆకర్షిస్తోన్నాయి. రాహుల్ గాంధీని హాలీవుడ్ సూపర్ హీరో క్యారెక్టర్ బ్యాట్‌మ్యాన్‌తో పోల్చుతూ ఈ పోస్టర్లు వెలిశాయి. రియల్ లైఫ్ బ్యాట్‌మ్యాన్‌గా అభివర్ణిస్తూ ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశాన్ని కాపాడే ఓ సైలెంట్ గార్డియన్‌గా, వాచ్ ఫుల్ ప్రొటెక్టర్‌గా ఈ పోస్టర్లలో రాహుల్‌గాంధీని అభివర్ణించారు. రాజకీయంగానే కాకుండా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లపై కూడా హాట్ డిబేట్స్ సాగుతున్నాయి ఈ పోస్టర్ల మీద. యువతతో పాటు ముఖ్యంగా జెన్‌జీ ఓటర్లను రాహుల్‌గాంధీ విపరీతంగా ఆకట్టుకున్నట్టుయిందనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ఇటీవల రాహుల్ గాంధీ నిర్వహించిన ఓ ఇంటరాక్టివ్ సెషన్‌లో ఈ బ్యాట్‌మ్యాన్ ప్రస్తావన వచ్చింది. దీని తర్వాతే ఈ పోస్టర్లు వైరల్ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవలే రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా యువతతో ప్రత్యక్షంగా ముచ్చటించేందుకు ఆస్క్ మీ ఎనీథింగ్ అనే డిబేట్‌ను ప్రారంభించారు. విద్యార్థుల నిరసనలు, విద్యావ్యవస్థ, దేశ



ఆర్థిక విధానాలు, వ్యక్తిగత ఆలోచనల వంటి విభిన్న అంశాలపై సాగిందీ సెషన్. ఇందులో ఓ ఒక నెటిజన్ మీరేమైనా బ్యాట్‌మ్యానా అంటూ సరదాగా రాహుల్ గాంధీని ప్రశ్నించాడు. దానికి ఆయన నవ్వుతూ ఈ ప్రపంచంలో నన్ను, బ్యాట్‌మ్యాన్‌ను ఇంతవరకు ఎవరూ ఒకే రూమ్‌లో చూడలేదు, చూడలేరుకూడా అంటూ బదులు ఇచ్చారు. దీనికి తోడు బ్యాక్‌గ్రౌండ్‌లో డార్క్ నైట్ సినిమా థీమ్ మ్యూజిక్‌తో వర్షంలో నిల్చొనిఉన్న ఓ వీడియో క్లిప్‌ను కూడా రాహుల్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కన్నడ సూపర్ స్టార్ పవర్ హౌస్ క్యారెక్టర్ దీంతో ఈ బ్యాట్‌మ్యాన్ పోలిక నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయింది.

# సూట్‌కేస్‌లో శవం ముక్కలు.. కొన్ని ముక్కలతో బిర్యానీ!

**ఆగ్రా, ఆగస్టు 23:** చెన్నై నుంచి ఢిల్లీ వెళ్తున్న రైలులో లభించిన ఓ సూట్ కేసులో మహిళ శరీర భాగాలు బయటపడిన కేసును పోలీసులు ఛేదించారు. ఆగ్రా రైల్వే స్టేషన్‌లో సూట్‌కేసు లభించగా అందులో లభించిన శరీర భాగాల మూలాలు చెన్నైలో దొరికాయి. 350కి పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను జల్లెడ పట్టిన పోలీసులు చివరకు అనుమానితుల ఇంటిని కనుగొన్నారు. అక్కడకు వెళ్లి చూడగా పోలీసులకు భయానక దృశ్యాలు కనిపించాయి. మహిళ శరీరాన్ని ముక్కలుగా కోయడమే కాకుండా ఆనవాళ్లు లేకుండా చేసేందుకు వాటితో బిర్యానీ వండినట్లుగా గుర్తించి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ నెల 5న చెన్నై నుంచి ఢిల్లీ బయలుదేరిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఓ జనరల్ కంపార్ట్‌మెంట్‌లోనుంచి తీవ్ర దుర్వాసన రావడంతో ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తనిఖీ చేయగా అనుమానాస్పదంగా కనిపించిన ఎరుపు రంగు సూట్‌కేస్ కనిపించింది. దాన్ని తెరిచి చూడగా అందులో మహిళ మృతదేహానికి సంబంధించిన శరీరభాగాలు ఉండటంతో ఒక్కసారిగా కలకలం రేగింది. దర్యాప్తులో ఆ సూట్‌కేస్ చెన్నై నుంచే రైలులో పెట్టినట్లు గుర్తించారు. దీంతో ఆగ్రాపోలీసులు తమిళనాడు పోలీసులను సంప్రదించారు. కేసును ఛేదించేందుకు చెన్నై పోలీసులు రంగంలోకి దిగారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని 350కిపైగా సిసి కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో ఓ పురుషుడు, ఓ మహిళ కలిసి ఎరుపు రంగు సూట్‌కేస్‌తో స్టేషన్‌కు వచ్చినట్లు గుర్తించారు. వారు సూట్‌కేస్‌ను తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఉంచి అక్కడినుంచి వెళ్లిపోయారు. అనంతరం చెన్నై పార్క్ రైల్వే స్టేషన్ నుంచి సబర్బన్ రైలు ఎక్కి గూడువాంజేరి చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గూడువాంజేరి రైల్వేస్టేషన్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా అదే వ్యక్తులు సూట్‌కేస్‌తో ఓ ఆటోలో వెళ్తున్న దృశ్యాలు పోలీసులకు కనిపించాయి. ఆటోను అనుసరిస్తూ వెళ్లిన పోలీసులు గూడువాంజేరి మసీదు వీధిలో వారు నివసిస్తున్న ఇంటిని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా అక్కడ హత్య జరిగినట్లు అనుమానించే కీలక ఆధారాలు లభించాయి. గదుల్లో రక్తపు మరకలు కనిపించడంతో పోలీసుల అనుమానాలు మరింత బలపడ్డాయి. పోలీసుల తనిఖీల్లో ఓ భారీ బిర్యానీ పాత్ర కనిపించింది. దానికి మూతపెట్టి చుట్టూ మైదాపిండి అతికించినట్లు గుర్తించారు. మూత తొలగించి చూడగా బియ్యంతో పాటు మానవ శరీరానికి సంబంధించిన ముక్కలు కనిపించడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. హత్యకు గురైన మహిళ శరీరాన్ని ముక్కలు చేసిన తర్వాత కొన్ని భాగాలను సూట్‌కేస్‌లో పెట్టి రైలులో తరలించినట్లు, మిగిలిన భాగాలను వండుతూ ఆనవాళ్లులేకుండా చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి తల మాత్రం ఇంకా లభించలేదు. దానికోసం పోలీసులుగాలిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో మృతురాలిని ఒడిశాకు చెందిన హయాత్ నిషాగా గుర్తిం చారు. ఆమె భర్త నుంచి విడిపోయి చెన్నైలో ఉంటున్నట్లు తెలిసింది. ఆమె 19 ఏళ్ల కుమారుడు తాంబరంలో ఏసీమెకానిక్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిషాతో కలిసి మాణిక్ ఉత్తిన్ లస్కర్, అతని భార్య భాగమతి మాజిక్ నివసిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

# సొమ్ములిస్తేచాలు అయోధ్యలో దొడ్డిదారిన దర్శనం



**అయోధ్య, ఆగస్టు 23:** అయోధ్య ఆలయ విరాళాలకు సంబంధించి పలు ఆరోపణలు బయటపడిన క్రమంలో ఆలయంలో జరుగు తున్న మరిన్ని అక్రమాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. అయోధ్య రాముడి దర్శనానికి గంటల తరబడి లైన్లలో వేచి ఉండక్కర్లేదు. మీరు అక్కడ ఉన్న బ్రోకర్లకు లంచం ఇస్తే చాలు. వారే మేజిస్ట్రేట్ కార్యాలయం నుంచి ప్రొటోకాల్స్ జారీ చేస్తారు. స్వయంగా ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ మీ వెంట వచ్చి ఆలయ దర్శనం చేయిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శుభమ్ దూబే అనే ప్రచారకుడు స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మాకు రూ.7,300 ఇస్తే మీకు దగ్గరుండి విఐపి దర్శనం చేయిస్తాం అని ఆతడు పేర్కొన్నాడు. అయోధ్య విరాళాల చోరీ, ఆలయంలోని అక్రమాలు బయటపడి సంచలనం సృష్టించినా ఈ దొడ్డిదారి దర్శనం మాత్రం యథేచ్ఛగా కొనసాగు తున్నది. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆలయ అధికారులు, మహంతులు, పూజారులు భాగస్వాములేనని ఆయన తెలిపాడు. ఆలయ రద్దీ కారణంగా ఎంట్రీ పాస్‌ల జారీ నిలిపివేసినా బ్రోకర్లు వీటిని యథేచ్ఛగా భక్తులకు అమ్ముతుండటం కన్పించింది. సొమ్ములిస్తే ఆలయంలోని నిషేధిత ప్రాంతాల్లో యథేచ్ఛగా రీల్స్ చేసుకోవచ్చు. కెమెరాతో షూటింగ్‌లు చేసుకోవచ్చు. అయోధ్య విరాళాల చోరీ కేసులో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా, ఆలయ అధికారి గోపాల్ రావులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లేకపోతే తదుపరి ఉద్యమాన్ని కొనసాగిసామని ఫైజాబాద్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# బంగ్లాలో హిందూ టీచర్ కుటుంబం దారుణ హత్య

**ఢాకా, ఆగస్టు 23:** బంగ్లాదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండడాన్ని ప్రశ్నించినందుకు దుండగులు అతన్ని చంపారు. ఈ సంఘటన రంగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసు కమిషనర్ మహ్మద్ అబ్దుల్ వివరాలు వెల్లడించారు. గణపతి చక్రవర్తి (65) కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ టీచర్‌గా రిటైర్ అయి హోమియోపతి వైద్యాన్ని ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం రంగ్‌పూర్‌లో కొత్త ఇంటిని నిర్మించుకుని భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామీ (23). కుమారుడు ప్రియమ్ (12)తో కలిసి ఉంటున్నారు. చక్రవర్తి భార్య ప్రీతిలతకు ఆమె సోదరి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మిగతా కుటుంబసభ్యుల ఫోన్లు సైతం కలవకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఆ ఇంటి తలుపులను పగలగొట్టి చూడగా నలుగురు హత్యకు గురై కనిపించారు. చక్రవర్తి మృతదేహం ఇంటి కప్పుపైన, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపైన, కుమారుడి మృతదేహం ఇంట్లోని మంచం కింద లభ్యమయ్యాయి. గురువారం రాత్రి ఈ హత్యలు జరిగినట్లు పోలీసు కమిషనర్ మహ్మద్ అబ్దుల్ తెలిపారు. ఇద్దరు దుండగులు డ్రగ్స్ తీసుకోవడానికి చక్రవర్తి ఇంటిపైకి వెళ్లారు. దాన్ని గమనించిన గణపతి వారిని ప్రశ్నించడంతో తమను గుర్తుపట్టారని, టవల్‌తో మెడకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో భార్య ప్రీతిలత పైకి వెళ్లగా ఆమెను సైతం గొంతునులిమి హత్య చేశారు. అనంతరం వారి పిల్లలను చంపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## ఇస్లామిక్ నాటోలో చేరేందుకు బంగ్లాదేశ్ ఆసక్తి



**ఢాకా, ఆగస్టు 23:** ఇరాన్ వార్ తర్వాత పశ్చిమాసియాతో పాటు అంతర్జాతీయంగానూ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ వార్ కంటే ముందే జరిగిన ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పాకిస్థాన్‌సౌదీ అరేబియా కలిసి మక్కా రక్షణ ఒప్పందం చేసుకున్నాయి. ఇపుడు భారత్ పొరుగునే ఉన్న బంగ్లాదేశ్ ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు సానుకూలత వ్యక్తం చేసారు.

## ముగ్గురు సజీవ దహనం, పలువురికి గాయాలు

**భక్తియార్‌పూర్, ఆగస్టు 23:** బీహార్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిప్రమాదంలో ముగ్గురు సజీవ దహనమవ్వగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన పాట్నా జిల్లా బఖ్తియార్‌పూర్‌లో రాత్రి పొద్దుపోయాక పురానీ బైపాస్ ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే పురానీ బైపాస్ ప్రాంతంలోని ఒక బైక్ విడిభాగాల దుకాణం, దానికి ఆనుకుని ఉన్న ఇంట్లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అత్త, కోడలు, ఆరు నెలల చిన్నారి పాపతో సహా ముగ్గురు సజీవ దహనమయ్యారు.

## అమెరికాలో భారత సంతతి వ్యాపారి హత్య

**టెన్నెస్సీ, ఆగస్టు 23:** అమెరికాలో మరో భారత జాతీయుడు దుండగుడి కాల్పులకు బలైపోయారు. టెన్నెస్సీ రాష్ట్రంలోని జాక్సన్ నగరంలో గురువారం సాయంత్రం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గుజరాత్‌కు చెందిన సురేష్ పటేల్ (56), తన కుమార్తెతో కలిసి షాపులో ఉండగా ఈ దాడి జరిగింది. కుమార్తె కళ్లెదుటే తండ్రిని దుండగుడు కాల్చి చంపడం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.

## బలూచ్‌ప్రావిన్స్‌లో హిందూ వ్యాపారి దారుణ హత్య

**క్వెట్టా, ఆగస్టు 23:** బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఒక హిందూ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని సాయుధులు ఆయన దుకాణంలోకి చొరబడి కాల్చి చంపారు. పాకిస్థాన్‌కు చెందిన డాన్ వార్తాపత్రిక కథనాన్ని ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ వివరాలను వెల్లడించింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నుష్కి పట్టణంలోని ఖాదిరాబాద్ ప్రాంతంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగులు వ్యాపారి రాకేశ్ కుమార్ దుకాణంలోకి చొరబడగా, ఆయన వారిని ప్రతిఘటించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో నిందితులు ఆయనపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు.

## కేరళ డివైఎఫ్ఐకి తొలిసారి మహిళ చీఫ్



**తిరువనంతపురం, ఆగస్టు 23:** సిపిఎం అనుబంధ యువజన విభాగం డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కేరళ విభాగం చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలిగా తొలిసారి ఒక మహిళా నేత ఎన్నికయ్యారు. త్రిశూర్‌లో జరిగిన 16వ రాష్ట్ర మహాసభలో చింతా జెరోమ్‌ను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఎ.ఎ. రహీం అధికారికంగా ప్రకటించారు.

## జపాన్‌లో 5.9 తీవ్రతతో భూకంపం

**టోక్యో,ఆగస్టు 23:** జపాన్‌లో వరుస భూకంపాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి అక్కడ భూమి కంపించింది. ఈరోజు తెల్లవారుజామున తూర్పు జపాన్‌లో సంభవించిన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రతతో నమోదైంది. రాజధాని టోక్యోలోనూ దీని ప్రభావం స్పష్టంగా కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అయితే, అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేయకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వార్త, హైదరాబాద్, సోమవారం 24, ఆగస్టు 2026

# సిఎం రేవంత్ నేతృత్వంలో మళ్లీ 101 సీట్లతో అధికారంలోకి

### శ్రమించిన కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యత

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 101 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డిసిసి అధ్యక్షులు నగేష్‌రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సునీల్ కుమార్‌రెడ్డి, విపుల్‌గౌడ్, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పదవుల్లో సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. కింది స్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా పదవులు



ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

ఇవ్వాలని డిమాండ్ వస్తోం దని, పదవుల భర్తీలో అన్ని వర్గాలకు సమతుల్యత పాటిస్తామని చెప్పారు. 70 శాతం పదవులను పాత కార్యకర్తలకే ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జితో కలిసి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఐదేళ్లుగా పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డ వారికి పదవుల్లో అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎన్ఎస్ యుఐ, యూత్ కాంగ్రెస్‌తోపాటు పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న కార్యకర్తలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

అన్ని కమిటీలను భర్తీ చేస్తామని, ఇందులో 20 శాతం కొత్త వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీలకు సంబంధించి అప్రూవల్ ఇవ్వాలని మంత్రి సీతక్క సూచించినట్లు మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. 'అధికారం కార్యకర్తల కృషి వల్లే వచ్చింది. కార్యకర్తల కష్టాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మరచిపోదు' అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పిసిసి అధ్యక్షుడిగా తన 35 యేళ్ల ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల కల సాకారం అయిందని పేర్కొన్నారు.

**ఆర్మూర్‌లో త్వరలో పామాయిల్ ఇండస్ట్రీ ఏర్పాటు**

ఆర్మూర్‌లో పామాయిల్ ఇండస్ట్రీ రాబోతుందని పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఏ సమస్య వచ్చిన ఇన్‌చార్జి మీనాక్షి, కెసి వేణు గోపాల్ ఉన్నారని ఎవరైనా హద్దులు దాటితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక సంస్థాగత నిర్మాణంతో ఉంటుందనీ కార్యకర్త నుంచి నాయకుల వరకు వాక్‌స్వేచ్ఛ కలిగిన వాతావరణం ఉంటుందని కుటుంబ పార్టీలు, ప్రాంతీయ పార్టీల రీతిలో నియంతృత్వ నాయకత్వం ఉండదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అత్యధికం ఇందిరమ్మ ఇళ్ల జిల్లాలో ఇచ్చామని తెలిపారు.

హైదరాబాద్ మాదిరి నిజామాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టామని సహకార సంఘాల్లో కష్టపడ్డ వారికి పదవులు ఇస్తామని తెలిపారు. నిజామాబాద్ మాస్టర్ ప్లాన్‌పై సిఎంతో చర్చించామని అన్నారు.

## ఎన్టీపిసికి 500 మెగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ టెండర్ ఖరారు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఎన్టీపీసీ (నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్)కి 500 మెగావాటల రెన్యూవబుల్ ఎనర్జీ టెండర్ ఖరారైంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇసిఐ) నిర్వహించిన టెండర్లో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ యొక్క పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ 500 మెగావాట్ల కాంట్రాక్ట్ సామర్థ్యాన్ని దక్కించుకుంది. దేశంలోని అంతర్రాష్ట్ర ప్రసార వ్యవస్థ (ఐఎస్‌టిఎస్)- అనుసంధానిత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల నుండి 6000 ఎమ్‌డబ్ల్యూహెచ్ (మెగావాట్లు పర్ అవర్) హామీతో కూడిన గరిష్ట సరఫరా కోసం పునరుత్పాదక ఇంధన విద్యుత్ డెవలపర్ ఎంపికకై పోటీ బిడ్డింగ్ నిర్వహించింది. టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ప్రక్రియ కింద ఈ సామర్థ్యాన్ని కేటాయించినట్టు ఎన్టీపీసీ ఎక్స్చేంజ్ ఫైలింగ్‌లో పేర్కొంది. శనివారంతో ముగిసిన ఈ రివర్స్ వేలంలో ఫైనల్ ఎంపిక జరిగింది. ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ విజయవంతమైన బిడ్డింగ్ నిలిచి కిలోవాట్ గంటకు రూ.6 చొప్పున నిర్ణీత టారిఫ్‌తో 500 మెగావాట్ల ప్రాజెక్టును దక్కించుకుంది. కాగా ఎక్స్చేంజ్‌కు వెల్లడించిన వివరాలకు ప్రకారం ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ పశ్చిమ బెంగాల్‌లో 200 మెగావాట్లు/800 మెగావాట్-గంటల స్టాండ్ అలోన్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బిఇఎస్ఎస్) ప్రాజెక్టును కైవసం చేసుకుంది. పశ్చిమ బెంగాల్ స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (విద్యుత్ పంపిణీ సంస్థ) మొత్తం 500 మెగావాట్లు/2000 మెగావాట్-గంటల సామర్థ్యం కోసం విడుదల చేసిన టెండర్‌లో, ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఈ రివర్స్ వేలం ద్వారా నెలకు మెగావాట్‌కు రూ.4.35 లక్షల నిర్ధారిత టారిఫ్‌తో తన 200 మెగావాట్లు/800 మెగావాట్-గంటల కేటాయింపును దక్కించుకుంది.

## నేడు నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో రూ.474.82 కోట్లతో రోడ్లకు శంకుస్థాపన

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వైద్య, ఆరోగ్య ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహా, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సోమవారం పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మొత్తం రూ.474.82 కోట్ల అంచనా వ్యయంతో వివిధ ప్రాంతాల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ తొలి దశ ప్యాకేజీల కింద చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్‌లో రూ.146.71 కోట్ల అంచనా వ్యయంతో 3 హ్యామ్ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇందులో అమ్రాబాద్-ఇప్పలపల్లి రహదారి బలోపేతం, బల్మూర్-నాగర్‌కర్నూల్ పిడబ్ల్యూడి రహదారి విస్తరణ, అచ్చంపేట-రాకొండ రహదారి విస్తరణ పనులు ఉన్నాయి.అనంతరం వనపర్తిలో కర్నెతండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. తర్వాత కొల్లాపూర్ నియోజకవర్గంలోని దావాజిపల్లిలో రూ.41.75 కోట్లతో, వీపనగండ్లలో రూ.30.01 కోట్లతో, పెద్దదగడలో రూ.45.60 కోట్లతో, చిన్నంబావిలో రూ.39 కోట్లతో చేపట్టనున్న రహదారి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.పెంట్లవెల్లి మండలంలో రూ.171.75 కోట్ల అంచనా వ్యయంతో ఏడు రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు. పెంట్లవెల్లి-వనపర్తి, పెంట్లవెల్లి-శ్రీరంగాపూర్, పెద్దకార్పాముల-అంబట్పల్లి, రాజాపూర్-ఏదుల, కొల్లాపూర్-లింగాల, తీగలపల్లి-ఏదుల, షనాయిలపల్లి-గౌరెడ్డిపల్లి రహదారుల విస్తరణ, బలోపేతం పనులు ఇందులో ఉన్నాయి.ఈ పనులతో ఆయా ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడి, గ్రామాలు-మండల కేంద్రాలు-ప్రధాన పట్టణాల మధ్య రవాణా మరింత సులభతరం కానుంది.

## రాహుల్‌గాంధీ ప్రధానిని చేసే లక్ష్యంతో పనిచేద్దాం

### గద్వాల జిల్లా పిఎసి సమావేశంలో సచిన్ సావంత్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** దేశంలోని వనరులు అణగారిన వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా పంపిణీ జరగాలనే సైద్ధాంతిక ఆలోచనతో ఉన్న రాహుల్‌గాంధీని దేశప్రధానిగా చేసే లక్ష్యంతో పనిచేయాలని ఎఐసిసి కార్యదర్శి సచిన్‌సావంత్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ పిఎసి సమావేశం ఎఐసిసి కార్యదర్శి సచిన్‌సావత్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ఎఐసిసి సెక్రటరీ సంపత్ కుమార్, వంశీచంద్‌రెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజీవ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. సర్ కార్యక్రమంలో అర్హులైన ఎవరి వోటు తొలగించకుండా కార్యకర్తలు చూసుకోవాలని సావంత్ కోరారు. జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, పార్టీ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించడం వంటి కార్యక్రమాలు సమష్టి నిర్ణయంతో చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగడానికి కార్యకర్తలు నాయకులు పూనుకోవాలని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు కాంగ్రెస్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలని కోరారు.

## రాష్ట్రంలో వ్యర్థాల నుండి గ్యాస్‌కు పెద్దపీట

### రూ.700 కోట్లతో క్లస్టర్ ఆధారిత బయోగ్యాస్ ప్రాజెక్టు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తెలంగాణలో వ్యవసాయ, ఇళ్ల వ్యర్థాల నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తికి పెద్దపీట వేస్తున్నారు. తెలంగాణలో వ్యవసాయ, కూర గాయల, మున్సిపల్ వ్యర్థాల నుండి బయోగ్యాస్ ఉత్పత్తి నిరంతరంగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వరి గడ్డి, కూరగాయల వ్యర్థాలు మరియు పశువుల వ్యర్థాలను ఉపయోగించి హరిత ఇంధనం, విద్యుత్ మరియు ప్రాకృతిక ఎరువులను తయారు చేసేందుకు ఇప్పటికే రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు రూపుదిద్దు కుంటున్నాయి. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రూ.700 కోట్ల భారీ వ్యయంతో క్లస్టర్ ఆధారిత బయోగ్యాస్ ప్రాజెక్ట్‌కు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని పనులు శరవేగంతో జరుగుతున్నాయి.

ఈ ప్రాజెక్టు ఉత్పత్తి సామర్థ్యం మొత్తం 10 ప్లాంట్ల ద్వారా రోజుకు 100 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి లక్ష్యం కలిగి ఉంది. మొదటి దశలో రూ.210 కోట్లతో 3 యూనిట్లు వస్తున్నాయి. అలాగే హైదరాబాద్‌లని బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో రోజుకు 10 టన్నుల కూరగాయల వ్యర్థాలతో బయోగ్యాస్, విద్యుత్, వంట ఇంధనాన్ని తయారు చేస్తున్నారు. అంతేకాకుండా వరి గడ్డిని కాల్చడం ద్వారా వచ్చే కాలుష్యాన్ని అరికట్టేందుకు, సిద్దిపేట, గంభీరావుపేట ప్రాంతాలలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. క్లస్టర్ ఆధారిత విధానంలో ఇవి రూపుదిద్దుకుంటున్నాయి. ఇక గుడి మల్కాపూర్‌లో కూడా రోజుకు 5 టన్నుల కూరగాయల వ్యర్థాలను శుద్ధి చేసి బయోగ్యాస్, ఎరువులను ఉత్పత్తి చేస్తున్నారు. గ్యాస్ తయారీ పోను మిగిలే ద్రవ మరియు ఘన రూప వ్యర్థాలు నాణ్యమైన సేంద్రియ ఎరువులుగా ఉపయోగపడతాయి. కాగా గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఎల్పీజీ, సహజ వాయువుకు ప్రత్యామ్నాయంగా కంప్రెస్డ్ బయో గ్యాస్‌ను వాడవచ్చని అధికారవర్గాలు వెల్లడించాయి. ఇదే సమయంలో వరి గడ్డిని వ్యర్థంగా భావించకుండా విక్రయించడం ద్వారా రైతులు ఇంధన ఉత్పత్తిదారులుగా మారుతున్నారని అధికారులు వెల్లడించారు.

## రాష్ట్రంలో గందరగోళంగా విద్యా వ్యవస్థ

### శక్తి స్కీమ్ రద్దుపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు

### విద్యారంగంపై సిఎం ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఎఐఎస్ఎఫ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 23:** విద్యార్థులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైకి ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయా లంటూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పాత ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏంటని? ప్రశ్నించారు. విద్యార్థులు చదువులకు నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం వృధా ఖర్చులు చేస్తుందని, అందాల పోటీలకు, ఫుట్‌బాల్ పోటీలకు ఉన్న నిధులు ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి బకాయిల విడుదలకు ఎందుకు లేవని? ప్రశ్నించారు.

తెలంగాణ ప్రభుత్వం పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి మారుస్తూ తీసుకువచ్చిన శక్తి స్కీమ్, జీవో97ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతి రోజు ప్రతి పాలిటెక్నిక్ కళాశాలల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లపై పట్టించుకోకపోవడం లేదన్నారు.

ప్రభుత్వ ప్రవేట్ భాగస్వామ్యంలో నిర్వహణలో ఉన్న స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్య విలీనం చేస్తే ప్రభుత్వం యూనివర్సిటీకి నిధులు ఇవ్వకపోతే యూనివర్సిటీ వారు ఫీజులు పెంచి విద్యార్థి దగ్గర నుంచి వసూలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తా ఉన్న ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తామన్న 24 రకాల కిట్లను రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, విద్యార్థులు పాత యూనిఫాములతోటే పంద్రాగస్టు వేడుకలకు హాజరు కావాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు చెప్పుకోవడానికి ప్రత్యేక విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిఎం వద్దే విద్యాశాఖ ఉన్న సిఎం కలువకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. విద్యాశాఖ కు ప్రత్యేక మంత్రి కి కేటాయించి రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేసి, పాలిటెక్నిక్ విద్యార్థుల పాలిట వ్యతిరేకంగా ఉన్న శక్తి స్కీమ్, జీవో నెంబర్ 97 రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

## 4 లక్షల గిరిజనులతో కొత్తగూడెం అగ్రస్థానం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన జనాభాలో అత్యధికంగా కొత్తగూడెం జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలో నాలుగు లక్షల మంది గిరిజన జనాభా ఉన్నట్లు ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. అలాగే 3 లక్షల మందితో మహబూబాబాద్ రెండో స్థానంలోను, 2.25 లక్షలతో ఆదిలాబాద్ మూడో స్థానంలో ఉన్నాయి. ఇక రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో 2.10 లక్షల మంది గిరిజనులు, ఖమ్మంలో 2 లక్షల మందితో అధిక జనాభాను కలిగి ఉన్న జిల్లాగా నమోదైంది. అదేవిధంగా రాష్ట్రంలో లక్ష నుంచి లక్షన్నర మధ్య రంగారెడ్డి, సూర్యాపేట, కొమరం భీమ్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలు, 50 నుండి లక్ష జనాభా మధ్యన కలిగిన షెడ్యూల్ ట్రైబ్స్ జిల్లాలు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మంచిర్యాల, నిర్మల్, ములుగు ఉన్నాయి.

## కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికి లేదు

### మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త :** కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికి లేదని పార్టీకి నష్టం జరిగితే ఎఐసిసి,పిసిసి క్రమశిక్షణ కమిటి నిర్ణయం తీసకొంటుందని పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి హైదరాబాద్‌లో ఆదివారం విలేఖరులతో



మాట్లాడుతూ సురేఖ అక్క కూతురు మాట్లాడింది పార్టీకి డ్యామేజ్ చేసిందని అన్నారు. మంత్రి సురేఖ కావొచ్చు వాకిటి శ్రీహరి కావొచ్చు ఇంకా ఎవరైనా కావొచ్చు ముందు పార్టీ తరువాతే అందరూ, ముందు పార్టీనీ కాపాడుకోవాలి,దానికి అనుగుణంగా ముందుకు పోతాం అని తెలిపారు. పార్టీ లైన్ దాటితే వాటికి శ్రీహరి పై కూడా చర్యలు తప్పదని ఆయన వివరించారు. పార్టీకి డామేజ్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది అలాగే సురేఖక్క పై కూడా ఉందని ఆమెపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికి లేదు అని అన్నారు. పార్టీ కి డ్యామేజ్ అయితే ఎఐసిసి,పిసిసి క్రమశిక్షణ కమిటీ నిర్ణయం తీసుకుంటుందనీ చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటొద్దు అని అన్నారు. ఆర్థిక వ్యవస్థ చిన్న బిన్నం అయినా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నో సంక్షేమ పథకాలు ఇస్తూ మరోవైపు గతంలో జరగనంత అభివృద్ధి చేస్తూ ఎంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు పోతుంటే ఇలాంటివి జరగడం బాధాకరం అని ఆవేదన చెందారు. ప్రతి పక్షాలకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందనీ హితవు చెప్పారు. సురేఖ అక్క ఒక్క దానికే నోటీస్ ఇవ్వలేదు,చిన్నారెడ్డి కి కూడా నోటీస్ ఇచ్చారనీ బిసిలు అగ్రవర్ణకులాలు ఎవరైనా పార్టీ ముందు ఒకటే , తప్పు చేస్తే ఎవరి పైన అయిన చర్యలు ఉంటాయి అని ఆయన తెలిపారు. సామాజిక న్యాయం పాటించేది కాంగ్రెస్ పార్టీ మాత్రేమ బిసిఅగ్రవర్ణాలు అని వ్యత్యాసాలు ఉండవని అన్నారు.

## మొక్కజొన్నను కాటేస్తున్న కత్తెర పురుగు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మొక్కజొన్నకు తెగుళ్ల సోకుతున్నాయి. ప్రధానంగా ఈ మొక్కలపై కత్తెర పురుగు కాటేస్తుండటంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ సీజనులో మొక్కజొన్న పంటలో తెగులు అధికంగా వ్యాపిస్తోందని వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వానాకాలం సీజనులో 5,78,312 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లాలో 65,318 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసి అగ్రస్థానంలో ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లాలో 59,063 ఎకరాలు, మహబూబాబాద్‌లో 57,133 ఎకరాలు, నిజామాబాద్‌లో 54,255 ఎకరాలు, కామారెడ్డి 47,237 ఎకరాలు, సిద్దిపేట్‌లో 42,209, వికారాబాద్ జిల్లాలో 42,175 ఎకరాల్లో అత్యధికంగా మొక్కజొన్నను సాగు చేశారు. మిగిలిన జిల్లాల్లో సైతం మొక్కజొన్న అధికంగానే సాగైంది. అయితే వివిధ జిల్లాల్లో పురుగు మొక్కజొన్న చెట్టు కాండం లోపలికి ప్రవేశించి అందులోని గుజ్జుతో పాటు, ఆకులను కూడా వదలకుండా తినేయడంతో పంట ఎదుగుదల లేకుండా పోతోందని చెబుతున్నారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సమస్యగా మారిందని, మందులు పిచికారీ చేస్తున్నా వాటిపై ప్రభావం చూపడం లేదని అంటున్నారు. దీని వల్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు రాష్ట్రంలోకి రాకుండా కుట్రలు

### నెగిటివ్ ప్రచారం చేయడమే బిజెపి, బిఆర్ఎస్ అజెండా

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవద్దని బిఆర్ఎస్, బిజెపి యోచనలో ఉందని, అందులో భాగంగా ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు తెలంగాణలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రలో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన అడ్డుకొన్నారని ఒక ప్రకటనలో భువనగిరి ఎంపి చామల కిరణ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ట్రిపుల్‌ఆర్, మూసీ, ఫ్యూచర్‌సిటీ డెవలప్ కావద్దు, విదేశీ పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి అయితే తమకు మనుగడ ఉండదని బిఆర్ఎస్, బిజెపి భావించి గత రెండున్నర యేళ్లుగా అభివృద్ధి జరగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనేక అడ్డంకులు సృష్టించారని ఆవేదన చెందారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు వస్తే తప్పు ఏముంది, దీనిపై ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని ఆయన సవాల్ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించకుండా అడ్డుకునే ప్రయత్నం చేయడంతోపాటు అదే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావద్దని బిజెపి, బిఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఆవేదన చెందారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడండి ఇప్పటికైనా సిఎం అమెరికా ప్రయాణానికి ఏర్పాటు చేయాలని రాష్ట్రానికి మంచి జరిగితే తప్పు ఏముంది? అని అడిగారు. సిఎం రేవంత్‌రెడ్డి విదేశ పర్యటనపై తప్పుగా మాట్లాడిన బిజెపి ఎంపిలకు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ అవగాహన కల్పించాలని కోరారు. 2014 నుంచి 2023 వరకు సిఎంగా ఉన్న కెసిఆర్ హైదరాబాద్‌ను న్యూయార్క్, కరీంనగర్‌ను ఇస్తాంబుల్ చేస్తా, వరంగల్ ను పారిస్ చేస్తా అని గాలి ముచ్చట్లు చెప్పారే కానీ బిఆర్ఎస్ పాలనలో పదేళ్లలో ఇంజినీరింగ్ విద్యార్థుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు.

ఇంజినీరింగ్ విద్యకు, స్కిల్‌కు, ఉద్యోగానికి మధ్య ఉన్న గ్యాప్‌ను ఫిల్ చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి తాపత్రయం అని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా నెగిటివ్ ప్రచారం చేయాలని బిఆర్ఎస్, బిజెపి ఒకటే అజెండాతో కలిసి పని చేస్తున్నాయి అని అన్నారు.

## బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించాలి

### ఎపి సిఎం చంద్రబాబుకు ఎంపి ఆర్.కృష్ణయ్య అభినందన

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య స్వాగతించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని అభినందించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే ప్రస్తుతం ఉన్న న్యాయపరమైన అడ్డంకులను అధిగమించేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు చేపట్టాలని కృష్ణయ్య కోరారు. దేశవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి ఉందని, అయితే ఎస్సీ, ఎస్టీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. తెలంగాణ, బీహార్ తదితర రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించిన సందర్భాలను ప్రస్తావిస్తూ, బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 34 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీలకు రాజకీయ సాధికారత కల్పించే దిశగా కీలకమైన అడుగని పేర్కొన్నారు.

## బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడిగా అమర్‌పాల్‌మౌర్య బాధ్యతలు స్వీకరణ

### అభినందించిన ఎంపి డా.కె.లక్ష్మణ్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్య బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎంపి డా.లక్ష్మణ్, ఓబిసి మోర్చా జాతీయ సోషల్ మీడియా సభ్యుడు పెరిక సురేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీలో అమర్‌పాల్ మౌర్యను వ్యక్తిగతంగా కలుసుకున్న వారు ఆయనకు అభినందనలు తెలియజేశారు. బిజెపి ఓబిసి మోర్చా మాజీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ సమక్షంలో అమర్‌పాల్ మౌర్యకు బాధ్యతల అధికారిక అప్పగింత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఓబిసి వర్గాల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సంస్థాగత విస్తరణకు ఆయన కృషి చేయాలని పెరిక సురేష్ ఆకాంక్షించారు.సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన అమర్‌పాల్ మౌర్య క్షేత్రస్థాయి కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం ఆయన అంకితభావం, కష్టపడి పనిచేసే తత్వం, పార్టీ పట్ల విధేయతకు నిదర్శనమని పెరిక సురేష్ పేర్కొన్నారు.

## మల్లారెడ్డి వర్సిటీ ఈవెంట్‌లో అపశ్రుతి

### విద్యార్థుల మీద పడిన సౌండ్‌స్పీకర్లు

### పలువురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్ (పేట్ బషీరాబాద్), ఆగస్టు 23, ప్రభాతవార్త:** మల్లారెడ్డి యూనివర్సిటీలో టాక్సిక్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అపశ్రుతి చోటు చేసుకుంది. మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించిన టాక్సిక్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన విద్యార్థులతో కార్యక్రమం సందడిగా సాగుతున్న సమయంలో సౌండ్ స్పీకర్లు విద్యార్థులపై పడటంతో పలువురు గాయపడినట్లు సమాచారం. హీరో యష్ వేదికపై ప్రసంగిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన విద్యార్థులను వెంటనే అంబులెన్సుల ద్వారా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఎంతమంది విద్యార్థులు గాయపడ్డారనే దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ఘటన జరిగిన సమయంలో హీరో యష్ కూడా స్పందిస్తూ.. విద్యార్థులు సురక్షితంగా ఉన్నారా? ఎవరికీ ఏం కాలేదుగా.. సేఫ్‌గానే ఉన్నారుగా? అంటూ నిర్వాహకులను ఒకటికి రెండుసార్లు అడిగారు. నిర్వాహకులు ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. కాగా, సౌండ్ స్పీకర్లను ఏర్పాటు చేసిన పోల్స్ వంటి నిర్మాణాలపైకి కూడా కొందరు విద్యార్థులు ఎక్కడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కార్యక్రమానికి ముందే భారీ సంఖ్యలో విద్యార్థులు తరలి రావడంతో తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. విద్యార్థులు వెనక్కి వెళ్లాలని పోలీసులు, నిర్వా హకులు విజ్ఞప్తి చేశారు. కొంతమంది విద్యార్థులు అక్కడి నుంచి వెనుదిరిగి నప్పటికీ, వేలాదిమంది విద్యార్థులు యూనివర్సిటీ ప్రాంగణంలోనే ఉండి పోయారు. వేదికకు సమీపంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు గుమిగూడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

# లంచాలు మేయడంలో కొత్త ట్రెండ్‌కు తెరలేపిన అక్రమార్కులు

### బినామీల పేరిట అక్రమాస్తులు, డిజిటల్ ద్వారా నగదు స్వీకరణ

### ఎసిబి విచారణలో విస్తుబోయే వాస్తవాలు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** సర్కారీ విభాగాల్లో కొందరు అధికారులు లంచాలు తీసుకుంటూ ఎసిబికి దొరిపోవడం తెలిసిందే. అయితే ఇటీవల కాలంలో కొందరు అక్రమార్కులు లంచాల తాలూకు సొమ్మును డిజిటల్ పద్ధతిలో తీసుకుంటుండగా మరికొందరు అక్రమాస్తులను బినామీల పేరిట వుంచుతున్న వైనం ఎసిబి అధికారులను నివ్వెరపోయేలా చేస్తోంది. శనివారం నాడు చందానగర్ పోలీసు స్టేషన్‌లో రాఘవేంద్ర కుమార్ అనే కానిస్టేబుల్‌తో పాటు ఎస్ఐ బాల్‌రాజ్ 75 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఎసిబికి దొరిక పోయారు. అయితే ఇందులో కా నిస్టేబుల్ రాఘవేంద్ర కుమార్ అంతకు ముందే బాధితుడి నుంచి పది వేల రూపాయలను ఫోన్ పే ద్వారా తీసుకున్న విషయాన్ని ఎసిబి అధి కారులు గుర్తించి, ఈ విషయాన్ని కూడా కేసులో పొందుపరిచారు.

అంతకు ముందు పలు విభాగాల అధికారులు ఎసిబికి పట్టుబడిన సమయం లో వారి వద్ద కోట్లాది రూపాయల ఆస్తులు వెలుగు చూడగా ఇందులో 30 నుంచి 40 శాతం సొత్తు బినామీల పేరిట వుండడం సంచలనం రేపింది. ఈ ఆస్తులను జప్తు చేయాలని ఎసిబి అధికారులు ఐటి శాఖకు లేఖ రాశారు. దీనిపై ఐటి శాఖ విచారణ చేబట్టి బినామీల పేరిట వున్న అక్రమాస్తులను జప్తు చేసే వీలుందని ఎసిబి అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ అధికారుల్లో చాలా మంది అవినీతికి పాల్పడి ఎసిబికి పట్టుబడడం చాలా కాలంగా జరుగుతున్నదే. గతంతో పోలిస్తే ఇటీవల కాలం లో ఎసిబికి పట్టుబడుతున్న అక్రమార్కుల వద్ద పదుల కోట్ల రూపాయల నుంచి వంద, 200 కోట్ల రూపాయల వరకు అక్రమాస్తులు వెలుగుచూస్తున్నాయి.

ఇందులో మెజారిటీ ఆస్తులు బినామీల పేరిట వుంటున్న విషయం తెలిసిందే. ఇదివరకు బినామీ ఆస్తులు కలిగివున్న అవినీతి అ ధికారులు అతికొద్ది మంది మాత్రమే వుండేవారు. కానీ నేడు ఎసిబికి పట్టుబడుతున్న వారిలో 90 శాతం అక్రమార్కులు తమ అక్రమాస్తులను బినామీల పేరిట వుంచుతున్నారు. ఇలా చేయడం వల్ల ఎసిబికి తమ అక్రమాల చిట్టా చిక్కదని అక్రమార్కులు భావిస్తున్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ అధునాతన సాంకేతికతను వాడి అక్రమార్కుల అడ్డగోలు సంపాదన అంతా తాము వెలికి తీస్తున్నామని ఎసిబి అధికారులంటున్నారు.

బినామీ ఆస్తుల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు ఐటి శాఖకు ఎసిబి లేఖ రాయడం సంచలనం రేపిం ది. ఈ లేఖను ఐటి శాఖ తీవ్రంగా పరిగణిస్తోందని తెలుస్తోంది. ఈ విషయంలో ఐటి శాఖ స్పందించి బినామీల ఆస్తులను జప్తు చేస్తే కొత్త అంకానికి తెరలేపే వీలుంది. ఇక రెండవ అంశానికి వస్తే ఇటీవల కొందరు లంచావతారులు డిజిటల్ పద్ధతుల్లో లంచాలు తీసుకుంటున్న ఉదంతాలు పెరిగిపోతున్నాయి. చందానగర్‌లో శనివారం సాయంత్రం వెలుగు చూసిన ఘటన ఇందుకు ఉదాహరణగా చెప్పాలి.

# 22ఎ జాబితా రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపచేస్తాం

## సచివాలయాన్ని ముట్టడిస్తాం: బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు23:** 22ఎ జాబితాను వెంటనే రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తాం.. సచివాలయాన్ని ముట్టడిస్తామని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రజల ఆస్తులను లాక్కుంటే కాంగ్రెస్ పార్టీ మాడి మసైపోవడం ఖాయమని అన్నారు. బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి, హేమానగర్ కాలనీలను ప్రభుత్వం అకారణంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన నేపథ్యంలో.. తీవ్ర ఆందోళనలో ఉన్న ఆయా కాలనీ వాసులకు బాసటగా నిలిచేందుకు ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హరీశ్ రావు హాజరై బాధితులకు భరోసా కల్పించారు.. రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటే రాహుల్ గాంధీ చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. 30 శాతం కమీషన్ల కోసమే వక్ఫ్ రిజిస్టర్ ఇళ్లను నిషేధిత జాబితాలో పెడుతున్నారని విమర్శించారు. భూభారతి పోర్టల్ నుంచి 22ఎ జాబితాను రాత్రికి రాత్రే ఎందుకు మాయం చేశారు? పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఒక ప్రభుత్వం అనేది ప్రజల సమస్యలు పరిష్కరించాలి.. ప్రజల ఇబ్బందులు తొలగించడానికి పని చేయాలి.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు లేని సమస్యలు సృష్టించి వారిని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. మధ్యతరగతి కుటుంబాలు కడుపుకట్టుకుని, పస్తులుండి మెతుకులు తిని, రూపాయి రూపాయి కూడ బెట్టుకుని బ్యాంకుల్లో అప్పులు తెచ్చి ఇళ్లు కట్టుకుంటారని తెలిపారు. 'ఇక్కడ సమావేశంలో స్వప్న అనే సోదరి మాట్లాడుతూ.. పిల్లల పైచదువుల కోసం విదేశాలకు పంపేందుకు ఇల్లు కుదువబెట్టి లోన్ తీసుకుందామంటే మా ఇల్లు 22ఎ లో ఉందని బ్యాంకులు అప్పు ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేసింది. బిడ్డ పెళ్లికో, ఆపదకో ఇల్లు అమ్ముకుందామన్నా అమ్ముకోలేని అయోమయ పరిస్థితిలోకి నెట్టేశారు. 1998లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాం 2008లో అర్బన్ ల్యాండ్ సీలింగ్‌ను ఎత్తేశారు. ఎప్పుడో రద్దయిన చట్టాన్ని మళ్లీ తెచ్చి, పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టి సమస్యలు పాల్పడాలని చూస్తున్నారని' అని హరీశ్‌రావు తెలిపారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రభుత్వ భూములను, ఎస్సైన్డ్ అసైన్డ్ భూములను సైతం తెగ నమ్ముకుంటోందని హరీశ్‌రావు అన్నారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో ఉన్న 1000 గజాల పార్కును కూడా అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆఖరికి గుడి కట్టడానికో, బడి కట్టడానికో, దవాఖానాకో, స్మశానానికో కూడా జాగలేని పరిస్థితి సృష్టించారని మండిపడ్డారు. మరోవైపు కూకట్ పల్లిలోని 1000 గజాల ప్రైవేట్ ప్లే గ్రౌండ్‌ను కూడా ప్రభుత్వం తనదే అంటోందని అన్నారు. రాత్రికి రాత్రే ఇళ్లను యుఎల్సి కింద 22ఏ లో దేనికోసం పెడుతున్నారు? ఇదంతా కేవలం 30 శాతం కమీషన్ను లాగడానికే. దళారులు వెళ్లి యజమానులను 30 శాతం కమీషన్ అడుగుతున్నారని తెలిపారు. తప్పు చేసి నిషేధిత జాబితాలో పెట్టింది మీరు.. మీ కమీషన్ల కోసం చేసిన తప్పుకు సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలి? ఎందుకు అప్లికేషన్లు పెట్టుకోవాలి? అని ప్రశ్నించారు. ఇలా ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవాలని ఆలోచించడమే కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు అన్నారు. ప్రజల ఇళ్లను 22ఏ జాబితా నుంచి తొలగించకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తామని.. అవసరమైతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎటువంటి పోరాటానికైనా బీఆర్ఎస్ సిద్ధం. ఈ జాబితాలను తొలగించకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాడి మసైపోవడం ఖాయమని స్పష్టం చేశారు.



సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పిజి వింద (ఫైల్)

# రేపు ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌండర్స్ ఛాలెంజ్

## ముఖ్యఅతిథిగా పాల్గొననున్న ప్రముఖ ఛాయాగ్రాహకుడు, రచయిత, దర్శకుడు పి.జి.విందా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు ప్రాంతంలోని వెలుగులోకి రాని నిజజీవిత కథలను గుర్తించి, వాటిని సినిమా, మీడియా, సృజనాత్మక రంగాలతో అనుసంధానించే లక్ష్యంతో ఎన్ఐఎంఎస్ఎంఈ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) సహ కారంతో ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌండర్స్ ఛాలెంజ్ నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 10:00 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి వద్ద జిల్లా సమాఖ్య భవన్ లో నిర్వహించనున్న కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు ప్రాంతానికి చెందిన ప్రముఖ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ, రచయిత దర్శకుడు పి.జి. విందా ప్రత్యేక అతిథిగా పాల్గొన నుండగా, సినికా క్రియేటర్స్ కౌన్సిల్ డైరెక్టర్ పంజా శ్రవణ్ కూడా అతిథిగా పాల్గొననున్నారు. విద్యార్థులు, యువ సృజనకారులు, ఔత్సాహిక దర్శకులు, కంటెంట్ క్రియేటర్లు, పారిశ్రామికవేత్తలు, కథకులతో ఆయన తన సినీ ప్రయాణం, సృజనాత్మక అనుభవాలను పంచుకోవడంతోపాటు నిజజీవిత కథలను సినిమాటిక్ కథలుగా ఎలా మలచవచ్చో వివరించనున్నారు.




# పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీంమునీర్ నేడు ఇరాన్‌లో పర్యటన

**ఇస్లామాబాద్, ఆగస్టు 23:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ సోమవారం ఇరాన్‌లో పర్యటించనున్నారు. ఇరాన్ నాయకత్వంతో ఉన్నతస్థాయి చర్చలు జరిపి ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ పరిస్థితులు, పశ్చిమాసి యాలో శాంతి, భద్రత అంశాలపై చర్చించనున్నారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ పరిస్థితులపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యం లో మునీర్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. మునీర్‌తో పాటు ఒక ప్రతినిధి బృందం కూడా ఇరాన్‌కు వెళ్లనున్నట్లు ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ఆదివారం వెల్లడించారు. ఇరాన్‌పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రాంతీయ శాంతి, భద్రతను ప్రోత్సహించేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలను కొనసాగించడం ఈ పర్యటన ఉద్దేశమని ఆయన తెలిపారు. నిలిచిపోయిన శాంతి ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రయత్నంఅమెరికా, ఇరాన్ మధ్య జూన్ 17న వర్చువల్‌గా కుదిరిన 60 రోజుల తాత్కాలిక శాంతి అవగాహన ఒప్పందం ఈనెల 17తో ముగిసింది. ఈ ఒప్పందానికి పాకిస్థాన్ హామీదారుగా వ్యవహరించింది. అయితే ఒప్పందం ముగిసినప్పటికీ ఇరుదేశాల మధ్య తదుపరి పరిణామాలపై స్పష్టత లేకపోవడంతో గల్ఫ్, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల ప్రారంభంలో పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఇరాన్‌లో పర్యటించి అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీతో చర్చలు జరిపారు. ఆ చర్చలకు కొనసాగింపుగానే మునీర్ పర్యటన జరుగుతున్నట్లు భావిస్తున్నారు.

# 31న వెలిగొండకు కృష్ణా జలాలు

## నిర్వాసితులకు రూ. 768 కోట్లు చెల్లింపు: ఎపి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

**ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** వెలుగొండ ప్రాజెక్టుకు ఈ నెల 31న 10 టీఎంసీల కృష్ణా జలాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఆదివారం ప్రకాశం భవనంలో విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు నెలాఖరులోగా వెలుగొండకు నీటిని అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచిం చారు. 1996 మార్చి 5న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని మంత్రి గుర్తుచేశారు. సరిగ్గా 30 యేళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు పనులను పూర్తి చేసి తన చేతుల మీదుగా నీటిని విడుదల చేయబోతున్నారని తెలిపారు. ఇది ప్రకాశం జిల్లా ప్రజలకు ఎంతో ఆనందకరమైన విషయమన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తితో ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలతో పాటు ప్రాజెక్టు పరిధిలోని పలు ప్రాంతాలకు సాగునీరు, తాగునీటి సౌక ర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి నీటి భరోసా పెరగడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రాజెక్టు దోహదపడుతుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిరక్ష్యానికి గురైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. నీటి విడుదలకు అవసరమైన పనులను ప్రాధాన్యంతో పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. నిర్వాసితులకు మొత్తం రూ.900 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా మూడు విడతల్లో రూ.768 కోట్లను అందించామని మంత్రి వివరించారు. మిగిలిన నిర్వాసితులకు కూడా త్వరలోనే నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.


జూరాల ప్రాజెక్టులో జల కళ

# జూరాలకు 23వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 9.173 టిఎంసిల నీటి నిల్వ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 23, ప్రభాతవార్త :** జూరాల డ్యామ్‌కు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు పూర్తిస్థాయి నీటి నిల్వ 9.6570 టిఎంసిలకు గాను ప్రస్తుతం 9.173 టిఎంసిల నీరు నిల్వ ఉన్నది. జూరాలకు ఎగువ నుంచి 22000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 27261 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదు అయింది. పవర్ హౌస్ కు 23,653 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 876 అడుగులకు చేరిన శ్రీశైలం శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు, నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 876 అడుగులకు చేరగా 168.2670 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 24079 క్యూసెక్కుల ఇంట్లో నమోదు కాగా శ్రీశైలంలోని ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి 7063 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# రేపు రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్

## ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు23:** తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర భాగస్వామ్య వర్గాల ప్రజాస్వామ్య అభిప్రాయాలను తీసుకోకుండా, కొత్తగా ప్రతిపాదించిన శక్తి స్కీమ్ కింద పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటిఐలు), ఏటిసిలు, పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయడం లేదా సంస్థాగతంగా ఏకీకృతం చేసే ప్రతిపాదనలపై ఎబివిపి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్ కు పిలుపునిస్తున్నట్లు ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జిఓ నం.97, ద్వారా కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ పేరును డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇన్సియేటీవ్స్ (ఎస్‌హెచ్ఏకెటిఐ-శక్తి)గా మార్చిందనీ, ఈ ఉత్తర్వుల ప్రకారం అన్ని ఐటిఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటిసిలు) అన్ని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ(వైఐఎస్‌యు) సంస్థాగత పరిధిలోకి తీసుకురావాలని, అలాగే అన్ని పాలిటెక్నిక్ కళాశాలలను కూడా వైఐఎస్‌యు పరిధిలోకి తీసుకురావాలని పేర్కొందనీ, ఇందుకు సంబంధించిన చట్టాలు, నిబంధనల్లో అవసరమైన సవరణలు చేయాలని కూడా ప్రతిపాదించిందన్నారు. కానీ ఇలాంటి పునర్వ్యవస్థీకరణను తగిన సంప్రదింపులు, స్పష్టత లేకుండా అమలు చేస్తే, వివిధ సాంకేతిక, వృత్తి విద్యా విభాగాలకు చెందిన విద్యార్థుల విద్యా గుర్తింపు, సంస్థాగత స్వయం ప్రతిపత్తి, మౌలిక వసతులు, పాఠ్య ప్రణాళిక, ప్రవేశాల విధానం, పరీక్షల వ్యవస్థ భవిష్యత్ అవకాశాలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ కింద నడిచే ఐటిఐ, ఏటీసీలను ఎఐసిటిఇ ధ్వర్యంలో నడిచే పాలిటెక్నిక్‌లను ఏ విధంగా ఏకీకృతం చేస్తారని ప్రశ్నించారు. ప్రైవేట్, ప్రభుత్వ అనుబంధంలో నడిచే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యు)పరిధిలోకి గత 70 సంవత్సరాలుగా విజయవంతంగా నడిచే వ్యవస్థలను ఏ విధంగా తీసుకొస్తారని ప్రశ్నించారు. విద్యార్థులు ఇసిఇటి ఎత్తేస్తారని, లేటరల్ ఎంట్రీ ఉండదని, ఉన్నత విద్యకు అనర్హులవోతామని మొత్తుకుంటుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇంజనీర్స్ కావలసిన మమ్మల్ని లేబర్‌గా మార్చే కుట్ర జరుగుతున్నదని, ఫీజు రీయింబర్స్మెంట్ పథకం నుండి పాలిటెక్నిక్ విద్యార్థులను తప్పించడానికే శిశి విధానంలో నడిచే స్కిల్స్ యూనివర్సిటీకి మమ్మల్ని అనుసంధానం చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారని పేర్కొన్నారు. సర్టిఫికెట్స్ కోర్సులు అందించే యూనివర్సిటీ పరిధిలోకి ఒక విజయవంతం అయిన పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను అనుసంధానించడం హేయమైన చర్య అని అన్నారు.

# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయండి

## లండన్‌లో తెలుగు ప్రవాసులకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 23:** ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయాలని లండన్‌లో తెలుగు ప్రవాసులకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఉదయం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిపై ప్రవాసులతో వారు చర్చించారు. తెలుగు సమాజం ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసులు కూడా భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా బలంగా ప్రచారం చేస్తూ, రాష్ట్రానికి మంచి రాయబారులుగా నిలవాలని కోరారు.

# బ్రిక్స్ దేశాల మధ్య మరింత క్రీడా సహకారం

**విశాఖపట్నం, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం విశాఖపట్నంలో ఆదివారం విజయవంతంగా ముగిసింది. క్రీడా రంగంలో సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయిస్తూ బ్రిక్స్ క్రీడా ఉమ్మడి ప్రకటనను ఏకాభిప్రాయంతో ఆమోదిం చారు. క్రీడల ద్వారా యువత అభివృద్ధి, మహిళల భాగస్వా మ్యం, సమగ్రత, సాంస్కృతిక మార్పిడి, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందిం చేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవియా మాట్లాడుతూ.. బ్రిక్స్ క్రీడా భాగస్వామ్యం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్రీడాకారులు, కోచ్‌ల పరస్పర మార్పిడి, సంయుక్త క్రీడా పోటీలు, క్రీడా శాస్త్ర పరిజ్ఞాన భాగస్వామ్యానికి వాస్తవిక వేదికగా మారాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ క్రీడా వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేస్తోందని, మైదానం నుంచి పతకం సాధించే స్థాయి వరకు క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామని మాండవియా తెలిపారు. క్రీడా వస్తువుల తయారీ రంగంలో పెట్టుబడులు, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వెల్లడిం చారు. మూడు కీలక ప్రతిపాదనలకు ముందడుగు.. భారత్ బ్రిక్స్ అధ్యక్షతలో క్రీడా రంగంలో మూడు ప్రధాన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. క్రీడాశాస్త్రం, క్రీడాకారుల పనితీరు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత, ఆవిష్కర ణలపై సహకారం కోసం బ్రిక్స్ క్రీడా సాంకేతికత వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయను న్నారు. క్రీడా వస్తువుల తయారీ రంగంలో సాంకేతికత, నాణ్యత ప్రమాణాలు, వాణిజ్యం, సరఫరా వ్యవస్థలపై సహకారం కోసం బ్రిక్స్ క్రీడా తయారీ సదస్సును నవంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వ హించనున్నారు. సాంప్రదాయ, స్వదేశీ క్రీడల పరిరక్షణ, సాంస్కృతిక మార్పిడికి బ్రిక్స్ సంప్రదాయ, స్వదేశీ క్రీడల ప్రదర్శన క్రీడలను అక్టోబర్ 12, 13 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు.


ఆదివారం విశాఖపట్నంలో జరిగిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం

# ఒడిశా తీరంలో సరకు నౌక మునక

**భువనేశ్వర్, ఆగస్టు 23:** ఒడిశా తీరానికి సమీపంలోని బంగాళాఖాతంలో ఒక భారీ సరకు రవాణా నౌక మునిగిపోయింది. పనామా పతాకంతో ప్రయాణిస్తున్న ఈ నౌక, ఒడిశా నుంచి సింగపూర్‌కు ఇనుప ఖనిజం లోడ్‌తో వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాద సమయంలో నౌకలో 24 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. పరదీప్ తీరానికి సుమారు 240 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. నౌకలోని సిబ్బందిలో ఎక్కువ మంది చైనా జాతీయులను ప్రాథమిక సమాచారం అందుతోంది. సహాయక చర్యల కోసం సమీపంలోని ఇతర నౌకలను కూడా అధికారులు అప్రమత్తం చేశారు. అయితే, ఇప్పటివరకు ఎంతమంది సిబ్బందిని సురక్షితంగా కాపాడారనే విషయంపై స్పష్టత రాలేదని ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఈనౌక పనామా దేశానికి చెందిన భారీ కార్గో నౌక ఎంవీ ఓషన్ విన్నర్ అని తేలింది. ఈ నౌకలోని 24 మంది సిబ్బందిలో ఇద్దరు ప్రాణాలతో బయటపడగా, మరో 22 మంది గల్లంతయ్యారు. వీరి కోసం ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. విశాఖపట్నానికి 700 కి.మీ, ఒడిశాలోని పరదీప్ తీరానికి సుమారు 230 నాటికల్ మైళ్ల దూరంలో ఈ నౌక మునిగిపోయిందని అధికారులు చెబుతున్నా రు.



భారీగా ఇనుప ఖనిజంతో ఆగస్టు 20న పారాదీప్ పోర్టు నుంచి బయలుదేరిన ఈ నౌక రెండు రోజుల తర్వాత ట్రాకింగ్ సిస్టమ్ నుంచి అదృశ్యమైంది. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 20 మంది చైనా జాతీయులు కాగా, ముగ్గురు మయన్మార్ వాసులు, ఒక బంగ్లాదేశీయుడు ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమైన శ్రీవిజయపురంలోని మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ రక్షణ చర్యలు చేపట్టింది. ఇండియన్ నేవీకి చెందిన నిఘా విమానం రంగంలోకి దిగి, సముద్రంలో చెల్లాచెదురుగా ఉన్న లైఫ్ రాఫ్ట్)లను గుర్తించింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఎంటీ ఈసోపస్ అనే వాణిజ్య నౌకను అధికారులు అటు వైపు మళ్లించారు. లైఫ్ రాఫ్ట్‌ల సాయంతో ప్రాణాలు దక్కించుకున్న ఇద్దరు నావికులను ఈ వాణిజ్య నౌక రక్షించింది. ప్రస్తుతం వారికి వైద్య సాయం అందిస్తున్నారు. మిగతా 22 మంది ఆచూకీ కోసం ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన వరాద్, అన్మోల్, విజిత్ నౌకలు గాలింపు ఆపరేషన్‌ను ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. నౌకలో సాంకేతిక లోపం తలెత్తిందా లేక మరేదైనా అత్యవసర పరిస్థితి ఎదురైందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.


ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు రహదారులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# క్షేత్రాలకు కొత్త రోడ్లు

## 100 పైగా ప్రధాన ఆలయాలకు గ్రామీణ రోడ్ల అనుసంధానం

## రూ. 120 కోట్లతో 205 కి.మీ. రహదారులు

## సత్యసాయి శత జయంతికి రూ.30 కోట్లతో రోడ్లు: ఎపి డి.సిఎం పవన్

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని ఆధ్యాత్మిక కేంద్రాల ప్రగతికి రహదారులును నిర్మిస్తున్నట్లు డి,సిఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు డిసిఎంవో నుంచి కీలక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు దేవాలయాలకు సరైనరహదారి సౌకర్యంలేని పరిస్థితులు ఉన్నాయి. వాడపల్లి లాంటి పుణ్యక్షేత్రాలకు రోజు రోజుకీ భక్తుల సంఖ్య అయితే పెరుగుతుంది గానీ, వారికి సరిపడ రోడ్డు సౌకర్యం మెరుగుపడడం లేదన్న అంశం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. క్షేత్ర స్థాయి పర్యటనల్లో అలాంటి ఎన్నో ఆలయాలు ఆయన కంటపడ్డాయి. కొన్ని ఆల యాల దుస్థితిని ప్రజలు వినతపత్రాల రూపంలో పవన్ కల్యాణ్ అందజేశారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దేవుని దర్శనానికి వెళ్లే దారి లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా దాదాపు 100కు పైగా ప్రధాన క్షేత్రాలను 205 కిలోమీటర్ల పొడుగున రోడ్లతో అనుసంధానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వీబీ జీ రాం జీ, సాస్కి తదితర నిధులతో బడి, గుడి, ఆసుపత్రి, పంట పొలాలకు వెళ్లే మార్గాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ముందుకు తీసుకువెళ్తున్నారు.

సత్యసాయి బాబా వారి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆ జిల్లాలో పుట్టపర్తి అనుసంధాన రోడ్ల నిర్మాణానికి రూ. 30 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన గుడి బాట పనులు అత్యంత వేగంగా పూర్తి చేసే విధంగా పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తు న్నారు. ఇప్పటి వరకు రూ. 120 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారుల్లో 26 నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మరో 40 శాతం రహదారులకి సంబంధించిన పనులు 50 శాతం మేర పూర్తయ్యాయి. అందులో ప్రఖ్యాత శ్రీ లక్ష్మీ నరసింహా క్షేత్రం అంతర్వేది, అహోబిలం, మదనపల్లి నియోజకవర్గంలోని శ్రీ గట్టు వెంకటరమణ స్వామి ఆలయం, మారుమూలన ఉన్న ఆలయాలు దేవరాయ నల్లగంగమ్మ ఆలయం, మర్రిపూడి వద్ద ఉన్న పుడియగిరి లక్ష్మీ నరసింహా స్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు, సత్యవేడు నియో జకవర్గం పరిధిలోని సింగిరికోన, సోమేశ్వరం తలుపులమ్మలోవ మార్గం, ఐ.ఎస్ జగన్నాథపురం ఘాట్ రోడ్ల నిర్మాణం పూర్తయ్యాయి. పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ రోడ్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# స్వదేశీ పరిజ్ఞానంతోనే ఎకె-203 ఆవిష్కరణ

## భారత సైన్యానికి ఎంతో మేలంటున్న రక్షణరంగ నిపుణులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** భారత్ పూర్తిగా స్వదేశీ ముడి పదార్థాలతోనే విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా తయారైన ఎకె203 రైఫిల్‌ను ఆవిష్కరించింది. దీనికి షేర్ అని పేరు పెట్టారు. ఈ రైఫిల్ ఆటోమేటిక్, బరస్ట్ ఫైరింగ్ టెస్టుల్ని విజయ వంతంగా పూర్తిచేసుకుంది. 2019లో భారత్, రష్యా మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఎకె 203 రైఫిళ్లను భారత్‌లోనే తయారు చేసేందుకు ఇండోరష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటైంది. భారత్‌లో తయారైన రైఫిళ్లలో మొదటగా దిగుమతి చేసుకున్న కిట్‌లను ఉపయోగించగా, ఇప్పుడు దేశీయ భాగాల వాటాను పెంచారు. తాజాగా తయారైన షేర్‌లో ప్రతీ విడిభాగం, ముడి పదార్థం భారత్‌లోనే తయారైంది. కేవలం రైఫిల్‌ను భారత్‌లో అసెంబుల్ చేయడమే కాకుండా, దాని తయారీకి అవసరమైన ప్రతీ వస్తువును భారత్‌లోనే దేశీయంగా అభివృద్ధి చేశారు. ఎకె203లో సుమారు 50 ప్రధాన భాగాలు, 180 ఉప భాగాలు, దాదాపు 120 తయారీ ప్రక్రియలు ఉన్నాయి. వీటన్నింటినీ భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసేందుకు ఐఆర్‌ఆర్‌పి అనేక దేశీయ సరఫరాదారులను అభివృద్ధి చేసింది. ఎకె203 7.62 39 మిమీ కార్ట్రిడ్జ్‌ను ఉపయోగించే గ్యాస్‌ఆపరేటెడ్, మ్యాగజైన్‌ఫెడ్ అసాల్ట్ రైఫిల్. ఫోల్డింగ్, అడ్జస్టబుల్ స్టాక్, ఎర్గోనామిక్ గ్రిప్, ఆధునిక ఆప్టికల్ పరికరాలను అమర్చేందుకు రైల్ సిస్టమ్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం భారత సైన్యం ఉపయోగిస్తున్న ఇన్సాస్ రైఫిల్‌కు దీనిని ప్రత్యామ్నాయంగా తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నారు.



# ఇరాన్‌పై మరిన్ని ఆర్థిక ఆంక్షలు



● టెహ్రాన్‌పై ఒత్తిడి పెంచనున్న అమెరికా

● ఇరాన్ అణుకార్యక్రమం మానవ హక్కుల ఉల్లంఘనపై సీరియస్‌గా పరిగణించిన యుఎస్

**వాషింగ్టన్, ఆగస్టు 23:** ఇరాన్‌పై అమెరికా ఒత్తిడిని మరింత పెంచేందుకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలో ప్రారంభమైన యుద్ధం నేపథ్యంలో ఇరాన్‌కు నిధులు అందే అన్ని మార్గాలను మూసివేయడమే లక్ష్యంగా వాషింగ్టన్ కఠిన చర్యలకు సిద్ధమవుతున్నది. ఇరాన్‌పై ఇప్పటివరకు ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో ఆర్థిక ఆంక్షలు విధించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ప్రకటించారు. వచ్చే వారం టెహ్రాన్‌పై కొత్త ఆంక్షలు ప్రకటించే అవకాశం ఉందని బెస్సెంట్ వెల్లడించారు. దీనిపై సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆయన కీలక మీడియా సమావేశం నిర్వహించనున్నారు. దీంతో అమెరికా తీసుకోబోయే తదుపరి చర్యలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఇరాన్ అణు కార్యక్రమం, మానవ హక్కుల ఉల్లంఘనలు, ఉగ్రవాద సంస్థలకు మద్దతు వంటి కారణాలతో అమెరికా, ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ దశాబ్దాలుగా టెహ్రాన్‌పై ఆంక్షలు విధిస్తున్నాయి. అయితే యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆంక్షల తీవ్రత మరింత పెరిగింది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ పరిధిలోని వోఎఫ్ఎసిసమాచారం ప్రకారం ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఇప్పటివరకు 1,000 మందికి పైగా వ్యక్తులు, నౌకలు, విమానాలపై ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో సంబంధం ఉన్న సుమారు 500 మిలియన్ డాలర్ల విలువైన క్రిప్టో ఆస్తులను కూడా స్తంభింపజేశారు. ఇరాన్ చమురుకు చైనా అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. 2025 గణాంకాల ప్రకారం ఇరాన్ ఎగుమతి చేసే చమురులో 80 శాతానికి పైగా చైనానే కొనుగోలు చేస్తోంది. చైనాలోని చిన్న, స్వతంత్ర రిఫైనరీలను 'టీపాట్స్'గా పిలుస్తారు. ఇరాన్ చమురు కొనుగోళ్లలో వీటి పాత్ర కీలకం. అమెరికా ఆర్థిక వ్యవస్థతో వీటికి పెద్దగా సంబంధాలు లేకపోవడంతో ఇప్పటివరకు ఆంక్షల ప్రభావం పరిమితంగానే ఉంది. అయితే ఇరాన్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న చమురు మార్కెట్‌ను దెబ్బతీయాలంటే ఈ రిఫైనరీలను కూడా లక్ష్యంగా చేసుకోవాలని అమెరికా భావిస్తున్నట్లు సమాచారం. ఇరాన్ చమురు ఆదాయాలు, ఆయుధాల కొనుగోళ్లకు సహకరిస్తున్న చిన్న సంస్థలపై ఇప్పటికే అమెరికా ఆంక్షలు విధించింది. తాజాగా చైనా, హాంకాంగ్‌కు చెందిన పెద్ద ఆర్థిక సంస్థలపై కూడా ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ నిధుల లావాదేవీలకు తమ వ్యవస్థలను ఉపయోగిస్తే పెద్ద చైనా బ్యాంకులను సైతం బ్లాక్‌లిస్ట్‌లో చేర్చే అవకాశం ఉందని అమెరికా హెచ్చరించినట్లు సమాచారం. అయితే దీనివల్ల చైనా ప్రతీకార చర్యలకు దిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కూడా వాషింగ్టన్‌లో ఉంది. ముఖ్యంగా ఆధునిక సాంకేతిక రంగాలకు అవసరమైన కీలక ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అమెరికా ఆంక్షలను తప్పించుకునేందుకు ఇరాన్ కొత్త కంపెనీలు, మధ్యవర్తుల ద్వారా చమురు ఆదాయాలను తరలిస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తోంది. దీంతో గల్ఫ్ దేశాల్లో ఇరాన్‌కు సహకరిస్తున్న వ్యక్తులు, సంస్థలపై కూడా చర్యలు తీసుకునేందుకు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ సిద్ధమవుతోంది. ఒక కంపెనీపై ఆంక్షలు విధించిన వెంటనే ఇరాన్ మరో కొత్త సంస్థను ఏర్పాటు చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. చమురు రవాణాదారులు, కొనుగోలుదారులు, కరెన్సీ మార్పిడి సంస్థలపై మరింత కఠినంగా నిఘా పెట్టే అవకాశం ఉంది. హార్ముజ్ జలసంధిలో పరిస్థితులు మరింత దిగజారితే విమానయాన రంగంపైనా కొత్త ఆంక్షలు విధించే అవకాశాన్ని అమెరికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. సముద్ర, వాయు మార్గాలతో పాటు ఇరాన్ భూ వాణిజ్య మార్గాలను కూడా అడ్డుకునే అంశంపై చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇరాన్ పొరుగు దేశాల సహకారం అవసరం. భూ దిగ్బంధనం అమలు చేయడం అత్యంత క్లిష్టమైన వ్యవహారమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఈ చర్య అమల్లోకి వస్తే ఇరాన్‌కు ఆహారం, ఇంధనం, దుస్తులు వంటి కీలక దిగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అదే సమయంలో పొరుగు దేశాలతో దౌత్యపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉంది. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలపై భారీ దిగుమతి సుంకాలు విధిస్తామని ట్రంప్ గతంలో పలుమార్లు హెచ్చరించారు. ఈ తరహా టారిఫ్‌లకు సంబంధించిన కొన్ని చట్టపరమైన అంశాలు సవాళ్లుగా మారాయి. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును అమెరికా సెనేట్ ఆమోదించింది. ఇందులో ఇరాన్‌కు సంబంధించిన నిబంధనలు కూడా ఉన్నాయి. ఇరాన్‌కు ఆయుధాలు, వాణిజ్యం లేదా ఆర్థిక సహాయం అందించే దేశాలపై టారిఫ్‌లు విధించే అధికారాన్ని ట్రంప్‌కు ఈ బిల్లు కల్పించే అవకాశం ఉంది. అయితే ఈ బిల్లుకు ప్రతినిధుల సభ ఆమోదం ఇంకా అవసరం. మొత్తంగా చూస్తే ఇరాన్‌కు చమురు ద్వారా వచ్చే ఆదాయాన్ని అడ్డుకోవడం, ఆర్థిక లావాదేవీలను కట్టడి చేయడం, చైనా మార్కెట్‌ను దెబ్బతీయడం, ఆంక్షలు తప్పించుకునే నెట్‌వర్క్‌లను ఛేదించడం వంటి చర్యలతో టెహ్రాన్‌పై ఒత్తిడిని మరింత పెంచేందుకు అమెరికా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## అమాంతం పెరిగిన పూల ధరలు

● చిట్టి గులాబీలు రూ.400 ● రూ.350కి చేరిన చేమంతులు

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** శ్రావణ మాసం రావడంతో పూలతో పాటు, పూజకు ఉపయోగించే పలు వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. బంతిపూలు, చిట్టి గులాబీలు, చేమంతులతో పాటు, కొబ్బరికాయలు, అరటిపళ్లు, తమలపాకు ధరలు రెట్టింపునకు పైగా పెరిగాయి. ఒకేసారి రెండింతలు పెరగడంతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. చిట్టి గులాబీలు, చామంతులు, బంతి పూల ధరలు భారీగా పెరిగాయి. చిట్టి గులాబీలు గతంలో కిలో రూ.200లోపే ఉండగా ఇప్పుడు అవి రెట్టింపు పెరిగి రూ.400 పలుకుతున్నాయి. ఇక చామంతులు గతంలో రూ.150గా ఉండగా, మరో రూ.150 పెరిగి ఇప్పుడు రూ.350కి విక్రయిస్తున్నారు. బంతి పూల విషయానికొస్తే గతంలో రూ.30గా ఉండగా, ఇప్పుడు రూ.100కి చేరింది. ఇక కొబ్బరికాయ ధర మొన్నటివరకు సైజుని బట్టి రూ.15 నుంచి రూ.35 మధ్య లభించగా, ఇప్పుడు రూ.60 వరకూ పలుకుతోంది. మీడియం సైజు కొబ్బరికాయను రూ.50కు మార్కెట్లో విక్రయిస్తున్నారు. అలాగే గతంలో డజన్ అరటిపళ్ల రూ.40 నుంచి రూ.60 మధ్య దొరకగా ఇప్పుడు రూ.80 వరకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల రూ.100కి కూడా వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఇక తమలపాకు ధరలు కూడా భారీగా పెరిగాయి. 30 ఆకుల తమలపాకుల రూ.50 పలుకుతున్నాయి. రైతుల వద్ద 150 ఆకుల కట్టను రూ.16కే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, ప్రజల వద్ద నుంచి ఒక్కో తమలపాకుకు రూ.1 వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 ఆకులకు రూ.50 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఇలా పూజల కోసం ఉపయోగించే సామాగ్రి ధరలు భారీగా పెరిగాయి. పెరిగిన ధరలతో సామాన్యులకు భారం మారాయి. ఒకేసారి రేట్లు డబుల్ అవ్వడంతో తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులతో పూల సాగు కూడా తగ్గిపోయింది. కాల్వలు, బోర్ల కింద కొంతమంది పండిస్తున్నారు. దీంతో ఉత్పత్తి తగ్గి డిమాండ్ ఎక్కువ కావడంతో వీటి ధరలు పెరుగుతున్నాయి. శ్రావణ మాసం పూర్తయ్యేంత వరకు ధరలు తగ్గే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇక నుండి పండుగల సీజను కావడంతో వీటి ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.




నెక్లెస్ రోడ్డుల్లో పవర్ ఎక్స్‌పో దృశ్యం

## ఉత్పత్తి నుంచి కనెక్షన్ దాకా

● విద్యుత్ ప్రయాణం తెలిపే పవర్ ఎక్స్‌పో

● హైదరాబాద్‌లో భారీగా ఏర్పాటు

● సందర్శకుల కోసం క్విజ్‌లు లేజర్ షోలు

**హైదరాబాద్, అగస్టు 23, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పవర్ ఎక్స్‌పో సందర్శకులను ఆకట్టు కుంటోంది. విద్యుత్ రంగంలో సాంకేతిక అభివృద్ధి, వినియోగదారుల సేవలు, భద్రతా ప్రమాణాలు, ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన పవర్ ఎక్స్‌పో ఆదివారం రెండో రోజున వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి నుంచి వినియోగదారుడి ఇంటి వరకు విద్యుత్ చేరే విధానం, విద్యుత్ పంపిణీ వ్యవస్థ పనితీరు, మెరుగైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా కోసం తీసుకున్న చర్యలు తదితర అంశాలను ప్రత్యక్ష నమూనాలు, ప్రదర్శనలు వివరణల ద్వారా తెలుసుకునే అవకాశం సందర్శకులకు కల్పించినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వాటిలో పేర్కొన్న వివరాలు ప్రకారం ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లలో వివిధ విద్యుత్ పథకాలు, ఐటీ ఆధారిత సేవలు, సాంకేతిక అభివృద్ధి, భద్రతా చర్యలు గూర్చి తెలుసుకుంటున్నారు. ప్రత్యేకంగా సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్స్, స్విచ్‌గేర్ పరికరాలు, వివిధ రకాల మీటర్లు, మీటరింగ్ బిల్లింగ్ విధానం, కంట్రోల్ రూమ్ కార్యకలాపాలు ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కల్పించారు. సౌర విద్యుత్, నెట్ మీటరింగ్, నిజు ఛార్జింగ్ స్టేషన్లు, పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలను కూడా ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ భద్రత, విద్యుత్ పొదుపు, సాంకేతిక పరిజ్ఞానం మరియు విద్యుత్ పంపిణీ వ్యవస్థపై అవగాహన పెంచేందుకు ప్రతి గంటకు స్పాంటేనియస్ క్విజ్‌లు నిర్వహిస్తున్నారు. విజేతలకు బహుమతులతో పాటు సంస్థ లోగోతో కూడిన స్మారక వస్తువులను అందిస్తున్నట్లు వెల్లడించింది. 33 కేవీ వరకు విద్యుత్ లైన్ల నిర్మాణంలో ఉపయోగించే కండక్టర్లు, కేబుల్స్, స్విచ్‌గేర్, మీటర్లు తదితర పరికరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం కలిగించే గృహ జ్యోతి, వ్యవసాయ విద్యుత్ సేవలు, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగానికి సంబంధించిన పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా, సోలార్ పంపుల విద్యుదీకరణ, ఛార్జింగ్ స్టేషన్లు, సోలార్ మోడల్ విలేజ్ వంటి కార్యక్రమాలను ఎక్స్‌పోలో ప్రత్యేకంగా

## జోరుగా సాగుతున్న ఇంటింటికి తెలుగుదేశం

### రెండేళ్ల కూటమి ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు నివేదన

**విజయవాడ,ఆగస్టు23,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఆదివారం నాటికి ఈ కార్యక్రమం 28వ రోజుకు చేరుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. ఆదివారం ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 2,51,872 ఇళ్లను సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 79,39,000 కుటుంబాలను టీడీపీ శ్రేణులు కలిసినట్లయింది. ఇప్పటికే 75 లక్షల ఇళ్ల మైలురాయిని దాటిన ఈ కార్యక్రమం, త్వరలోనే 80 లక్షల కుటుంబాల మార్కును కూడా అధిగమించే దిశగా వేగంగా విస్తరిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు ప్రతి గడపకు వెళ్లి, ఆయా కుటుంబాలతో ప్రత్యక్షంగా మాట్లాడుతున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్య తరగతి వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలను వారికి వివరిస్తున్నారు. అదే సమయంలో, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను నమోదు చేసుకుంటున్నారు. ప్రజల నుంచి వస్తున్న వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఇంటింటికీ తెలుగుదేశం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా పెద్దఎత్తున భాగస్వామ్యమవుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు. ఈ మేరకు టీడీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

## కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తోంది

### హాజరైన మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య, ఎర్రోళ్ల శ్రీనివాస్,



**చిక్కడపల్లి ఆగస్టు 23 ( ప్రభాతవార్త ) :** కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య మండిపడ్డారు. దళితులకు రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికీ ఆ పథకాన్ని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే అదనంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని రాజయ్య ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అశాస్త్రీయంగా జరిగిందని ఆయన అన్నారు. మైస ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో రూ.10 లక్షలు అందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పథకం పేరును అంబేద్కర్ అభయహస్తంగా మార్చడం తప్ప నిధులు ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు ఈ హామీపై స్పష్టమైన సమాధానం చెప్పాలని, దళితులకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకోవాలని పట్టుబట్టారు. రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి తక్షణమే రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలి. తెలంగాణలో ఎస్సీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 20 శాతానికి పెంచాలి. అర్హులైన నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.4,000 నిరుద్యోగ భృతి ఇవ్వాలి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు ఉచిత స్థలంతో పాటు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు భాగాలుగా విభజించి, తక్షణమే చైర్మన్లను నియమించాలి. మాదిగ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేసారు. వీరితో పాటు తొలి ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకే ప్రభాకర్, మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని, ఎరుకల హక్కుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కందెల వెంకటేష్, సీనియర్ దళిత నాయకులు చింత స్వామి, డిబిఎస్ శంకర్, తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్, రావికంటి రామ్‌దాస్, సింగిరెడ్డి పరమేష్, చీమ శ్రీనివాస్, భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షులు వనం మహేందర్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## మంత్రి సురేఖ కుటుంబ వ్యవహారాన్ని రాజకీయ అంశంగా మార్చరాదు



గన్‌పార్కు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**సైఫాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రభుత్వం అసలు సమస్యలను పట్టించుకోకుండా, పక్కన పెట్టి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుటుంబ వ్యవహారాన్నే ప్రధాన రాజకీయ అంశంగా మార్చుతున్నారని ఆల్ ఇండియా ఓబిసి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.శివముదిరాజ్ ఆరోపించారు. ఆమెను బిసి, బడుగు-బలహీనవర్గాల నుంచి ఎదిగిన సీనియర్ రాజకీయ నాయకురాలని, ఆమె కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు సురేఖను బాధ్యురాలుగా చేయడం తగదన్నారు. కొండా సురేఖపై నాయకులు చేస్తున్న వ్యాఖ్యలకు నిరసనగా వివిధ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన అసోసియేషన్ నాయకులు ఆదివారం గన్‌పార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్మిత కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు కాదని, ఆమె వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలకు సురేఖ బాధ్యత వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సురేఖ ఇప్పటికే రెండుసార్లు వివరణ ఇచ్చినప్పటికి చర్యల ప్రక్రియ కొనసాగించడం అన్యాయమన్నారు. గతంలో కొంత మంది నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ నాయకత్వంపై విమర్శలు చేస్తే వారిపై ఏలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కొండా సురేఖపై పార్టీ చర్యలు తీసుకుంటే ఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## అమెరికాతో వాణిజ్యయుద్ధంలో ఉన్నాం

### కెనడా ప్రధాని కార్నీ



**టొరంటో, ఆగస్టు 23:** అగ్రరాజ్యం అమెరికాతో తాము యుద్ధంలో ఉన్నామని కెనడా ప్రధాని మార్క్ కార్నీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 50 శాతం మేర సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అమెరికా తీసుకున్న ఈ చర్యను తమ దేశంపై జరిగిన ఆర్థిక దాడిగా ఆయన అభివర్ణించారు. ఇటీవల ఇరు దేశాల మధ్య జరిగిన వాణిజ్య చర్చలు చివరి నిమిషంలో విఫలమయ్యాయి. అమెరికా విధించిన షరతులు తమ దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా, కీలక పరిశ్రమలను బలహీనపరిచేలా ఉన్నాయని, అందుకే తాము వాటిని అంగీకరించలేదని మార్క్ కార్నీ స్పష్టం చేశారు. మీపై దాడి జరిగినప్పుడు, మీరు యుద్ధంలో ఉన్నట్లే భావించాలి. మాపై దాడి జరిగింది. అందుకే మేం కూడా యుద్ధంలోనే ఉన్నాం అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ట్రంప్ నిర్ణయానికి ప్రతీకారంగా అమెరికా నుంచి దిగుమతి అయ్యే స్టీల్, గృహోపకరణాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ వంటి ఉత్పత్తులపై తాము కూడా సుంకాలు విధించనున్నట్లు ఆయన ప్రకటించారు. సుమారు 20 బిలియన్ డాలర్ల విలువైన కెనడా వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. ఇది కెనడా వార్షిక ఎగుమతుల్లో దాదాపు 5 శాతానికి సమానం కావడం గమనార్హం. అమెరికా తన సుంకాలను తగ్గిస్తే తాము కూడా సానుకూలంగా స్పందిస్తామని మార్క్ కార్నీ తెలిపారు. అమెరికా నుంచే వచ్చే అల్యూమినియం, స్టీల్, మోటార్ వాహనాలపై ఉన్న సుంకాలను తొలగించడానికి సిద్ధంగా ఉన్నామని, అమెరికన్ ఆల్కహాల్ విక్రయాలను తిరిగి ప్రారంభించేలా తమ ప్రావిన్సులను ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ అసాధ్యమైన షరతులు విధించడం వల్లే తాము ఒప్పందం నుంచి వైదొలగినట్లు మార్క్ కార్నీ వివరించారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు.. ముగ్గురు పట్టివేత

### జేసీబీ, ద్విచక్రవాహనం స్వాధీనం



గుప్త నిధుల కోసం పూజలు నిర్వహించిన దృశ్యం.

**వెల్దండ, ఆగస్టు 23 ప్రభాతవార్త:** గుప్త నిధులు ఉన్నాయనే అనుమానంతో రాత్రివేళ పూజలు నిర్వహించి జేసీబీతో తవ్వకాలు చేపడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన వెల్దండ మండల పరిధిలోని రాచూరు తండా సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఎస్ఐ యోగేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... ఈ నెల 22 శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో రాచూరు తండాకు చెందిన ఓ వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి, తండా సమీపంలో కొంతమంది గుప్త నిధుల కోసం పూజలు నిర్వహిస్తూ జేసీబీతో గుంతలు తవ్వుతున్నట్లు సమాచారం అందించారు. దీంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నామని, అక్కడికి చేరుకునే సమయానికి రాచూరు తండాకు చెందిన సుమారు 20 నుంచి 30 మంది గ్రామస్థులు అక్కడ ఉన్నారు. ముగ్గురు వ్యక్తులు మాత్రం అక్కడే పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని రాచూరు గ్రామానికి చెందిన గుత్తి సత్యనారాయణ (40), తలకొండపల్లి మండలం హర్య నాయక్ తండాకు చెందిన కేతావత్ శంకర్ (34), వెల్దండకు చెందిన జేసీబీ ఆపరేటర్ క్యాసారపు శ్రీశైలం (25) గుర్తించామని, వారి నుంచి టీజీ06బీ1171 నంబర్ గల జేసీబీ, టీఎస్07జీబీ8362 నంబర్ గల హోండా షైన్ మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని పట్టుబడిన ముగ్గురితో పాటు పరారైన మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఇమ్రాన్‌కు మెరుగైన వైద్యసంరక్షణ అందించాలి

### ప్రపంచవ్యాప్తంగా 21 మంది మాజీ క్రికెట్ కెప్టెన్లు పాక్‌ప్రధానికి లేఖ



**ఇస్లామాబాద్, ఆగస్టు 23:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, ప్రపంచ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయనకు మానవతా దృక్పథంతో మెరుగైన వైద్య సంరక్షణ అందించాలని కోరుతూ ప్రపంచవ్యాప్తంగా 21 మంది మాజీ క్రికెట్ కెప్టెన్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లేఖ రాశారు. వీరిలో భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది రాజకీయ జోక్యం కాదని, కేవలం క్రీడా స్ఫూర్తితోనే ఈ విజ్ఞప్తి చేస్తున్నామని వారు స్పష్టం చేశారు. గత మూడేళ్లకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్‌కు ఆయన వ్యక్తిగత వైద్యులతో కూడిన బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించాలని పాక్ సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలు పూర్తిగా అమలు కాలేదని ఈ లేఖలో మాజీ కెప్టెన్లు ఆరోపించారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా, కేవలం కొన్ని గంటల పాటే ఆసుపత్రిలో ఉంచి ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు జరిపి, ఆరోగ్యంగానే ఉన్నారు అని చెప్పి తిరిగి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇమ్రాన్ కుడి కంటి చూపు మందగించిందని వస్తున్న వార్తలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ లేఖలో మాజీ కెప్టెన్లు మూడు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు. సుప్రీంకోర్టు ఆదేశించినట్టుగా, ఇమ్రాన్ వ్యక్తిగత వైద్యులతో కూడిన స్వతంత్ర బోర్డుతో పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలు జరిపించాలి. వారానికోసారి కుటుంబ సభ్యులతో సమావేశానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతించాలి. వైద్య పరీక్షల అనంతరం బోర్డు సూచించిన చికిత్సను తక్షణమే అందించాలి. ఆరు నెలల క్రితం 14 మంది కెప్టెన్లు ఇలాంటి లేఖ రాయగా, ఇప్పుడు 21 మంది కెప్టెన్లు తమ గళం వినిపించారు. ఆస్ట్రేలియాకు చెందిన అలెన్ బోర్డర్, గ్రెగ్ చాపెల్, స్టీవ్ వా, ఇంగ్లండ్‌కు చెందిన మైఖేల్ అథర్టన్, వెస్టిండీస్ దిగ్గజం సర్ క్లైవ్ లాయిడ్, శ్రీలంక మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ వంటి ప్రముఖులు ఈ లేఖపై సంతకాలు చేశారు. ఈ సమస్య త్వరగా పరిష్కారమవుతుందని, ఇమ్రాన్ ఖాన్‌కు తగిన గౌరవం దక్కుతుందని ఆశిస్తున్నాం. యువర్స్ ఇన్ క్రికెట్ అంటూ లేఖను ముగించారు. సంతకాలు చేసిన మాజీ కెప్టెన్లలో మైకేల్ అథర్టన్, అలెక్స్ బ్లాక్‌వెల్, అలన్ బోర్డర్, మైకేల్ బ్రియర్లీ, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, బెలిండా క్లార్క్, అలిస్టర్ కుక్, సునీల్ గవాస్కర్, లీ జెర్మాన్, ఆడమ్ గిల్‌క్రిస్ట్, డేవిడ్ గోవర్, కిమ్ హ్యూస్, నాసిర్ హుస్సేన్, సర్ క్లైవ్ లాయిడ్, కపిల్ దేవ్, అర్జున రణతుంగ, ఆండ్రూ స్ట్రాస్, దిలీప్ వెంగ్‌సర్కార్, స్టీఫెన్ వా, జాన్ రైట్ వంటివారున్నారు.

## రావల్పిండి సైనిక హెడ్ కోటర్స్ వద్ద భారీ భద్రత..!

**రావల్పిండి:** పాకిస్థాన్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న పంజాబ్ ప్రావిన్సుల నగరం రావల్పిండిలో భద్రత విధుల కోసం సైన్యాన్ని మోహరించింది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల శాఖ జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల ప్రకారం రావల్పిండిలో సమస్యాత్మక భద్రత విధుల కోసం ఆరు నెలల పాటు పాకిస్థాన్ ఆర్మీకి చెందిన మూడు కంపెనీలను మోహరించేందుకు ఫెడరల్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, ఈ మోహరింపునకు దారితీసిన అసలైన భద్రతా కారణాల స్వభావాన్ని ప్రభుత్వం వెల్లడించలేదు. పాకిస్థాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 ప్రకారం పౌర పరిపాలన యంత్రాంగానికి భద్రతా సహాయం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. పంజాబ్ ప్రభుత్వ హోం శాఖ అభ్యర్థన మేరకు ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చాయని, ఆరు నెలల పాటు అందుబాటులో ఉంటాయని అంతర్గత వ్యవహారాల శాఖ పేర్కొంది. రావల్పిండి జిల్లా యంత్రాంగానికి సహాయపడటం, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు లేదా అనుకోని పరిణామాలైనా ఎదురైతే సమర్థవంతంగా స్పందించడం కోసం ఈ మోహరింపును ఆమోదించారు. పంజాబ్ ఉన్నతాధికారులు మిలిటరీ వర్గాలకు పంపిన ఈ ఉత్తర్వుల్లో సైన్యానికి అప్పగించే నిర్దిష్ట విధులు, బెదిరింపుల వివరాలను వెల్లడించలేదని పాకిస్థాన్ పత్రికలు వెల్లడించాయి. ఆర్మీ ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలో ఈ మోహరింపు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల రావల్పిండిలో భద్రతా దళాలపై మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ పార్టీకి చెందిన వ్యక్తిగా భావిస్తున్న ఒకరు కాల్పులు జరిపిన ఘటన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. ఎదురుకాల్పుల్లో అతడు మరణించగా ఆయుధాలు, పీటీఐ జెండాను స్వాధీనం చేసుకున్నట్లు మీడియా నివేదించింది. అయితే ఈ ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. రావల్పిండి నగరం పాకిస్థాన్ సైనిక దళాల ప్రధాన కార్యాలయానికి నిలయంగా ఉండటం వల్ల వ్యూహాత్మకంగా చాలా కీలకమైంది. అక్కడ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది.

## ఉయ్యూరులో రాష్ట్ర వైద్య బృందం పర్యటన

**విజయవాడ,ఆగస్టు 23,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా ఉయ్యూరులో రాష్ట్ర వైద్య బృందం పర్యటించింది. ఉయ్యూరు పట్టణంలో డయేరియా ప్రబలినట్లు కీలక సమాచారం ప్రచారంలో ఉంది,.మంత్రి నారాయణ ఈ పట్టణంలో పర్యటించి,డయేరియాపై వాస్తవాలకు విరుద్ధంగా కొందరు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.కొందరు డయేరియాతో ఇబ్బంది పడుతూ ఆస్పత్రిని ఆశ్రయించినా,వారు డిశార్చి అయ్యారని వివరించారు.ఈ పట్టణంలో వాస్తవ పరిస్థితులు గుర్తించి డయేరియాను నియంత్రిస్తామని ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సైతం ప్రకటించారు.ఈ క్రమంలో డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిపరిశీలన చేసింది. ఖిఉయ్యూరులో ఇప్పటివరకు 19 డయేరియా కేసులు నమోదు. అందరి ఆరోగ్యం నిలకడగానే ఉంది ఎవరూ చనిపోలేదు. పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు ప్రత్యేక పర్యవేక్షణ. ప్రభావిత వార్డుల్లో రెండు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశాం. తాగునీటి నమూనాలను పరీక్షలకు పంపామని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

## ఉచితంగా దొరుకుతుందన్న ఆశతో..

### కెన్యాలో బంగారం కోసం పోటెత్తిన 10 వేల మంది



**నైరోబి, ఆగస్టు 23:** గత రెండేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. దీంతో బంగారం అత్యంత విలువైన లోహాల్లో ఒకటిగా మారింది. ఉచితంగా బంగారం దొరికే అవకాశం ఉందన్న వార్త వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో కెన్యాలోని ఓ చిన్న గ్రామంలో కనిపిస్తోంది. కెన్యాలోని వెస్ట్ పోకోట్ కౌంటీలోని కపెంగురియా నియోజకవర్గ పరిధిలో ఉన్న చెపోరోర్ గ్రామం ప్రస్తుతం బంగారం కోసం జరుగుతున్న అన్వేషణతో ఒక్కసారిగా వార్తల్లోకి వచ్చింది. గత రెండు వారాల్లో వేలాది మంది ఈ గ్రామానికి తరలివచ్చారు. బంగారం కోసం నదీ తీరాలు, మట్టిని తవ్వుతూ అన్వేషణ సాగిస్తున్నారు. ఈ పరిణామానికి ఓ మేకల కాపరి అనుకోకుండా కనుగొన్న బంగారు ముద్ద కారణమై ఉండొచ్చని బీబీసీ నివేదిక పేర్కొంది. గ్రామానికి చెందిన 33 ఏళ్ల మానసే లోమాచార్ తన తప్పిపోయిన మేక కోసం వెతుకుతుండగా, నది ఒడ్డున కొందరు మహిళలు బంగారం కోసం మట్టిని జల్లెడ పడుతున్నట్లు గమనించాడు. వారితో కలిసి తానూ వెతకడం ప్రారంభించగా అక్కడ బంగారం ఉన్న విషయం వెలుగులోకి వచ్చిందని ఆయన తెలిపాడు. లోమాచార్‌కు సుమారు 3 గ్రాముల బరువున్న బంగారు ముద్ద లభించింది. దాన్ని కొన్ని వారాల క్రితం 36 వేల కెన్యా షిల్లింగ్స్‌కు విక్రయించాడు. ఇది భారత కరెన్సీలో సుమారు రూ.26,615. తనకు బంగారం దొరికిన విషయం బయటకు రావడంతోనే గ్రామానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారని ఆయన భావిస్తున్నారు. అయితే ప్రస్తుత బంగారం వేటకు ఆ ఒక్క ఆవిష్కరణే కారణమా లేక ఇటీవల మరేదైనా బంగారం లభించిందా అనేది స్పష్టంగా తెలియలేదు. బంగారం కోసం గ్రామానికి వచ్చిన వారి సంఖ్య ఒక దశలో సుమారు 10 వేలకు చేరుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది కెన్యాతో పాటు పొరుగున ఉన్న ఉగాండా నుంచి వచ్చినవారే. ఈ ప్రాంతాల్లో ప్రజలు సాధారణంగా బంగారం కోసం మట్టి, ఇసుకను జల్లెడ పడుతుంటారు. అయితే పెద్ద మొత్తంలో బంగారం దొరకడం చాలా అరుదు. అయినప్పటికీ చిన్న మొత్తంలో బంగారం దొరికినా తమ కుటుంబాల భవిష్యత్తు మారుతుందని స్థానికులు ఆశిస్తున్నారు. యువకులకు గణనీయమైన మొత్తంలో బంగారం లభించినట్లు కనిపించింది. మరుసటి రోజు అదే ప్రాంతంలో మహిళలు కూడా మరోసారి గణనీయమైన పరిమాణంలో బంగారాన్ని కనుగొన్నారని వెస్ట్ పోకోట్ కౌంటీ డిప్యూటీ కమిషనర్ శామ్యూల్ కియారీ తెలిపారు. ఈ రెండు ఘటనలే గ్రామానికి ప్రజలు భారీగా తరలివచ్చేందుకు కారణమయ్యాయని ఆయన చెప్పారు. అయితే చెపోరోర్‌లో వాస్తవంగా ఎంత పరిమాణంలో బంగారం నిల్వలు ఉన్నాయో ఇప్పటివరకు నిర్ధారించలేకపోయారు. చిన్న స్థాయి బంగారం వ్యాపారులు రోజుకు సగటున సుమారు 100 మంది తమ వద్దకు వస్తున్నారని అధికారులకు తెలిపినట్లు కియారీ వెల్లడించారు. మరోవైపు బంగారం కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో గ్రామంలో కొత్తగా వ్యాపార అవకాశాలు కూడా ఏర్పడ్డాయి. ఆహారం, నీరు, ఇతర నిత్యావసర వస్తువులను విక్రయించే 200కు పైగా దుకాణాలు, వ్యాపారాలు వెలిశాయని అధికారులు తెలిపారు.

# కురుల నిగనిగ !



చదువుతున్నా, నిద్రపోతున్నా కొంత మంది చిన్న పిల్లలు అసంకల్పితంగా తలను గోక్కుంటూనే ఉంటారు. పేల సమస్యే ఇందుకు కారణం. చిన్నారి మనస్సు ఖుషీగా ఎప్పుడూ నిర్మలంగానే కనిపిస్తుంది. తల దువ్వుతుంటే చాలు చుండ్రు పొట్టులా రాలుతుంది. పిల్లల కురులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు చాలామంది తల్లులు. వీటిని పాటించండి చాలు.

**తడి లేకుండా..** ఆటపాటల్లో మునిగి తేలే చిన్నారులకు చెమట ఎక్కువగా పడుతుంది. పనుల ఒత్తిడే, తరవాత మాట వినరనే అనుమానమో చాలామంది తల్లులు.. తలస్నానం చేశాక తడి పూర్తిగా ఆరకుండానే రబ్బరు బ్యాండ్ పెట్టేస్తారు. ఇలా చేయడం వల్ల చుండ్రు ఇబ్బంది పెడుతుంది. జుట్టు నిర్జీవంగా మారుతుంది. అలాకాకుండా జుట్టుని పూర్తిగా ఆరనిచ్చాక జడ వేయడం, రోజు విడిచి రోజు తప్పనిసరిగా తలస్నానం చేయడం అలవాటు చేయాలి. ఇలా చేస్తే చుండ్రు దరిచేరదు.

**పేలు లేకుండా...** తలస్నానం చేయడానికి ముందు కప్పు కొబ్బరినూనెలో రెండు చుక్కల వేపనూనె కలిపి తలకు రాసి మర్దన చేయండి. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరి. ఇలా వారానికోసారి చేస్తుంటే సమస్య దూరమవుతుంది. లేదంటే ఆముదం కొబ్బరినూనె మిశ్రమాన్ని పట్టించొచ్చు. వేప, ఆముదంలో ఉండే రసాయనాలు, చేదు.. పేలు పారిపోయేలా చేస్తాయి.

**నిగనిగలాడేలా:** కొబ్బరినూనెలో పచ్చి ఉసిరి ముక్కలు, కాసిన్ని మెంతులు వేసి మరిగించండి. దీన్ని తలస్నానం చేయడానికి ముందు రాసుకోండి. అలానే శీకాయ, కుంకుడు కాయల్ని నీళ్లల్లో ఉడికించి రసం తీయండి. ఈ మిశ్రమాన్ని గాలిచొరడని సీసాలో పోసుకుని నేచురల్ షాంపూలా వాడుకోండి. ఇవి బుజ్జాయి జుట్టుని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు నిగనిగలాడేలా చేస్తాయి. ▫

మనం మాటలే కాదు. ముఖ కవళికలు హావభావాలు కూడా మన గురించి బోలెడు విషయాలు బోలెడు విషయాలు చెప్పేస్తాయి. అయితే తినే తీరూ మన వ్యక్తిత్వాన్ని బయటపెడుతుందని తెలుసా?

# తినే తీరులో తెలుస్తుంది..



ఒక్కో ముద్దనీ ఆస్వాదిస్తూ నెమ్మదిగా తింటారా? పనినీ మీరలాగే నెమ్మదిగా చేస్తారన్న భావన పక్కవారిలో ఉంటుందట. ఇక వేగంగా తినేవారు. మల్టీ టాస్కర్లే. చకచకా పని చేయడమే కాదు. .గడువుకన్నా ముందు పని ముగిస్తారట. కాకపోతే పనిలో పడి వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతారు అంటారు నిపుణులు. అన్నం మధ్యలోనే ఉండాలి. కర్రీ రంగు మారకూడదు. ఇలా ప్రతిదీ పట్టించుకునేవారు అన్నీ ప్రణాళిక ప్రకారం సాగాలి అనుకుంటారట. ఇలాంటివారు చుట్టుపక్కల ప్రదేశాన్నీ శుభ్రంగా ఉంచుకుంటారట. ఇక ఇది తినను, అది వద్దని వంకలు పెడుతోంటే మిమ్మల్ని రిస్క్ తీసుకోనివారిగానే పరిగణిస్తారు. వీళ్లెప్పుడూ ఓటమి భయంతో కొత్తవే ప్రయత్నించరట. కంఫర్ట్‌జోన్ నుంచి బయటికి రాకపోతే విజయాలెలా సాధిస్తారు మరి? కొందరు ఇంకా చిన్నపిల్లల్లానే ఎంత పెద్ద ప్లేట్ అయినా ఇవ్వనీ..చుట్టూ మెతుకులు పడాల్సిందే! కానీ వాళ్లు పక్కనుంటే సమయమే తెలియదట. పనినీ, చుట్టుపక్కల వాళ్లనీ ప్రేమిస్తారట. అయితే వీటన్నింటిలో పడి తుది గడువులు మర్చిపోవడమే వీరిలో లోపం. శబ్దం చేస్తూ తినేవాళ్లదీ వీరి తరహానే. కాకపోతే పక్కవాళ్లే కాస్త వీరిని ఇష్టపడరు. ఇక కొత్తవి ప్రయత్నించేవారు జీవితంలో సవాళ్లకు ఎదురెళతారు. రిస్క్ తీసుకుంటారు. వీరిలో మీదే తరహా?

# ప్రసవానంతరం ఫిట్‌గా ..



చాలా మందికి 30 దాటగానే చర్మం ముడతలు పడడం, గీతలు ఏర్పడడం.. వంటి వృద్ధాప్య ఛాయలు కనిపిస్తుంటాయి. ఇక వీటిని కవర్ చేసుకోవడానికి మేకప్‌ను ఆశ్రయించే వారే ఎక్కువ. ఫలితంగా సహజ సౌందర్యం దెబ్బతింటుంది. కానీ తైవాన్ మహిళలకు వయసును దాచుకునే పనే లేదు. మేకప్ అవసరం అంతకన్నా లేదు. ఎందుకంటే అక్కడ అరవై ఏళ్ల అమ్మమ్మలు కూడా అందమైన అమ్మాయిల్లా కనిపిస్తుంటారు. ఈవయసు లోనూ వారి చర్మం అంత కోమలంగా, ప్రకాశవంతంగా ఉంటుంది మరి! ఇంతకీ, వయసు పెరుగుతున్నా వన్నె తరగని అందంతో ప్రపంచాన్ని ఆకట్టుకుంటోన్న ఈ ముద్దుగుమ్మల సౌందర్య రహస్యాలేంటో తెలుసుకుందాం ..

**సహజసిద్ధమైన పదార్థాలతో...** అత్యవసర నూనెలు, షియా, బటర్, వెదురు, హెర్బల్ టీలు.. వంటి పూర్తిగా సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన సౌందర్య ఉత్పత్తుల్ని వాడడం. ఇంట్లో దొరకే పదార్థాలతోనే తమ అందాన్ని సంరక్షించు కోవడం. ఈ చిట్కాలే తైవాన్ మహిళల్ని నవయవ్వనంగా ఉంచుతున్నాయట.

**గువా షాతో.. ఇన్‌స్టంట్ అందం....** గువా షా.. క్వార్జ్ లేదా జేడ్ రాయితో తయారుచేసిన ఈ సహజసిద్ధమైన సాధనాన్ని ప్రస్తుతం ప్రపంచమంతా వినియోగిస్తోంది. అయితే నిజానికి ఇది పుట్టింది చైనాలోనే. ప్రాచీన కాలం నుంచే అక్కడ మహిళలు దీన్ని ఉపయోగిస్తున్నారు. తైవాన్ మహిళల సౌందర్య రహస్యమూ ఇదే! కోమలంగా, సున్నితంగా ఉండే ఈ రాయితో ముఖం, మెడపై మర్దన చేసుకోవడం వల్ల.. ఆయా భాగాల్లో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. తద్వారా చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. అలాగే గువా షాతో మర్దన చేసుకోవడం వల్ల మనం ఉపయోగించే సౌందర్య ఉత్పత్తుల్ని చర్మం సులభంగా గ్రహించగలుగుతుందట! తద్వారా ఇన్‌స్టంట్ అందాన్ని సొంతం చేసుకోవచ్చంటున్నారు తైవాన్ ముద్దుగుమ్మలు.

**ఆహారం, వ్యాయామం!** ప్రొటీన్‌లో ఉండే అమైనో ఆమ్లాలు చర్మంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. తద్వారా చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ ప్రయోజనాల్ని పొందడానికే తైవాన్ మహిళలు ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని తమ మెనూలో చేర్చుకుంటారు. ముఖ్యంగా పుట్టగొడుగులు, బ్లాక్‌రైస్, సముద్రపు నాచు, నల్ల నువ్వులు, మచా టీ, గోజీ బెర్రీస్, ఎరుపు రంగు డేట్స్. వంటివి వారి రోజువారీ ఆహారంలో తప్పకుండా ఉంటాయట! అంతే కాదు, నరకమం తప్పకుండా వ్యాయామాలు చేయడం కూడా తమ సౌందర్య రహస్యంలో భాగమే అంటున్నారు తైవాన్ భామలు.

**జుట్టుకు పోషణ :** వివిధ రకాల జుట్టు సమస్యల్ని తగ్గించుకోవడానికి హెయిర్ స్ప్రేలు, షాంపూలు వాడడం మనలో చాలామందికి అలవాటు! కానీ ఎలాంటి జుట్టు సమస్యనైనా సహజసిద్ధమైన పదార్థాలతోనే తగ్గించుకుంటామంటున్నారు తైవాన్ మహిళలు. అల్లంతో ప్రత్యేక పద్ధతుల్లో తయారుచేసిన షాంపూ, పెర్ల్ పౌడర్-రోజ్ వాటర్ కలిపి తయారుచేసిన హెయిర్ మాస్క్. ▫

# శ్రీవారి నిజరూప దర్శనం

**కలియుగ ప్రత్యక్ష దైవం** తిరుమల తిరుపతి శ్రీవారి వైభవం. వెంకటేశ్వర స్వామి వారు 'కో' అని పిలిస్తే ఆ అని పలికే అద్భుతమైనవి. తిరుమల క్షేత్రంలో వేకువ జామున రెండవ అర్చన తరువాత శ్రీవారి నిజరూప దర్శన భాగ్యం తన భక్తులకు కల్పిస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి గురువారం చేసే ఈ సేవలు అద్భుతమైనవి వాటిలో మొదటిది నిజ రూప దర్శనం. నిజరూప దర్శనం అంటే... తిరుమల శ్రీవారి నిజరూప దర్శనం ప్రతి గురువారం ఉంటుంది. ఆ రోజు వేకువ జామున రెండవ అర్చన తరువాత, స్వామి వారికి ఎలాంటి అలంకారాలు లేకుండా ఆభరణాలు తీసేసి వాటి స్థానంలో పట్టు వస్త్రం చుడతారు. కిరీటానికి బదులు పట్టు వస్త్రం చూడతారు. స్వామివారికి పచ్చ కర్పూరంతో వున్న పెద్ద నామం చిన్నదిగా చేస్తారు. ఈ నిజరూప దర్శనంలోనే స్వామి వారి నేత్ర దర్శనం కూడా మనకు కలుగుతుంది. గురువారం అంటే గురు దర్శనంగా కొందరు భావిస్తారు. తిరుమల శ్రీవారి నిజరూప దర్శనం సందర్భంగా గురువారం పరమ పవిత్రమైన శుభ దినంగా భావిస్తారు నిజరూప దర్శనంలో స్వామి వారి దివ్యమంగళ స్వరూపం చూసిన వారికి కోరిన కోరికలు లభిస్తాయని ప్రతీతి. అందుకే వారంలో ప్రతి గురువారం జరిగే స్వామి వారి నిజ రూప దర్శనం అంటే సకల భక్త కోటి అమితంగా ఇష్టపడతారు. ఈ నిజరూప దర్శనం చేసుకున్న సకల భక్త కోటికి మనోభీష్ఠ సిద్ధి కలుగుతుంది. నిజరూపం దర్శనంలో ఎంతో శక్తి సౌభాగ్యం వుంది. చూసిన వారికి పుణ్యం లభిస్తుంది. శుభ ప్రదమైన కోరినకోరికలు నరవేరుతాయి. ప్రత్యక్ష దైవంగా భావించే వారికి గురువారం నిజరూప దర్శనం ఒక వరంగా భావించాలి. గురువారం స్వామి వారికి గొప్ప విశేషం స్వామి వారి నిజరూప దర్శనంగా భావిస్తారు. అదేవిధంగా గురువారం రోజువారి సేవలులో భాగంగా పూలంగిసేవగా ఈ ప్రత్యేక సేవలు ప్రత్యేక పూల అలంకరణతో అలంకరిస్తారు. రోజు స్వామి వారికి ప్రత్యేకంగా పులిహోర, పాయసం, వడ నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ రోజు అక్కడున్న వ్యాపారులు ఇతరులను మోసం చేయరు. ఎందుకంటే ఈ రోజు నేత్ర దర్శన భాగ్యం కూడా కలుగుతుంది. కాబట్టి కేవలం లాభం లేకుండా వస్తువులని విక్రయిస్తారు తప్ప అధిక ధరలతో అమ్మడానికి ఇష్టపడరు. శ్రీవారు తమ భక్తులని వ్యాపారులని స్వయంగా గమనిస్తారని నమ్మకం. అదే ఈ నిజ రూప దర్శనం పుణ్యఫలం. ▫



# బాగుందీ బాసుంతి!

**కావాల్సి నవి :** టోన్డ్‌మిల్క్- అరలీటరు, కుంకుమపువ్వు రేకలు - ఎనిమిది (వీటిని గోరువెచ్చని పాలల్లో నానబెట్టాలి), యాలకుల పొడి-పావు టీస్పూన్, సన్నగా తురిమిన ఆపిల్-కప్పు, చియాసీడ్స్-టీస్పూన్, షుగర్ సబ్‌స్టిట్యూట్- నాలుగు నరగా. నిమ్మ రసం-అర టీస్పూన్, బాదం, పిస్తా తురుము- రెండు టీస్పూన్లు.

**తయారీ :** మందపాటి గిన్నెలో పాలు పోసి తక్కువ మంట మీద గంటపాటు మరిగించాలి. మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. దీంట్లో మూడు గ్రాముల షుగర్ సబ్‌స్టిట్యూట్, యాలకుల పొడి వేసి కలిపి పావుగంటపాటు మరిగించాలి. ఇప్పుడు గిన్నెలో ఆపిల్‌తురుము, కొద్దిగా షుగర్ సబ్‌స్టిట్యూట్ వేసి కాసిన్ని నీళ్లు పోయాలి. దీన్ని మూడు నిమిషాల పాటు ఉడికించి, చల్లార్చి ఈ మిశ్రమాన్ని పాలల్లో వేయాలి. దీంట్లో నానబెట్టిన చియాసీడ్స్ వేసి బాగా కలిపితే ఆపిల్ బాసుందీ సిద్ధమవుతుంది. చివరగా బాదం, పిస్తా తురుముతో అలంకరించాలి. ▫

# టాక్సిక్ ఏకఛత్రాధిపత్యం





## థియేటర్లు దొరక్క చేతులెత్తేస్తున్న టాలీవుడ్ చిన్న నిర్మాతలు

రాకింగ్ స్టార్ యష్ టాక్సిక్ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో సింహభాగం మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్లు కేటాయించడంపై వివాదం చెలరేగుతోంది. పాన్‌ఇండియా రేంజ్‌లో డబ్బింగ్ సినిమాకు ఇన్ని థియేటర్లు కేటాయిస్తే, స్ట్రెయిట్ తెలుగు సినిమాలకు షోలు దొరక్క నష్టం జరుగుతోందని డిజిటల్ మాధ్యమాల్లో చర్చ జరుగుతోంది. వివరాలలోకి వెళితే.. యష్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. కెజియఫ్ 2 లాంటి సెన్సేషనల్ హిట్ తర్వాత యష్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై పాన్ ఇండియా వ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. అయితే, తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ హక్కులు, స్క్రీన్‌ల కేటాయింపు విషయంలో ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఒక పెద్ద చర్చతోపాటు వివాదం నడుస్తోంది. పాన్-ఇండియా ట్రెండ్ పెరిగాక డబ్బింగ్ సినిమాలకు తెలుగు బాక్సాఫీస్ వద్ద విపరీతమైన ఆదరణ లభిస్తోంది. 'టాక్సిక్' తెలుగు హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థలు భారీ ధరకు కైవసం చేసుకున్నాయి. సినిమాపై ఉన్న విపరీతమైన క్రేజ్ దృష్ట్యా, తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన నగరాల్లోని మల్టీప్లెక్స్‌లతో పాటు సింగిల్ స్క్రీన్‌లను కూడా టాక్సిక్ టీమ్ అత్యధికంగా బుక్ చేసుకోవడం మొదలుపెట్టింది.

టాక్సిక్ రిలీజ్ అవుతున్న సమయానికే కొన్ని స్ట్రెయిట్ తెలుగు సినిమాలు (చిన్న, మీడియం రేంజ్ సినిమాలు) కూడా విడుదల కావలసి ఉంది. అయితే, యశ్ సినిమాకు దాదాపు 60-70 పైగా ప్రధాన స్క్రీన్‌లను కేటాయిస్తుండటంతో, మన తెలుగు సినిమాలకు సరిపడా థియేటర్లు దొరకడం లేదనేది చిన్న నిర్మాతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల వాదన వేరేలా ఉంది. బిజినెస్ పరంగా ఏ సినిమాకు ఎక్కువ ఓపెనింగ్స్ వస్తాయో ఆ సినిమాకే ప్రాధాన్యత ఇవ్వడం సహజమని, యశ్ క్రేజ్ రీత్యా టాక్సిక్ మొదటి రోజే భారీ వసూళ్లు రాబడుతుందని వారు నమ్ముతున్నారు. ఈ చర్చలో నెటిజన్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయారు.



## భర్త పోతే అలంకరణ వదిలేయాలా?

ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియా వేదికగా చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. భర్త మరణించిన తర్వాత మహిళలు బొట్టు, గాజులు, కాటుక వంటి అలంకరణలు ఎందుకు మానేయాలంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ఇది పూర్తిగా మహిళల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయమని, ఈ ఆచారం వెనుక ఉన్న తర్కం తనకు అర్థం కావడం లేదని అభిప్రాయపడుతూ ఆమె తన ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు.మూడేళ్ల క్రితం తన తండ్రి చనిపోయినప్పటి నుంచి తన మదిలో మెదులుతున్న సందేహాన్ని అనసూయ ఈ వీడియో ద్వారా పంచుకున్నారు. తండ్రి మరణానంతరం సమాజంలో నలుగురూ ఏమంటారోనన్న భయంతో తన తల్లి బొట్టు, గాజులు, కాటుక తీసేశారని, ఎంతో అందంగా అలంకరించుకునే కన్నతల్లిని అలా చూడటం ఒక కూతురిగా తనను చాలా బాధపెట్టిందని తెలిపారు. సాధారణంగా ఒక అమ్మాయికి బొట్టు, కాటుక, గాజులు, గజ్జెలు, గోరింటాకు వంటివన్నీ పరిచయం చేసేది అమ్మ లేదా అమ్మమ్మ అని, పెళ్లికి ముందే ఇవన్నీ జీవితంలో భాగమవుతాయని గుర్తుచేశారు. అలాంటప్పుడు వీటన్నింటినీ కేవలం భర్తతోనే ఎందుకు ముడిపెడుతున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు.


# తెర

## ఈసారి చార్మినార్ వద్ద రచ్చ



యువ కథానాయకుడు తేజ సజ్జ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన వినూత్న చిత్రం జాంబీ రెడ్డి బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆదివారం తేజ సజ్జ పుట్టినరోజు సందర్భంగా ఈ బ్లాక్‌బస్టర్ చిత్రానికి సీక్వెల్‌గా 'జాంబీ రెడ్డి 2 ఎన్‌ఎక్స్‌టి ఎల్‌విఎల్'ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సీక్వెల్‌కు ప్రశాంత్ వర్మ కథ అందించగా, 'ది ఫ్యామిలీ మ్యాన్ 2 ఫేమ్ సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన బాలీవుడ్ భామ షనయ కపూర్ నటిస్తుండగా, కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనున్నారు. చార్మినార్ నేపథ్యంలో సాగే ఈ కథలో ఈసారి హర్రర్, కామెడీ నెక్ట్ లెవెల్‌లో ఉంటాయని చిత్రబృందం తెలిపింది.

## కలెక్షన్ల సునామీ



మాస్ మహారాజా రవితేజ, సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఇరుముడి చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. మొదటి ఆట నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ సినిమా, రవితేజ కెరీర్‌లోనే మునుపెన్నడూ చూడని రీతిలో రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచేలా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 65.5 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త చరిత్రను సృష్టించింది. ఓవర్సీస్‌లోనూ ఈ సినిమా హవా నడుస్తోంది, ముఖ్యంగా నార్త్ అమెరికాలో పాన్‌ఇండియా సినిమాలతో సమానంగా భారీ రెస్పాన్స్ తెచ్చుకుంటూ ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. ఈ జోరుతోనే కేవలం 48 గంటల్లోపే మెజారిటీ ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూటర్లు బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని లాభాల బాట పట్టారు. వారాంతంలో హైదరాబాద్ సహా అన్ని ప్రధాన నగరాల్లో దాదాపు 100 శాతం ఆక్యుపెన్సీతో థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంతో పాటు తండ్రీకూతుళ్ల మధ్య సాగే బలమైన ఎమోషన్, శివ నిర్వాణ టేకింగ్ మరియు రవితేజ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతుండటంతో, ఫస్ట్ వీకెండ్‌లోనే రికార్డులు బద్దలు కొట్టిన ఈ చిత్రం లాంగ్ రన్‌లో మరిన్ని మైలురాళ్లను అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది.



## అంబానీ ప్రోత్సాహం మర్చిపోలేను

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ తన కెరీర్‌లో ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. ధురందర్ ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు వరుస ఫ్లాప్‌ల వల్ల తన కెరీర్ కష్టకాలంలో ఉందని, అయినప్పటికీ అంబానీ కుటుంబం తనపై నమ్మకంతో ఈ భారీ చిత్రాన్ని నిర్మించిందని ఆయన అన్నారు. కెరీర్‌లో గెలుపోటములు సహజమని, కష్టసమయంలో తనకు లభించిన ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేనని ఒక డాక్యుమెంటరీలో రణ్‌వీర్ పేర్కొన్నారు.

## శుక్రాచార్యుడి యుద్ధారావం



హనుమాన్ వంటి భారీ విజయం తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న మరో లేడీ సూపర్ హీరో చిత్రం మహాకాళి. పూజా అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కన్నడ నటి భూమి శెట్టి ప్రధాన పాత్ర పోషిస్తుండగా, బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా రాక్షస గురువు శుక్రాచార్యుడిగా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి శుక్రాచార్యుడి యుద్ధరావం పేరిట ఓ ప్రత్యేక అప్‌డేట్‌ను ఈనెల 24 ఉదయం 11:34 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. శ్రియారెడ్డి, సముద్రఖని, నాజర్, రోహిత్ సురేష్ సరాఫ్, మురళీ శర్మ, రజత్ కపూర్, జితిన్ గులాటి వంటి భారీ నటీనటులు ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆర్.కే. దుగ్గల్ సమర్పణలో ఆర్కేడీ స్టూడియోస్, ఎస్ఓఆర్కేడీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఐమ్యాక్స్ 3డీ, డాల్బీ సినిమా సాంకేతికతతో రాబోతున్న ఈ సినిమా డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. సురేష్ రగుతు కెమెరా వర్క్ అందిస్తుండగా, శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.



## రాకా సెట్‌లో ఎన్నో వింతలు..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, మాస్ డైరెక్టర్ అట్లీ కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ యాక్షన్ ఎంటర్‌టైనర్ రాకా. సన్ పిక్చర్స్ పతాకంపై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్, బన్నీ డిఫరెంట్ లుక్‌కి ప్రేక్షకులలో అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ మూవీ సెట్స్ గురించి నటి మంచు లక్ష్మి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బన్నీ ఆహ్వానం మేరకు ముంబైలోని రాకా షూటింగ్ సెట్‌ను సందర్శించినట్లు ఆమె తెలిపారు. తన కెరీర్‌లో ఇంతవరకు ఇలాంటి భారీ, వినూత్నమైన సెట్‌ను చూడలేదని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## వారణాసి మ్యూజిక్ మ్యాజిక్



సూపర్‌స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న అంతర్జాతీయ స్థాయి అడ్వెంచర్ డ్రామా వారణాసికి సంబంధించి ఆస్కార్ విజేత, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాలో మొత్తం ఆరు అద్భుతమైన పాటలు ఉండబోతున్నాయని, రాజమౌళి మార్క్ ఎమోషన్స్, లార్జర్ ద్యాన్ లైఫ్ యాక్షన్ సీన్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఇవి కథలో భాగంగానే సాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇక సినిమా గ్రాండియర్‌కు తగ్గట్టుగా రీ రికార్డింగ్ పనులను సైతం చాలా వేగంగా పూర్తి చేయాలని చూస్తున్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనులను అధికారికంగా ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ వైడ్‌గా రిలీజ్ కాబోతున్న చిత్రం కావడంతో, ఆడియో అండ్ బిజిఎమ్ ట్రాక్స్‌ను కూడా హాలీవుడ్ స్థాయి టెక్నికల్ స్టాండర్డ్స్‌కు తగ్గట్టుగా, ప్రముఖ అంతర్జాతీయ వాద్యకారులతో రికార్డ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.




## డ్యూరాండ్ కప్: ఛాంపియన్‌గా ఈస్ట్ బెంగాల్

**న్యూఢిల్లీ:** కోల్‌కతా డెర్బీలో మోహన్ బగాన్ సూపర్ జెయింట్‌ను ను ఓడించి, 22 ఏళ్ల తర్వాత డ్యూరాండ్ కప్ 2026 ఫైనల్‌ను గెలుచుకున్న ఈస్ట్ బెంగాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో, ఎడ్మండ్ లాల్‌రిండికా తొలి అర్ధభాగంలో సాధించిన హ్యాట్రిక్, బిపిన్ సింగ్ చేసిన మరో గోల్ కారణంగా బెంగాల్ జట్టు, సూపర్ జెయింట్‌ను 4-1 తేడాతో చిత్తుగా ఓడించి డ్యూరాండ్ కప్‌ను గెలుచుకుంది. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో రెడ్ అండ్ గోల్డ్ బ్రిగేడ్‌ను ఓడించిన బాగాన్, రక్షణ విభాగంలో చాలా వెనుకబడి ఉంది. మరియు ఈస్ట్ బెంగాల్ తన ప్రత్యర్థి యొక్క హైలైన్‌ను వేగవంతమైన ఎదురుదాడితో దండించింది. మహమ్మద్ రషీద్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న బిపిన్, 10వ నిమిషంలో విశాల్ కైత్‌ను దాటుకుంటూ బంతిని నెట్‌లోకి పంపి స్కోరింగ్‌ను ప్రారంభించాడు. దీంతో బిపిన్ సింగ్ మొదటి గోల్‌ను నమోదు చేశాడు. తరువాత ఎడ్మండ్ లాల్‌రిండికా కేవలం ఒక నిమిషం తర్వాత స్కోరు పెంచాడు. 27 సంవత్సరాల వయస్సున్న లాల్‌రిండికా 22వ, 44వ నిమిషాల్లో కూడా గోల్ కొట్టి అద్భుతమైన హాట్‌ట్రిక్‌ను పూర్తి చేశాడు. మోహన్ బగాన్‌కు చెందిన మన్వీర్ సింగ్ 33వ నిమిషంలో గోల్ కొట్టాడు. కానీ ఆ సమయంలో ఆంటోనియా ఆబాస్ యొక్క బృందం 4-1తో ముందంజలో ఉంది. లాల్‌రిండికా హాట్‌ట్రిక్ ఈస్ట్ బెంగాల్‌కు మోహన్ బగాన్‌పై జరిగిన రెండవ హాట్‌ట్రిక్. బగాన్ తేరుకునేలోపే, ఎడ్మండ్ రెండు నిమిషాల్లోనే గోల్ చేసి ఈస్ట్ బెంగాల్‌కు ఆధిక్యం తెచ్చాడు. దాని రామిరెజ్ బాక్స్‌లో ఎడ్మండ్‌కు బంతిని అందించగా, అతను సంయమనం కోల్పోకుండా కైత్‌ను ఓడించి రెండవ గోల్‌ను సాధించాడు. అయితే, గత సీజన్‌లో ఇండియన్ సూపర్ లీగ్ గెలిచిన ఈస్ట్ బెంగాల్ అప్పటికే మంచి ఊపు మీద ఉంది, దానితో ఎడ్మండ్ అర్ధ సమయానికి ఒక నిమిషం ముందు తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. రషీద్, జయ్ గుప్తాతో కలిసి ఆడగా, గుప్తా ఇచ్చిన క్రాస్‌ను ఫార్వర్డ్ నెట్‌లోకి నెట్టాడు. డ్యూరాండ్ కప్‌లో కోల్‌కతా డెర్బీలో నమోదైన మొట్టమొదటి హ్యాట్రిక్ ఇది. రెండవ భాగంలో బాగాన్ పుంజుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, హబాస్ తన అత్యంత ప్రభావవంతమైన వ్యూహాలలో ఒకటైన డిఫెన్సివ్‌లోబ్లాక్‌ను ఉపయోగించి మెరైనర్స్‌ను నిలువరించాడు. ఈస్ట్ బెంగాల్ మరో 2 దశాబ్దాల ట్రోఫీ నిరీక్షణకు తెరపడింది.

## 2వ టెస్ట్‌లో పడిక్కల్ సెంచరీతో భారత్ 300 స్కోరు




**కొలంబో:** కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ భారీ స్కోరు దిశగా దూసుకుపోతుంది. వన్‌డౌన్ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ సెంచరీ (117; 193 బంతుల్లో 12 ఫోర్లు)తో చెలరేగడంతో మొదటి రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. క్రీజులో ధ్రువ్ జురెల్ (7), సారాంశ్ జైన్ (4)లు ఉన్నారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. 18 పరుగులు మాత్రమే చేసిన కేఎల్ రాహుల్ జట్టు స్కోరు 37 పరుగుల వద్ద తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (45; 53 బంతుల్లో 9 ఫోర్లు) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నప్పటికి కూడా గత మ్యాచ్ హీరో దేవ్‌దత్ పడిక్కల్ మరోసారి చెలరేగి ఆడాడు. అతడి ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు క్లిష్టమైన క్యాచ్‌లను లంక ఆటగాళ్లు వదిలివేయడాన్ని సద్వినియోగం చేసుకున్న పడిక్కల్ ఆచితూచి ఆడాడు. అసలు సిసలైన టెస్టు ఇన్నింగ్స్ ఆడాడు. మంచి బంతులను గౌరవిస్తూనే చెత్త బంతులను బౌండరీలకు తరలించాడు. ముందు యశస్వి జైస్వాల్, ఆ తరువాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50; 108 బంతుల్లో 6 ఫోర్లు)లతో భాగస్వామ్యాలు నెలకొల్పాడు. రెండో మ్యాచ్‌లోనూ శతకంతో చెలరేగి వన్‌డౌన్ స్థానానికి తానే సరైన వాడినని నిరూపించుకున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ వ్యక్తిగత స్కోరు 3 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఇంకొద్ది సేపటిలో తొలి రోజు ఆట పూర్తి అవుతుందనగా రవీంద్ర జడేజా (43; 83 బంతుల్లో 4 ఫోర్లు) ఔట్ అయ్యాడు. ధ్రువ్ జురెల్, సారాంశ్ జైన్ లు మరో వికెట్ పడకుండా తొలి రోజును ముగించారు.

# టెస్ట్ క్రికెట్‌లో షాకింగ్ రికార్డు

### దారుణమైన ఇన్నింగ్స్..

### భారత్ సహా 50 పరుగులూ చేయలేని జట్లు




**న్యూఢిల్లీ:** టెస్టు క్రికెట్ అంటేనే బ్యాటర్ల సహనానికి, నైపుణ్యానికి అసలైన పరీక్ష. ఎంతటి దిగ్గజ జట్టయినా కష్టమైన పరిస్థితుల్లో తడబడితే ఘోరమైన పతనం తప్పదు. మైదానంలో పరిస్థితులు బౌలర్లకు అనుకూలంగా మారినప్పుడు ఎంతటి దిగ్గజ బ్యాటింగ్ లైనప్ అయినా క్షణాల్లో కూలిపోతుంటుంది. సుదీర్ఘ టెస్టు చరిత్రలో కొన్ని జట్లు కనీసం 50 పరుగులు కూడా చేయలేక పెవిలియన్‌కు క్యూ కట్టిన అత్యంత దారుణమైన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఈ అత్యల్ప స్కోర్ల జాబితాలో న్యూజిలాండ్ అగ్రస్థానంలో నిలవగా, వెస్టిండీస్, టీమిండియా, దక్షిణాఫ్రికా వంటి దిగ్గజ జట్లు కూడా ఈ షాకింగ్ రికార్డును నమోదు చేశాయి. టెస్ట్ క్రికెట్ ఒకే ఇన్నింగ్స్‌లో అత్యల్ప స్కోరు నమోదు చేసిన షాకింగ్ రికార్డు న్యూజిలాండ్ పేరిట ఉంది. మార్చి 25, 1955న ఆక్లాండ్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 26 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లాండ్ బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు నిలబడలేకపోయారు. కేవలం 27 ఓవర్లలోనే ఇన్నింగ్స్ ముగిసిపోయింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అతి తక్కువ టీమ్ స్కోరు ఇదే కావడం గమనార్హం. ఈ జాబితాలో వెస్టిండీస్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. జూలై 2025లో కింగ్‌స్టన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ కేవలం 27 పరుగులకే ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియా పేసర్ల దాడికి విండీస్ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా పెవిలియన్ చేరారు. జట్టులోని ఏ ఒక్క బ్యాటర్ కూడా రెండంకెల స్కోరును దాటలేకపోవడంతో ఈ దారుణమైన రికార్డు వెస్టిండీస్ ఖాతాలో చేరింది. దక్షిణాఫ్రికా ఈ జాబితాలో పలుమార్లు కనిపిస్తుంది. 1896లో గెబెహాలో ఇంగ్లాండ్‌పై 30 పరుగులు, 1924లో బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్‌పై మళ్లీ 30 పరుగులకే ఆలౌట్ అయింది. ఇవే కాకుండా 1899లో కేప్‌టౌన్‌లో 35 రన్స్, 1932లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 36 రన్స్ చేసింది. ఇక భారత జట్టు విషయానికి వస్తే 2020లో అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన డేనైట్ టెస్ట్ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా కేవలం 36 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది భారత టెస్ట్ చరిత్రలో అత్యల్ప స్కోరుగా నిలిచింది. అంతకుముందు 1974లో లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌పై భారత్ 42 పరుగులకే కుప్పకూలింది.




## వరల్డ్ అథ్లెటిక్స్: రోహిత్‌కు జావెలిన్ టైటిల్

### రాణించిన శ్రీశంకర్

**న్యూఢిల్లీ:** భారత క్రీడాకారుడు రోహిత్ యాదవ్ తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో పురుషుల జావెలిన్ టైటిల్‌ను గెలుచుకోగా, స్టార్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ తన స్థాయికి తగ్గట్టుగా రాణించి వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ సిల్వర్‌లెవల్ మీట్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. నాలుగో రౌండ్ ముగిసేసరికి నాలుగో స్థానంలో వెనుకబడి ఉన్న రోహిత్, ఐదో రౌండ్ ముగిసేసరికి కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత యశ్వీర్ సింగ్ వెనుక రెండో స్థానానికి చేరుకున్నాడు. ఆ తర్వాత తన ఈటెను 87.68 మీటర్ల దూరం విసిరి, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను చేసుకున్నాడు.

ఐదవ రౌండ్‌లో 82.94 మీటర్ల ప్రదర్శనతో యశ్వీర్ రెండవ స్థానంలో నిలవగా, శ్రీలంకకు చెందిన సుమేధ రణసింఘే 80.29 మీటర్లతో మూడవ స్థానంలో నిలిచారు. గత సంవత్సరం ఇక్కడ కాంస్యస్థాయి పోటీని విజయవంతంగా నిర్వహించిన తర్వాత, ఈ పోటీ భారతదేశానికి మొట్టమొదటి వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ రజత ఈవెంట్‌గా నిలిచింది. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత శ్రీశంకర్, తన రెండవ మరియు మూడవ ప్రయత్నాలలో 8.07 మీటర్ల దూరం నమోదు చేశాడు. కానీ దక్షిణాఫ్రికాకు చెందిన దివాన్ మాన్యుయెల్ తన చివరి ప్రయత్నంలో 8.03 మీటర్లు దూకాడు. శ్రీశంకర్, చివరికి కేవలం 4 సెం.మీ. తేడాతో గెలుపొందాడు. అతని సీజన్ బెస్ట్ 8.38 మీటర్లు కాగా, పర్సనల్ బెస్ట్ 8.41 మీటర్లు.

## రెండో టెస్టులో బంగ్లాదేశ్ చిత్తు

### 51 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం




**సౌత్ మక్కే:** డార్విన్ టెస్టులో చారిత్రాత్మక విజయం సాధించి ఆస్ట్రేలియాపై పైచేయి సాధించిన బంగ్లాదేశ్‌కు రెండో టెస్టులో మాత్రం ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మక్కే టెస్టులో బంగ్లాదేశ్‌ను ఒక ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చిత్తుగా ఓడించింది. మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లతో అదరగొట్టాడు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 64, రెండో ఇన్నింగ్స్ కేవలం 95 పరుగులకే ముగియడంతో మ్యాచ్ రెండో రోజు ఆదివారం నాటికే పూర్తయింది. దీంతో రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమమైంది. ఆస్ట్రేలియా ఈ మ్యాచ్ గెలవడంలో స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ కీలక పాత్ర పోషించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్ బ్యాటింగ్ విభాగం నడ్డివిరిచిన స్టార్క్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే దాడిని కొనసాగించి మరో 4 వికెట్లు తీశాడు. మొత్తం గా ఈ మ్యాచ్‌లో 10 వికెట్లు తీసి బంగ్లాదేశ్ కోలుకోలేని దెబ్బతీశాడు. టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బాంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 64 పరుగులకే కుప్పకూలింది. అందులో 11వ స్థానంలో వచ్చిన షోరిపుల్ ఇస్లాం చేసిన 14 పరుగులే టాప్ స్కోర్ కావడం గమనార్హం. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో కామెరాన్ గ్రీన్ (67), స్టీవ్ స్మిత్ (42) రాణించడంతో 210 పరుగులు చేసి 146 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. బంగ్లాదేశ్ హౌలర్ షోరిపుల్ ఇస్లాం 7 వికెట్లతో పోరాడినా జట్టుకు మేలు జరగలేదు. మిచెల్ స్టార్క్ మెరుపు బౌలింగ్ కారణంగా బాంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ తరపున కెప్టెన్ నజ్ముల్ హొస్సెన్స్ శాంటో 31 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముష్ఫికుర్ రహీమ్ 29 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మిగిలిన 9 మంది బ్యాటర్లలో ఎవరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. వారిలో ముగ్గురు ఖాతా కూడా తెరవలేకపోయారు. కెప్టెన్ పాట్ కమిన్స్, నాథన్ లియాన్ చెరో 3 వికెట్లుతో స్టార్క్‌కు మద్దతుగా నిలిచారు. దీంతో రెండో రోజు టీ విరామం తర్వాత ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది.

## ఎఫ్‌డిఐ నిబంధనల్లో మరిన్ని సడలింపులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత సరళీకరించి, దేశంలోకి విదేశీ మూలధననిధులరాక పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలుచేపట్టింది. ఇందులో భాగంగా కంపెనీల అనుబంధ సంస్థలు (సబ్సిడరీలు) విదేశీ పెట్టుబడి నిబంధనల్లో సడలింపులు కోరితే, సంబంధిత సమయంలో వాటిని పరిశీలించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెపుతున్నాయి. ఎఫ్‌డిఐ ప్రతిపాదనలకు ఆమోద ప్రక్రియను సులభతరం చేయడంలో భాగంగా, క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ పరిశీలనకు వెళ్లాల్సిన పెట్టుబడి ప్రతిపాదనల పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లకు పెంచే ప్రతిపాదన కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ మార్పు అమల్లోకి వస్తే రూ.15,000 కోట్ల వరకు ఉన్నఎఫ్‌డిఐ ప్రతిపాదనలను సంబంధిత మంత్రిత్వ శాఖలే ఆమోదిస్తాయి. వాటిని కేబినెట్‌కమిటీకి పంపాల్సిన అవసరం లేకుండా, ఆమోద ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రూ.5,000 కోట్ల పరిమితి 2015 నవంబర్ నుంచి ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతోంది. డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన నిబంధనలను కూడా సరళీకరించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రతిపాదిత విధానం ప్రకారం, ఒక భారతీయ అనుబంధ సంస్థకు



పరోక్షంగా విదేశీ పెట్టుబడి వచ్చినప్పుడు, దాని మాతృ సంస్థ లేదా పైస్థాయి సంస్థ ఇప్పటికే అవసరమైన ప్రభుత్వ అనుమతి పొందినట్లయితే ఆ అనుబంధ సంస్థకు మరోసారి ప్రత్యేక ప్రభుత్వ అనుమతి అవసరం లేకపోవచ్చు. ప్రతిపాదిత మార్పులపై అభిప్రాయాలను సేకరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే70 మంది భాగస్వాములతో సంప్రదింపులు జరిపింది. ఈ సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం తుది ప్రతిపాదనలను ఖరారు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఎఫ్‌డిఐ నిబంధనలను సమీక్షిస్తోంది. ప్రస్తుతం భారత్‌లోకి వస్తున్న మొత్తం ఎఫ్‌డిఐల్లో 90 శాతానికి పైగా ఆటోమేటిక్ రూట్ ద్వారా వస్తోంది.


## 8 మెట్రోనగరాల్లో ఇళ్ల విక్రయాలు డల్!




**ముంబయి, ఆగస్టు 23:** దేశంలోని ఎనిమిది ప్రధాన రెసిడెన్షియల్ మార్కెట్లలో ఈ ఏడాది తొలిత్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 6.1 శాతం తగ్గి 91,729 యూనిట్లకు పరిమితమయ్యాయి. ముందస్తు రుతుపవనాల ప్రభావం, కొనుగోలుదారుల అప్రమత్త వైఖరి కారణంగా హౌసింగ్ మార్కెట్‌లో కార్యకలాపాలు మందగించాయని ఆరమ్ ప్రాప్‌టెక్ విడుదల చేసిన ప్రాప్‌టైగర్ డాట్‌కామ్ రియల్ ఇన్‌సైట్ రిపోర్ట్ వెల్లడించింది. గత త్రైమాసికంతో పోల్చినా విక్రయాలు 4.4 శాతం తగ్గాయి. 2026 జనవరి-మార్చి త్రైమాసికంలో 95,973 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఈ తగ్గుదలను విస్తృత స్థాయి మందగమనంగా కాకుండా మార్కెట్‌లో కొనసాగుతున్న కన్సాలిడేషన్ దశగా చూడాలని నివేదిక పేర్కొంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 97,674 యూనిట్ల అమ్మకాలు నమోదైన నేపథ్యంలో ప్రస్తుత గణాంకాలపై పోలిక ప్రభావం కూడా ఉందని తెలిపింది. అమ్మకాలు తగ్గినప్పటికీ డెవలపర్లు కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలో వెనుకడుగు వేయలేదు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఎనిమిది నగరాల్లో మొత్తం 89,161 ఇళ్లను కొత్తగా మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 6 శాతం పెరుగుదల. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే కొత్త ప్రాజెక్టుల ప్రారంభాలు 4.2 శాతం తగ్గాయి. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇళ్ల కంటే అమ్ముడైన ఇళ్ల సంఖ్య 2,568 యూనిట్లు అధికంగా ఉండటంతో డిమాండ్-సప్లై సమతుల్యత పెద్దగా దెబ్బతినలేదని నివేదిక తెలిపింది. ఎనిమిది మార్కెట్లలోనూ వార్షిక ప్రాతిపదికన ధరలు పెరిగాయి. చెన్నైలో కనిష్ఠంగా 4.4 శాతం పెరగ్గా, బెంగళూరులో గరిష్ఠంగా 26 శాతం ధరల వృద్ధి నమోదైంది. పుణెలో తొలిసారిగా చదరపు అడుగు ధర రూ.8,000ను దాటింది. అమ్మకాల పరంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ దేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ మార్కెట్‌గా కొనసాగింది. బెంగళూరు, పుణె, హైదరాబాద్ మార్కెట్లలో టెక్నాలజీ రంగంలోని ఉపాధిపై ఆధారపడటం కూడా కీలక అంశంగా మారిందని ప్రాప్‌టైగర్ డాట్‌కామ్ సీఈఓ ప్రకాశ్ తేజ్‌వానీ తెలిపారు.

## నాలుగైదేళ్లలో 30 కోట్లమంది పిఎఫ్ చందాదారులు

### -పిఎఫ్ఆర్డీయే ఛైర్మన్ వెల్లడి



**చెన్నై, ఆగస్టు 23:** వచ్చే నాలుగైదేళ్లలో నేషనల్ పెన్షన్ సిస్టమ్, అటల్ పెన్షన్ యోజనలో కలిపి దాదాపు 30 కోట్ల మంది ప్రత్యేక చందాదారులను చేర్చుకోవాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ పిఎఫ్ఆర్డీయే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఎపివైలో 10 కోట్ల మంది, ఎన్‌పిఎస్‌లో 2.2 కోట్ల మంది చందాదారులు ఉన్నారని పిఎఫ్ఆర్డీయే ఛైర్మన్ శివసుబ్రమణియన్ రామన్ తెలిపారు. ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులు, గిగ్ వర్కర్లు, రైతులు తదితరులు పదవీ విరమణ అనంతర అవసరాల కోసం పొదుపు, పెట్టుబడులు చేసేలా ప్రోత్సహించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. ముఖ్యంగా నాలుగోశ్రేణి ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌పిఎస్, ఎపివైపై అవగాహన పెంచి పెట్టుబడి అలవాటును పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పిల్లల కోసం ఎన్‌పిఎస్ వాత్సల్య, ఎన్‌పిఎస్ సంచయ్ వంటి పథకాలను ఇప్పటికే ప్రారంభించామని, ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌ఫిఎస్ స్వాస్థ్య పథకాన్ని మరో రెండు నెలల్లో అధికారికంగా ప్రారంభించనున్నట్లు రామన్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న తరహా ఆస్తుల కేటాయింపు ప్రయోజనాలు ప్రైవేటు ఉద్యోగులు, గిగ్ వర్కర్లు, రైతులకు కూడా అందాలన్నదే PFRDA ఉద్దేశమన్నారు.

వాణిజ్యం



## ఫెడ్‌రిజర్వు నిర్ణయాలే మార్కెట్లకు కీలకం!

**ముంబయి, ఆగస్టు 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో వారంలో నష్టాల్లో ముగియడంతో వచ్చే వారం సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ తొలి కీలక ప్రసంగం, అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, చర్చల పరిణామాలు, ముడి చమురు ధరల కదలికలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు. అమెరికా బాండ్ రాబడులు పెరుగుతుండటం, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు కొనసాగడం, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. స్వల్ప లాభాలు నమోదైనప్పటికీ వారాంత ప్రాతిపదికన రెండు ప్రధాన సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ సుమారు 0.47 శాతం, సెన్సెక్స్ దాదాపు 0.60 శాతం చొప్పున క్షీణించాయి. వచ్చే వారం మార్కెట్లకు ప్రధాన ట్రిగ్గర్‌గా అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ప్రసంగం నిలవనుంది. ఈనెల 28న వ్యోమింగ్‌లో జరిగే వార్షిక జాక్సన్ హోల్ ఎకనామిక్ పాలసీ సింపోజియంలో ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు. వడ్డీ రేట్లపై ఫెడ్ వైఖరికి సంబంధించి ఆయన చేసే వ్యాఖ్యలను ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య భౌగోళిక రాజకీయ పరిణామాలు కూడా మార్కెట్ దిశను ప్రభావితం చేయవచ్చు. కొత్త ఆంక్షలు విధించాలన్న అమెరికా ప్రణాళికను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పరిస్థితులు మళ్లీ తీవ్రతరం అయితే ప్రపంచ మార్కెట్లలో రిస్క్‌కు దూరంగా ఉండే ధోరణి పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు.


దేశీయ ఈక్విటీ మార్కెట్ల దిశను నిర్ణయించడంలో ముడి చమురు ధరలు కూడా కీలకంగా మారనున్నాయి. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో శుక్రవారం చమురు ఫ్యూచర్స్ ధరలు పెరిగాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ సరఫరాకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

## టాప్ 4 కంపెనీల్లో రూ.88వేల కోట్ల ఎంక్యాప్ నష్టం



**ముంబయి, ఆగస్టు 23:** దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో నాలుగు సంస్థల మార్కెట్ విలువ గత వారంలో రూ.87, 960. 29 కోట్లు క్షీణించింది. స్టాక్ మార్కెట్లలో ప్రతికూల ధోరణి ఇందుకు కారణమైంది. టాప్10 కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.28,052.96 కోట్లు తగ్గి రూ.12,14, 963.15 కోట్లకు చేరింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మార్కెట్ విలువ రూ.22,070. 34 కోట్లు తగ్గి రూ.8,31, 436.51 కోట్లకు చేరింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.20,861.20 కోట్లు తగ్గి రూ.9,64,968.76 కోట్లకు చేరగా, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.16,975.79 కోట్లు తగ్గి రూ.4,73,912.56 కోట్లకు చేరింది. ఆరు కంపెనీలకు లాభాలుమరోవైపు టాప్ 10లోని ఆరు కంపెనీలు గత వారం మార్కెట్ విలువలో వృద్ధిని నమోదు చేశాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) మార్కెట్ విలువ రూ.12,650 కోట్లు పెరిగి రూ.5,35,980.31 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.8,119.53 కోట్లను జోడించడంతో దాని మార్కెట్ విలువ రూ.17,78,175.59 కోట్లకు పెరిగింది. లార్సెన్ అండ్ టూబ్రో మార్కెట్ విలువ రూ.3,487.83 కోట్లు పెరిగి రూ.5,62,460.94 కోట్లకు చేరగా, బజాజ్ ఫైనాన్స్ రూ.3,424.28 కోట్లు పెరిగి రూ.6,80,621.62 కోట్లకు చేరింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.752.47 కోట్లు పెరిగి రూ.10,18,330.45 కోట్లకు చేరగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.356.95 కోట్లు జోడించడంతో దాని మార్కెట్ విలువ రూ.11,21,159.05 కోట్లకు చేరింది.

## మూడేళ్లలో రూ.200 లక్షల కోట్లకు ఎస్‌బిఐ టర్నోవర్



**ముంబయి,ఆగస్టు 23:** దేశంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ భారతీయ స్టేట్‌బ్యాంకు మొత్తం వ్యాపారం 2030 నాటికి రూ.200 లక్షల కోట్లకు చేరుకు ంటుందని బ్యాంక్ ఛైర్మన్ సి.ఎస్. శెట్టి తెలిపారు. ప్రస్తుత వృద్ధి రేటు కొనసాగితే 2030 నాటికి మొత్తం వ్యాపారం రూ.170-180 లక్షల కోట్ల స్థాయికి చేరవచ్చని, అనుకూల పరిస్థితుల్లో రూ.200 లక్షల కోట్ల మైలురాయిని కూడా అధిగమించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో తొలిసారిగా బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. 2026 జూన్ చివరి నాటికి అది మరింత పెరిగి రూ.110.01 లక్షల కోట్లకు చేరింది. 2030 నాటికి బ్యాంక్ ప్రస్తుత వృద్ధి కొనసాగితే రూ.170-180 లక్షల కోట్లకు, అవకాశం ఉంటే రూ.200 లక్షల కోట్లకు చేరుకోవచ్చని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుతో ఎస్‌బీఐ కార్యకలాపాల స్థాయి ముడిపడి ఉంటుందని శెట్టి వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థ 7-8 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తే, ఎస్‌బీఐ బ్యాలెన్స్ షీట్ ఏటా 11-12 శాతం మేర విస్తరించే సామర్థం ఉందన్నారు. ఈ వేగంతో బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ ప్రతి ఆరు సంవత్సరాలకు దాదాపు రెట్టింపు కావచ్చని చెప్పారు. నాలుగు ప్రధాన భాగస్వాములపై దృష్టిఎస్‌బీఐ విజన్ 2030లో భాగంగా ఖాతాదారులు, ఉద్యోగులు, వాటాదారులు, ప్రభుత్వం-నియంత్రణ సంస్థలు అనే నాలుగు ప్రధాన భాగస్వాముల అవసరాలపై దృష్టి సారిస్తున్నట్లు శెట్టి తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాంకులతో పోల్చుకుని ప్రతి విభాగంలో అత్యున్నత ప్రమాణాలను అందుకోవడమే లక్ష్యమన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.